# ఆత్మ బాప్తిస్మము

"అయితే ఆత్మపూర్ణులై యుండుడి. ఒకనినొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు, కీర్తించుచు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమునుగూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి" ఎఫెసీ. 5:18-21.

## పరిశుద్ధాత్మ బాప్తిస్మ చరిత్ర

1. "మనుష్యులందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను (అపో॥కార్య॥ 2:17).
2. "ఆత్మను ఆర్పకుడి" 1థెస్స. 5:19.
3. "మీరందరు భాషలతో మాటలాడవలెనని కోరుచున్నాను". 1కొరింథి. 14:5.
4. "భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాదు దేవునితో మాటలాడుచున్నాడు. మనుష్యుడెవడును గ్రహించడు గాని అతడు ఆత్మవలన మర్మములనుపలుకుచున్నాడు". 1కొరింథి. 14:2.
5. "భాషలతో మాటలాడుట ఆటంకపరచకుడి" 1కొరింథి. 14:40.

## ఈ పుస్తక సంగ్రహము

1. 'పరిశుద్ధాత్మ బాప్తిస్మము అందరికి' అని బైబిలులో నున్నది.

2. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారికి భూలోక భాష వచ్చినట్లు బైబిలులోనున్నది.
3. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారికి పరలోక భాష వచ్చినట్లు బైబిలులోనున్నది.
4. అందరు భాషలతో మాట్లాడవలెనని బైబిలులో నున్నది.
5. భాష వచ్చినవారు అర్ధముకొరకు ప్రార్థించవలెనని బైబిలులో నున్నది.
6. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామమున సంఘాధ్యక్షులు ఇచ్చే నీళ్ళ బాప్తిస్మము వేరైనట్లును పరిశుద్ధాత్మతో యేసు ప్రభువు ఇచ్చే పరిశుద్ధాత్మ బాప్తీస్మము వేరైనట్లును బైబిలులో కనబడుచున్నది. కాబట్టి త్రియేక దేవ నామమున నీళ్ళ బాప్తిస్మము పొందినవారు తర్వాత *పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చిన సంగతులన్నియు పూర్తిగా నేర్చుకొని అదికూడ పొందవలెను.*
7. నీళ్ళ బాప్తిస్మము పొందడములోనే పరిశుద్ధాత్మబాప్తిస్మము పొందడముకూడ ఉన్నదని కొందరు అభిప్రాయ పడుచున్నారు. దీనికి బైబిలులో ఆధారములేదు.

## పరిశుద్ధాత్మ బాప్తిస్మమునుగూర్చిన ప్రవచనములు

"పైనుండి మనమీద ఆత్మ కుమ్మరింపబడువరకు నగరి విడువబడును. జన సమూహముగల పట్టణము విడువబడును. కొండయు కాపరుల గోపురమును ఎల్లకాలము గుహలుగా ఉండును. అవి అడవి గాడిదలకు ఇష్టమైన చోట్లుగాను, మందలుమేయు భూమిగాను ఉండును. పైనుండి ఆత్మ మనమీద

కుమ్మరింపబడగా అరణ్యము ఫలభరితమైన భూమిగాను, ఫలభరితమైన భూమి వృక్ష వనముగాను ఎంచబడును. అప్పుడు న్యాయము అరణ్యములో నివసించును. ఫలభరితమైన భూమిలో నీతి దిగును. నీతి సమాధానము కలుగజేయును. నీతివలన నిత్యమును నిమ్మళము, నిబ్బరము కలుగును. అప్పుడు నా జనులు విశ్రమ స్థలమునందును, ఆశ్రయ స్థానములయందును, సుఖకరమైన నివాసములయందును నివసించెదరు. యెషయా. 32:14-17.

2. "అప్పుడు ఇశ్రాయేలీయులమీద నేను నా ఆత్మను కుమ్మరించెదను గనుక నేనికను వారికి పరాఙ్ముఖుడనైయుండను. ఇదే ప్రభువగు యెహోవా వాక్కు" యెహెజ్కేలు 39:29.

3. తర్వాత నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతును, మీ కుమారులును మీ కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు. మీ ముసలివారు కలలుకందురు. మీ యవ్వనస్థులు దర్శనములు చూతురు. ఆ దినములలో నేను పనివారిమీదను పనికత్తెలమీదను నా ఆత్మను కుమ్మరింతును. యోవేలు. 2:28,29.

4. "దావీదు సంతతివారిమీదను యెరూషలేము నివాసులమీదను కరుణనొందించు ఆత్మను, విజ్ఞాపనచేయు ఆత్మను నేను కుమ్మరింపగా వారు తాము పొడిచిన నామీద దృష్టియుంచి ఒకడు తన ఏక కుమారుని విషయమై దుఃఖించినట్లు, తన జ్యేష్ఠపుత్రుని విషయమై యొకడు ప్రలాపించునట్లు, అతని విషయమై దుఃఖించుచు ప్రలాపింతురు". జెకర్యా. 12:10.

5. 1) " మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మ మిచ్చుచున్నాను. అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటె శక్తిమంతుడు. ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడనుకాను. ఆయన పరిశుద్ధాత్మలోను, అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును". మత్తయి. 3:11.

2) "నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చితిని గాని ఆయన పరిశుద్ధాత్మలో మీకు బాప్తిస్మమిచ్చును". మార్కు. 1:8.

3) "నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను. అయితే నాకంటె శక్తిమంతుడొకడు వచ్చుచున్నాడు. ఆయన చెప్పుల వారును విప్పుటకు నేను పాత్రుడనుకాను. ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును". (లూకా. 3:16 ఇవి స్నానికుడైన యోహాను మాటలు).

6. "మీరు యెరూషలేమునుండి వెళ్ళక నా వలన వినిన తండ్రియొక్క వాగ్దానముకొరకు కనిపెట్టుడి; యోహాను నీళ్ళతో బాప్తిస్మమిచ్చెనుగాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరు". (అపో॥కార్య. 1:4-5 ఇవి ప్రభువు మాటలు).

**బైబిలులో పెంతెకొస్తు పండుగనుగూర్చి బహు విపులముగా వ్రాయబడిన అపోస్తలుల కార్యముల గ్రంథములోని 2వ అధ్యాయమంతయు ఇక్కడ ధ్యానపూర్వకముగా చదువవలెను.**

**బైబిలులోని 1కొరింథి 14వ అధ్యాయము తప్పక చదువవలెను**

అటు పిమ్మట అపోస్తలుడైన పౌలు ఆత్మవరములను గూర్చి, ఆత్మ వరములను వాడుకొను విధానమును గూర్చి, ఆత్మ

వరముల విషయములో తీసికొనవలసిన జాగ్రత్తలను గూర్చి పాటించవలసన క్రమములనుగూర్చి కలిగి ఉండవలసిన విశేషమైన మౌనమునుగూర్చి వివరముగా వ్రాసిన 1కొరింథి. 14వ అధ్యా॥ ఇక్కడ తప్పక చదువవలెను.

## పరిశుద్ధాత్మ పనులు

**(ఇవి యేసుప్రభువు ఉదహరించినవి)**

1. ఆయన మనతోకూడ నివసించును (యోహాను 14:17)
2. మనలో ఉండును (యోహాను 14:17)
3. సమస్తమును బోధించును (యోహాను 14:26)
4. ప్రభువు చెప్పినవి జ్ఞాపకముచేయును (యోహాను 14:26)
5. సర్వసత్యములోనికి నడిపించును, గ్రహింపజేయును (యోహాను 16:13)
6. సంభవింపబోవునవి తెల్పును (యోహాను 16:13)

## పరిశుద్ధాత్మ బిరుదులు

1. ఆయన శాశ్వత దేవుడు (హెబ్రీ. 9:14)
2. ఆయన సర్వవ్యాపియైన దేవుడు (కీర్తన. 139:7-13)
3. ఆయన సర్వజ్ఞానియైన దేవుడు (1కొరింథి. 2:10)
4. ఆయన సర్వశక్తిగల దేవుడు (లూకా. 1:35; రోమా. 15:19)
5. ఆయన మహిమాస్వరూపియైన ఆత్మ (1పేతురు 4:14)
6. ఆయన నూతన జన్మకర్త (యోహాను 3:5-6; 1యోహాను 5;4).

7. ఆయన ఆవేశము కలిగించు దేవుడు (2 తిమోతి. 3:16; 2పేతురు. 2:21).
8. ఆయన జ్ఞానమునకు మూలకర్త (యెషయా 11:2; యోహాను 14:26; 1కొరింథి. 12:8; యోహాను 16:13)
9. ఆయన అద్భుతమైన శక్తికి మూలకర్త (మత్తయి. 12:28; లూకా. 11:20; కార్య. 19:11; రోమా. 15:19)
10. ఆయన పనివారికి నియమించు దేవుడు (అపో॥ కార్య. 13:2-4; మత్తయి 9:38; కార్య. 20:28).
11. ఆయన సువార్త ప్రకటన స్థలముచూపు దేవుడు (కార్య. 16:6; 7:10)
12. ఆయన పరిశుద్ధులలో నివసించు దేవుడు (యోహాను 14:17; 1కొరింథి. 3:16; 6:19; 14:25)
13. ఆయన సంఘమునకు ఆదరణకర్తయైన దేవుడు (కార్య. 9:31; 2కొరింథి. 1:3)
14. ఆయన సంఘమును పవిత్రపరచు దేవుడు (యెహెజ్కేలు 37:28; రోమా. 15:16)
15. ఆయన సాక్ష్యమిచ్చు దేవుడు (హెబ్రీ. 10:5, 1యోహాను 5:9)
16. ఆయన ఒప్పించు దేవుడు (యోహాను 16:8-11)
17. ఆయన అదరణకర్తయైన దేవుడు (యోహాను 15:26)
18. ఆయన సత్యస్వరూపియైన ఆత్మ (యోహాను 15:26)
19. ఆయన తండ్రియొద్దనుండి బైలుదేరినవాడు (యోహాను 15:26)

20. ఆయన క్రీస్తువల్ల అనుగ్రహింపబడినవాడు (యోహాను 15:26)
21. ఆయన తండ్రివల్ల అనుగ్రహింపబడినవాడు (యోహాను 14:16)
22. ఆయన క్రీస్తు విజ్ఞాపనవలన వచ్చినవాడు (యోహాను 14:16)
23. ఆయన క్రీస్తు నామమున వచ్చినవాడు (యోహాను 14:16)
24. ఆయన క్రీస్తువలన తండ్రియొద్దనుండి పంపబడినవాడు (యోహాను 15:26, 16:17)
25. ఆయన సదా భక్తులలో నివసించువాడు (యోహాను 14:16)
26. ఆయన పరిశుద్ధులకు ఎరుకైనవాడు (యోహాను 14:17)
27. ఆయన పరిశుద్ధులకు బోధించువాడు (యోహాను 14:26)
28. ఆయన క్రీస్తునుగూర్చి సాక్ష్యమిచ్చువాడు (యోహాను 15:26)
29. ఆయన సంఘక్షేమకర్త (కార్య. 9:31)
30. ఆయన దేవుని ప్రేమననుగ్రహించువాడు (రోమా. 5:3-5)
31. ఆయన పరిశుద్ధులకు సంతోషము కలిగించువాడు (రోమా. 14:17; గలతీ. 5:22; 1థెస్స . 1:6).
32. ఆయన నిరీక్షణ కలిగించువాడు (రోమా 15:13; గలతీ. 5:5).
33. ఆయన సృష్టిచేయువాడు (యోబు 33:4)
34. ఆయన ప్రవక్తలద్వారా మాటలాడువాడు (కార్య. 1:16; 1పేతురు 1:11-12; 2పేతురు 1:21)

# పరిశుద్ధాత్మను గూర్చిన మరికొన్ని వాక్యములు

ఆదికాండము 1:2
ఆది. 41:38
నిర్గమ. 31:5
సంఖ్యా. 24:2
సంఖ్యా. 27:18
1సమూ. 10:10
యెషయా. 30:1
యెషయా. 42:1
యెష. 48:16
యెష. 63:10
యెహెజ్కే. 11:24
యెహెజ్కే. 36:27
యెహెజ్కే. 37:5,9,14
హగ్గయి. 2:5
మత్త. 1:18-20
మత్త. 3:16
మత్త. 10:16-20
మత్త. 12:31-32
మత్త. 22:43
మత్త. 28:19
మార్కు. 1:10
మార్కు. 3:29-30
మార్కు. 13:11
2దిన. 15:1
నెహెమ్యా. 9:20
యోబు. 32:8
కీర్తన. 51:11
కీర్తన. 139:7
కీర్తన. 143:10
లూకా. 11:13
లూకా. 12:10-12
లూకా. 24:49
యోహాను. 1:32-34
యోహాను. 4:23,24
యోహాను. 6:63
యోహాను. 7:39
యోహాను. 15:26,27
అపో॥కార్య. 5:3
కార్య. 5:32
కార్య. 6:10
కార్య. 7:55-59
కార్య. 8:15-18
కార్య. 8:29
కార్య. 8:29
కార్య. 9:17
కార్య. 9:31

లూకా. 1:14-17
లూకా. 1:26-35
లూకా. 1:14-43
లూకా. 1:67
లూకా. 2:26
లూకా. 2:32
లూకా. 4:1
లూకా. 4:18
రోమా. 8:23
రోమా. 8:26,27
రోమా. 9:3
రోమా. 15:13
రోమా. 15:19
1కొరింథి. 2:9-16
1కొరింథి. 3:16
1కొరింథి. 6:11,17,19
1కొరిం. 7:40
1కొరిం. 12:3,4; 10-11
2కొరిం. 1:22
2కొరిం. 3:6
2కొరిం. 3:7
2కొరింథి. 5:5
2కొరిం. 13:14
గలతీ. 3:3
గలతీ. 3:13

కార్య. 10:19,20
కార్య. 10:47
కార్య. 11:12
కార్య. 13:2,9,52
రోమా. 8:9
రోమా. 8:11-14
రోమా. 8:16

ఎఫెసీ. 4:23
ఫిలిప్పీ. 1:20
ఫిలిప్పీ. 2:1
ఫిలిప్పీ. 3:3
2థెస్స. 2:13
1తిమో. 3:16
తీతు. 3:5
హెబ్రీ. 3:7-11
హెబ్రీ. 10:15
హెబ్రీ. 10:29
1పేతు. 1:2
1పేతు. 1:11
1పేతు. 3:12
1పేతు. 3:18
1పేతు. 4:14
2పేతు. 1:21
1యోహా. 2:20-27

గలతీ. 4:6
గలతీ. 5:16-18
గలతీ. 5:22-25
గలతీ. 6:8
ఎఫెసీ. 2:18
ఎఫెసీ. 2:22
ఎఫెసీ. 3:16
ఎఫెసీ. 4:4
1యోహా. 4:2
1యోహాను. 4:13
1యోహాను. 5:6
ప్రకటన. 2:7
ప్రకటన 2:29
ప్రక. 2:11
ప్రక. 4:5
ప్రక. 22:17

## పరిశుద్ధాత్మ బాప్తిస్మ చరిత్ర సంగ్రహము

**1. ప్రవచనములు:-** 1) "నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతును" అని దేవుడు యోవేలు అను దీర్ఘదర్శికి చెప్పెను. 2) యేసుక్రీస్తు ప్రభువు పరిశుద్ధాత్మ బాప్తిస్మ మిచ్చునని, తత్సమకాలికుడైన యోహాను అను నొక మహర్షి ప్రకటించెను. 3) కొద్ది దినములలో మీరు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందెదరు అని క్రీస్తు ప్రభువు తన శిష్యులతో చెప్పెను.

**2. ప్రవచనముల నెరవేర్పు:-** నూట ఇరువదిమంది క్రీస్తు విశ్వాసులు యెరూషలేము అను యూదుల పట్టణమున పదిరోజులు ప్రార్థన కూటము పెట్టుకొని ప్రార్థించుచు కనిపెట్టుచుండగా దైవాత్మ వారిమీదికి వచ్చి దిగెను. ఈ కార్యమునకే పరిశుద్ధాత్మ బాప్తిస్మమని పేరు. దీనినే ఆత్మ కుమ్మరింపు పరిశుద్ధాత్మాభిషేకము అనికూడ అందురు. అందుచేత వారందరు పరిశుద్ధాత్మ పరిపూర్ణులైరి. అప్పుడు వారికి సర్వదేశముల భాషలతో మాటలాడగల వరము లభించెను.

**3. నెరవేర్పు రోజు:-** ఇది జరిగినరోజు యూదులకు పెంతెకొస్తు పండుగరోజు. అయితే అది క్రీస్తు జనమునకు పరిశుద్ధాత్మ పండుగైనది. పెంతెకొస్తు పండుగకు సర్వలోక ప్రాంతములనుండి వచ్చియుండి, తమకు తెలియకుండ ప్రతి జనాంగ ప్రతినిధులుగా నేర్పడినవారు ఈ చిత్రమునుచూచి చాలా ఆశ్చర్యపడిరి.

క్రీస్తు భక్తులు వారివారి భాషలలో క్రీస్తుమతము బోధించిరి. ఆ బోధ విన్నవారిలో మూడువేలమంది క్రైస్తవ మతమున ప్రవేశించిరి. ఆవేళ క్రీస్తుమత సంఘ జన్మదినమాయెను. అదివరకున్న మతము యూదుల మతము. క్రీస్తు వచ్చునని నిరీక్షించినది యూదుల మతము. యూదులు నిరీక్షించిన క్రీస్తు వచ్చెనని బోధించునది క్రైస్తవమతము. అందుచేత యూదులందరు క్రైస్తవులై పోవలసినదెగాని కాలేదు. ఆ నూట ఇరువదిమంది పరిశుద్ధాత్మ బాప్తిస్మమొంది ఎన్నడును నేర్చుకొనని భాషలతో దైవమహాత్కార్యములను వివరించుచుండగా కొందరు ఆనందింపక, వీరు క్రొత్త మద్యముతో నిండియున్నారని అపహాస్యము చేసిరి. అప్పుడు పేతురను నొక దైవజనుడు సంగతులు తేటగా విశదపరచెను. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందగోరువారు మొదట మారుమనస్సు పొందవలెననియు తరువాత నీళ్ళ బాప్తిస్మము నొందవలెననియు అప్పుడు పరిశుద్ధాత్మ దానము కలుగుననియు పేతురు చెప్పెను. ఇదివరకు చెప్పినట్లు అప్పుడే 3000 మంది క్రైస్తవులైరి.

**4. నేటి నెరవేర్పు:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము సర్వజనులకు అని యోవేలు ప్రవచించిన మాటనుబట్టియు, "ఈ

వాగ్ధానము మీకును, మీ పిల్లలకును, దూరస్తులందరికిని అనగా ప్రభువైన మన దేవుడు తనయొద్దకు పిలిచిన వారికందరికిని చెందును" అని పేతురు చెప్పిన మాటనుబట్టియు చూడగా పరిశుద్ధాత్మ బాప్తిస్మము అందరికిని అని స్పష్టమగుచున్నది. పరిశుద్ధాత్మను అందరికి అనుగ్రహింతునని దేవుడిచ్చిన వాగ్దానమెప్పుడు ప్రజలలో పూర్తిగా నెరవేరును? అందరును వాగ్ధానము తెలిసికొని యేసుప్రభుని నమ్మి, ఆత్మ స్నానమొందినప్పుడే. దేవుడిచ్చు దానములలో కొన్నిటి తట్టు చేయిచాపు నీవు పరిశుద్ధాత్మ బాప్తిస్మము తట్టు ఎందుకు చేయిచాపవో! ఇది తక్కినవైన దానములకంటె తక్కువ దానమా? నేటి సంఘవృత్తాంతములు చదివిన యెడల అనేకమంది మన కాలములోకూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుచున్నట్లు తెలియగలదు.

## ఆత్మ స్నానాభిమానులకు మందలింపు

**I.** 1) "కాబట్టి నేను మీతో చెప్పునదేమనగా, మనుష్యులు చేయు ప్రతి పాపమును, దూషణయు వారికి క్షమింపబడును గాని ఆత్మ విషయమైన దూషణకు పాపక్షమాపణ లేదు" (మత్తయి. 12:31-32).

2) "సమస్త పాపములును, మనుష్యులుచేయు దూషణలన్నియు వారికి క్షమింపబడునుగాని, పరిశుద్ధాత్మ విషయము దూషణ చేయువాడెప్పుడును క్షమాపణ పొందక, నిత్య పాపము చేసినవాడై యుండునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (మార్కు. 3:28,29).

3) “మనుష్యకుమారునిమీద వ్యతిరేకముగా ఒక మాట పలుకు వానికి పాపక్షమాపణ కలుగునుగాని పరిశుద్ధాత్మను దూషించువానికి క్షమాపణలేదు” (లూకా. 12:10). ఇవి రక్షకుని వాక్యములు.

II. “ఒకసారి వెలిగింపబడి, పరలోకసంబంధమైన వరమును రుచిచూచి పరిశుద్ధాత్మలో పాలివారై దేవుని దివ్యవాక్యమును, రాబోవు యుగసంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయినవారు తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువవేయుచు బాహాటముగా అవమానపరచుచున్నారు. గనుక మారుమనస్సు పొందునట్లు అట్టివారిని మరల నూతనపరచుట అసాధ్యము. ఎట్లనగా, భూమి తనమీద తరచుగా కురియు వర్షమును త్రాగి ఎవరికొరకు వ్యవసాయము చేయబడునో వారికనుకూలమైన పైరులను ఫలించుచు దేవుని ఆశీర్వచనము పొందును. అయితే ముండ్ల తుప్పలును గచ్చ తీగెలును దానిమీద పెరిగినయెడల అది పనికిరాదని విసర్జింపబడి శాపము పొందతగిన దగును. తుదకది కాల్చివేయబడును” (హెబ్రీ. 6:4-9) ఇవి పౌలు మాటలు.

III. “వారు నీతిమార్గమును అనుభవపూర్వకముగా తెలిసికొని తమకప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె ఆ మార్గము అనుభవపూర్వకముగా తెలియకయుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్ళినట్టును అను నిజమైన సామితె చొప్పున వీరికి సంభవించెను. (II పేతురు. 2:21,22).

# ప్రార్థన మెట్లు

ప్రార్థన గదిలోనికి వెళ్ళి మోకరించి చేయవలసిన ప్రార్థన పద్ధతి : మెట్లవారీగా దీనిలో పొందుపరచినాము.

***1వ మెట్టు మనోనిదానపు మెట్టు:–*** చెడుగును, మంచిని మరువవలెను. సమస్తమును మరువవలెను. దేవుడు మనయెదుట ఉన్నాడని మాత్రము నమ్మవలెను. మన ధ్యానము పొడుగున ఆయన తలంపే ఉండవలెను. మనస్సును మరిదేనిమీదికిని వెళ్ళనీయరాదు.

***2వ మెట్టు ఒప్పుదల మెట్టు:–*** 1) దేవుడిచ్చిన పది యాజ్ఞలు బైబిలులో ఉన్నవి. అవి తలంచుకొనినయెడల మనలో గల పాపములన్నియు జ్ఞాపకమువచ్చును. అవి దేవుని యెదుట ఒప్పుకొనవలెను. మనోవేదనను, కన్నీళ్ళను కలిగించుకొనవలెను. తలంపు, చూపు, వినికి, మాట, ప్రయత్నము, క్రియ వీటి మూలముగా జేసిన పాపములవలన దేవునిని దుఃఖ పెట్టితినిగదా అని దుఃఖింపవలెను.

2) మనుష్యులకు విరోధముగా జేసిన పాపములు ఆ మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను, ఇవి దేవుని యెదుటను ఒప్పుకొనవలెను.

***3వ మెట్టు ప్రమాణపు మెట్టు:–*** 1) “నాకు తెలిసిన పాపములు ఇకమీదట చేయును. చేయకుండ ప్రయత్నించెదను” అని దేవుని ఎదుట ప్రమాణము చేయవలెను.

2) తీర్మానము : ‘దేవా! నీవు ఏది చెప్పితే అది చేయుదును నా ఇష్టప్రకారము కాదు నీ ఇష్టప్రకారమే చేయుదునని’ దేవునికి మన తీర్మానము వినిపించవలెను.

3) వ్రతము : "ఎన్ని శోధనలు, ఎన్ని కష్టములు, ఎన్ని సందేహములు, ఎన్ని నిందలు, ఎన్ని ఆటంకములు, ఎన్ని ఇబ్బందులు, ఎన్ని నష్టములు, ఎన్ని క్రీస్తు విరోధ బోధలున్నను నిన్ను విడువను. ఇదే నా వ్రతము అని దేవుని యెదుట పలుకవలెను.

***4వ మెట్టు : సమర్పణ మెట్టు:-*** 'తండ్రీ! నీవు నాకిచ్చిన వన్నియు నీకు సమర్పించుకొనుచున్నాను' అనియు; అనగా నా శరీరము, నా ఆత్మ, నా ఆస్తి, నా సేవ, నా కష్టములు, నా జీవిత కాలము నీకు సమర్పించుకొనుచున్నాను అని దేవుని యెదుట చెప్పుకొనవలెను.

***5వ మెట్టు : విశ్వాసపు మెట్టు:-*** 'దేవా! నా పాపములన్నియు క్షమించివేసినావు అనియు, నా ప్రమాణము, తీర్మానము, వ్రతము, సమస్తము అంగీకరించినావనియు' పూర్తిగా నమ్ముచున్నాను అని దేవుని యెదుట చెప్పుకొనవలెను.

***6వ మెట్టు స్తుతి మెట్టు:-*** 'నా పాపములన్నియు క్షమించి వేసినావనియు, నా ప్రమాణము, తీర్మానము, వ్రతము, సమస్తము అంగీకరించినావనియు ఆనందించి, నిన్ను స్తుతించుచున్నాను' అని దేవుని యెదుట చెప్పుకొనవలెను.

**7వ మెట్టు అంశ ప్రార్థన మెట్టు:-** ఈ మెట్టుమీద నీ ఇష్టము వచ్చిన సంగతిని గురించి ప్రార్థింపవచ్చును. ప్రార్థనవాలు, బైబిలులోని అనుభవము, వాక్యబోధనాశక్తి, పాపమును గెల్చుబలము, ఆరోగ్యము, విద్య, ధనము, పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఈ మొదలైన వాటిలో నీకు అవసరమైనదేదైనా ఉదహరించి అది దయచేయుమని ప్రార్థింపవచ్చును.

**8వ మెట్టు : విశ్వాసపు మెట్టు:–** ఇదివరకు వచ్చిన విశ్వాసపుమెట్టు మీద పాపక్షమాపణ దొరికినదని నమ్మినావు. ఈ విశ్వాసపు మెట్టుమీద ఏడవ మెట్టుమీద అడిగినది దొరికినదని నమ్మవలెను.

***9వ మెట్టు : స్తుతి మెట్టు:–*** ఇదివరకు వచ్చిన స్తుతి మెట్టుమీద క్షమాపణ దొరికినదని స్తుతించినావు గనుక ఈ స్తుతి మెట్టుమీద ఏడవ మెట్టుమీద అడిగినది దొరికినదని స్తుతించవలెను.

***10వ మెట్టు : కనిపెట్టు మెట్టు:–*** ఈ మెట్టుమీద పై మెట్లు మీద ఉన్న ప్రార్థనలు కట్టిపెట్టి, ఊరకనెయుండుము, ప్రభువు నీ ప్రార్థనలకు జవాబుగా ఏమి తలంపులు పుట్టించునో, వాటిని అందుకొనుటకొరకు కనిపెట్టవలెను.

షరా:– మీ ఇష్టము వచ్చిన సమయమందు, మీ ఇష్టము వచ్చినంతసేపు ఈ మెట్లమీద ఉండవచ్చును.

**తెలుగు క్రైస్తవ కీర్తనలలో, దైవజనులు బహుగా ప్రార్థించుటను గూర్చి వ్రాసిన 54వ కీర్తనను, ధ్యాన పూర్వకముగా పాడుకొనుము. అపుడు ఆత్మ తండ్రి కొరకు ఏలాగు వేడుకొనవలెనో, నీకు బోధపడును.**

## హెచ్చరిక

**చేసిచూడండి:–** ప్రభువునందు ప్రియులారా! పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనే ఈ గొప్ప అంశమును గురించి బహు జాగ్రత్తగా ఆలోచించండి. మీరు ఉంటూఉన్న మీరు వింటూ ఉన్న ఉంటూ ఉన్న కూటములను ఆధారము చేసికొనక దేవుని వాక్యములో దీనిని గురించియున్న సంగతులను ఆధారము చేసికొనండి.

**1) పరీక్ష:-** కూటముల వృత్తాంతములు బైబిలు వాక్యములకు సరిపోవుచున్నవో లేవో పరీక్షించండి. తొందరపడక శాంతించి దీర్ఘాలోచన చేయండి. కృప మీకు తోడైయుండునుగాక! సత్యసిద్ధాంతములను చూచి అసత్య సిద్ధాంతములని; అసత్య సిద్ధాంతములను చూచి సత్యసిద్ధాంతములనియు పొరబడకండి. సంగతులను పూర్తిగా వినక ముందు ఇది తప్పు అని తీర్మానించకండి. పరిశుద్ధాత్మ మీకిచ్చిన జ్ఞానమును, విశ్వాసమును బాగుగా వాడుకొనుచు సంగతులు తరచండి.

**తృణీకారము:-** పూర్తిగా పరీక్షించనిదె 'ఇవి దయ్యాలకూటములు అటువంటి కూటములు' ఇటువంటి వారి కూటములు అని చెడ్డ పేర్లు పెట్టకండి. క్రీస్తుదయ్యము పట్టినవాడనియు సైతాను శక్తివల్లనె అద్భుతములు చేయువాడనియు ప్రభువుకు సైతము చెడ్డపేర్లు పెట్టిన యూదులు ఎంత పొరపాటుపడిరో జ్ఞాపకము తెచ్చుకొనండి.

**చేసిచూడండి:-** 1) పరిశుద్ధాత్మను గురించియున్న దైవ గ్రంథ వాక్యములు బాగా చదువుకొనండి. 2) మీరు ప్రార్థన గదిలోనికి వెళ్ళండి. 3) తలుపు వేసికొనండి మోకరించండి. మనో నిదానము అభ్యసించండి. అనగా సమస్తము మరచిపోవుటకును ఒక్క దేవుని మాత్రమే జ్ఞాపకము తెచ్చుకొనుటకు ప్రయత్నించండి. 4) తలంపువల్లను, మాట వల్లను, వినికివల్లను, చూపువల్లను, ప్రయత్నమువల్లను, క్రియవల్లను చేసిన పాపములు దేవుని యెదుట ఒప్పుకొనండి. **మీ చెడు నైజము ఒప్పుకొనండి.** మనుష్యులకు విరోధముగా చేసిన పాపములు మనుష్యుల యెదుట ఒప్పుకొనండి,

సమాధానపడండి 5) ఇకమీదట తెలిసిన ఏ పాపము చేయకుండ ప్రయత్నించెదనని దేవుని యెదుట ప్రమాణము చేయండి.

6) దేవా! నీవేది చెప్పుదువో అదే నేను చేస్తాను అని జెప్పి సమస్తమును దేవునికి సమర్పించుకొనండి.

7) ఆ తర్వాత ఆత్మ నిమిత్తము ప్రార్థించి, స్తుతించుచు, కనిపెట్టండి. అపుడు మీ కోరిక నెరవేరును.

## పరిశుద్ధాత్మను గురించిన కీర్తనలు

ఆంధ్రక్రైస్తవ కీర్తనల పుస్తకములోని (......251) కీర్తనలు పాడవలెను.

**తెలుగు క్రైస్తవ కీర్తనలలోని 9వ కీర్తననను మనో నిదానముతో పాడవలెను.**

## 4. పెంతెకొస్తు

## Descent of the Holy Ghost

## పరిశుద్ధాత్మ యొక్క కుమ్మరింపు

## పరిశుద్ధాత్మ బాప్తిస్మ ప్రార్థన స్తుతి

### త్రియేక దేవుని స్తుతులు

### 1. తండ్రికి స్తుతి

దయాస్వరూపుడవైన తండ్రీ! నీతిమంతుడవైన తండ్రీ! సత్యవంతుడవైన తండ్రీ! తండ్రీ అను పేరుమీద ప్రసిద్ధికెక్కుచున్న తండ్రీ! నీకు అనేక స్తోత్రములు. నాహృదయమంతటితో నిన్ను స్తుతించుచున్నాను. నాకున్న విశ్వాసముతో, శక్తితో, జ్ఞానముతో, నిన్ను స్తుతించుచున్నాను. నేను నిన్ను స్తుతించుటకు యోగ్యుడను

కాను. భూమిమీద నిన్ను బాగుగా స్తుతించే విశ్వాసులును, అంతకంటె ఎక్కువగా పరలోకములో స్తుతించే పరిశుద్ధులును, దేవలోకములో ఇంకా బాగుగా స్తుతించే దేవదూతలును ఉండగా, నిన్ను స్తుతించుటకు నేను ఏపాటివాడను! నా స్తుతి ఏపాటిది! అయినప్పటికిని నిన్ను స్తుతించవలెనని నీ వాక్యములో ఉన్నది గనుక స్తుతించుచున్నాను. నీ కుమారునిబట్టి నీవు నాకు ప్రత్యేకమైన రీతిగా నా తండ్రివైయున్నావు గనుక నిన్ను స్తుతించుచున్నాను. నీవల్ల ఉపకారములు పొందినాను గనుక నిన్ను స్తుతించుచున్నాను. నీవు నన్ను కలుగజేసిన తండ్రివి గనుక నిన్ను స్తుతించుచున్నాను. నిన్ను స్తుతించుటకు నేను ఋణస్థుడనైయున్నాను గనుక స్తుతించు చున్నాను. స్తుతులు పొందుటకు నీవు ఒక్కడవే పాత్రుడవు గనుక నిన్ను స్తుతించుచున్నాను.

సమస్తమును నాకు ఇచ్చే నిమిత్తమై నన్నును, సమస్తమును కలుగజేసిన తండ్రీ నీకు స్తోత్రము. నాకు వాక్యమిచ్చిన తండ్రీ నీకు స్తోత్రము. ఓ దానకర్తవైన తండ్రీ, సమస్తమునిచ్చే తండ్రీ నీకు స్తోత్రములు. నీకెన్ని స్తుతులు అర్పించినను నీ ఋణము తీరదు, నాకు సంతుష్ఠి గలుగదు. ఎందుకంటే నా స్తుతులకంటే నీ ఉపకారములే ఎక్కువ. నీవే ఎక్కువ. ఇదివరకే అన్ని ఇచ్చియుండుట మాత్రమేకాక ఇకమీదట అన్ని ఇచ్చే తండ్రివి. గనుక స్తోత్రము. మహిమాస్వరూపుడవైన తండ్రీ! నాకు ఇవ్వడములో నీ మహిమ బయలుపడినది, నీ ప్రేమ వెల్లడియైనది. ఆహా తండ్రీ! నీకనేక స్తోత్రములు. 'సర్వజనుల మీద నీ యాత్మను కుమ్మరిస్తాను అను మహాద్భుతమైన వాగ్ధానము యోవేలుచేత నాకు అందించినావు. సర్వజనులలో ఈ పాపి కూడ

ఉన్నాడు. నీయాత్మను నామీద కుమ్మరించుమని నీ వాగ్ధానమును బట్టి నిన్ను బ్రతిమాలుకొనుచున్నాను. నీవు ఆడితప్పనివాడవు, పక్షపాతము లేనివాడవు. గాన నీవు నాకుకూడ ఇస్తావు. అన్ని ఇచ్చే తండ్రీ నీ ఆత్మనుకూడ నాకు ఇచ్చేవాడవై యున్నావు. గనుక నీకు స్తోత్రము. ఆమేన్.

## 2. కుమారుడగు తండ్రికి స్తుతి

యేసుక్రీస్తు ప్రభువా! నీవు పరిశుద్ధాత్మతోను, అగ్నితోను బాప్తిస్మము ఇస్తానని నీ రాయబారియైన యోహానుద్వారా సెలవిచ్చినావు గనుక నీకు అనేక వందనములు.

'పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువానికి ఎంతో నిశ్చయముగా తన పరిశుద్ధాత్మను ననుగ్రహించును' అని సెలవిచ్చిన రక్షకా! నీకు అనేక వందనములు. యోహాను నీళ్ళతో బాప్తిస్మమిచ్చెనుగాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురని నీ శిష్యులకు నిశ్చయముగా చెప్పిన యేసుప్రభువా! నీకనేక వందనములు. తుదకు నీ శిష్యులకు ఒకనాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చిన స్నానకర్తవైన యేసుప్రభువా! నీకనేక వందనములు. నాకు కూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఇస్తావు గనుక నీకు వందనములాచరిస్తున్నాను. ఓ రక్షకా! సర్వలోక రక్షకా! నాప్రియ రక్షకా! నీకు నా కృతజ్ఞతగల వందనములు. నీ ప్రాణమిచ్చిన రక్షకా! నీకు లెక్కకు మించిన వందనములు. నీ ఆది శిష్యులకు మాత్రమేకాక, ఈ కాలపు శిష్యులకుకూడ నీ ఆత్మ బాప్తిస్మమిచ్చినందులకు నీకనేక వందనములు. తండ్రియొక్క ప్రేమను బైలుపరచిన ప్రభువా నీకనేక వందనములు. తండ్రియొక్క

ప్రేమను బైలుపరచిన ప్రభువా నీకనేక వందనములు. ఓ ప్రాణ రక్షకా! తండ్రియును, నీవును, ఆత్మయును నాలో ఉన్నారని నమ్ముచున్నాను, గాని నీవు పరిశుద్ధాత్మ బాప్తిస్మ మిచ్చుటవలన నాకు ప్రత్యేకమైన రీతిగా నీ ఆత్మ నింపుదల, నివాసము అనుగ్రహించుటయైయున్నదని నేను గ్రహించుచున్నాను. గనుక నీకు అనేక వందనములు. "వారు మిమ్మును అప్పగించునప్పుడు ఎలాగు మాట్లాడుదుము? ఏమి చెప్పుదుము? అని చింతింపకుడి. మీరు ఏమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకు అనుగ్రహింపబడును. మీ తండ్రి మీలోనుండి మాట్లాడుచున్నాడే గాని మాట్లాడువారు మీరు కాదు, పరిశుద్ధాత్మ అని శిష్యులకు సెలవిచ్చిన నీకు వందనములు. పరిశుద్ధాత్మను హృదయము లోపల కలిగియుండుటచేత ఎంత ధైర్యవంతుల మగుదుమో, ఎంత వాక్చాతుర్యము గలవారమగుదుమో ఈ మాటవల్ల తెలియపరచినందుకు నీకు అనేక వందనములు.

సువార్త బోధించే సేవకులను అపాయములోనికి వెళ్ళుడని చెప్పి, ఉపాయము నేర్పకుండ ఉండే రక్షకుడవు కావు. ఓ ప్రభువైన యేసూ! మాకు బదులుగ నీవు ఉండుటచే నీవు నీళ్ళ బాప్తిస్మముకూడ పొంది, ఈ రెండు విషయములలో మాకు మాదిరి చూపినందుకు నీకనేక వందనములు.

ఆత్మస్నానము పొందిన వెంటనే శోధింపబడుటకు నీవు ఆత్మచేతనే నడిపించబడినట్లు నీ చరిత్రలో చూచుచున్నాము. నీవు జయించినావు గనుక నీ జయమే మా జయము. ఓ జయశాలివైన రక్షకా! మేముకూడ ఆత్మబాప్తిస్మము పొందిన తరువాత ఆత్మచేత నడిపించబడి, సాతానుచే శోధింపబడుదుము. అప్పుడు నీ

జయమును పొందుదుమని తెలిసికొని నీకు వందనములు అర్పించుచున్నాము. నేను తండ్రిని వేడుకొందుననియు, మీయొద్ద ఎల్లప్పుడు ఉండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియైన ఆత్మను అనుగ్రహించుననియు నీవు నీ శిష్యులకు పరిశుద్ధాత్మ తండ్రి రాకను గూర్చి తెలియజేసినందుకు చాల వందనములు. ఈ నీ ప్రవచనము నాలోకూడ నెరవేర్తువని నమ్మి వందనములు చెప్పుచున్నాను. ఓ యేసుప్రభువా! ఇంకొకమాట కూడ సెలవిచ్చినావు. మీరు ఆయనను ఎరుగుదురు అని చెప్పినావు. అవును తండ్రీ, మేము నీటి బాప్తిస్మము పొందినప్పుడే తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల నామమందు మామీద నీళ్ళుపడినప్పుడే, ఆయన మాలోనికి వచ్చినారు. మరియు ఆయనను గురించి నీ వాక్యబోధవల్ల విన్నాము. మాకు పూర్తిగ తెలియకపోయినను, కొద్దిగానైనను ఆయనను ఎరుగుదుము అని ఒప్పుకొనుచున్నాను. నీకనేక వందనములు. ఆయనను నేను ఇప్పుడు ఎరిగియున్న దానికంటె ఇంకా ఎక్కువగా ఎరిగియుండే నిమిత్తమై ఆయన కుమ్మరింపు దయచేస్తావని నమ్మి వందనములు చేయుచున్నాను. మరియు లోకరక్షకా! ఆయన మీతోకూడ నివసించును అని వాక్కిచ్చినావు. ఓహో! ఇదెంత గొప్ప భాగ్యము! ఇదెంత ఐశ్వర్యము! స్నేహితులు మా దగ్గరయుంటేనే ఎంతో ఆనందముగదా? ఆయనే మాతో యుంటే ఇంకా ఎంత ఆనందమో, ఏమని వర్ణించగలను. రక్షణకర్తవైన తండ్రీ! యీ భాగ్యము కలిగేటట్లు నీయాత్మ కుమ్మరింపు సిద్ధింపజేతువని నమ్మి నిన్ను వందించుచున్నాను.

'ఆయన మీలో ఉండును' అనికూడ మాట ఇచ్చియున్నావు. ఇది మరింత గొప్ప భాగ్యము. ఏమి చెప్పవలెనో నాకు తోచడములేదు. విమోచన తండ్రీ! ఆయన నాలో ఉండేటట్లు కుమ్మరిస్తావా? ఆహా! నేనెంత ధన్యుడను! నా ధన్యత ఏమని చెప్పను! నా కృతజ్ఞత ఏలాగు వెల్లడించవలెనో నాకు తోచడములేదు. పరిశుద్ధాత్మ దేవుడు పాపినైన నాలోనా ఉండడము! ఏమి వింత! ఎంత గొప్ప అద్భుతము! ఎంత విచిత్రమైన కథ! ఇది ఏలాగో గ్రహించలేను. నేను ఉండగానే ఆయనకూడ నాలో ఉండడమేలాగో తెలియదు. అయినను ఆయన నాలో ఉండడము నిజమేనని నమ్ముచున్నాను, నీకు వందనములు సమర్పించు కొనుచున్నాను. ఆయన నాలో ఉండడమనే తలంపు ఎంత సంతోషకరమైనది! తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలనే త్రియేక దేవుడు నాలో ఉండడము ఎంత మనోహరమైన సంగతి! ఎంత వినోదము! ఇది నాకైతే అసాధ్యము కాని నీకైతే సాధ్యము గనుక నీకు లెక్క పెట్టుటకు వీలుకానన్ని వందనములు. "నేను నా తండ్రియందును, మీరు నాయందును, నేను మీయందును ఉన్నామని" వినిపించినావు వందనములు! వందనములు! వందనములు. ఆదరణకర్త అనగా నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయునని నా ప్రాణరక్షకా! నీవు బోధించినావు, నీకు అనేక నమస్కార వందనములు. ఆయన నాలో ఉండి, నీ సంగతులు జ్ఞాపకముచేసి బోధించేటందుకు, ఆయనను నాపై కుమ్మరిస్తావని విశ్వసించుచు ప్రాణకర్తా! నిన్ను వందించుచున్నాను. ఆయన మాకు సమస్తము బోధించెదరని

పలికినావు. ఆ సమస్తము నాకాయన బోధించేటపుడు నా మనస్సు ఎంతగా ఆనందించునో! ఎంతగా మురియునో! జీవ రక్షకా! నీకు ఎన్నో వందనములు. తండ్రియొద్ద నుండి బైలుదేరే సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నిన్నుగూర్చి సాక్ష్యమిచ్చునని ఓ సత్యరక్షకా నీవు సెలవిచ్చియున్నావు. పరిశుద్ధాత్మ తండ్రిని గురించి నీవు సెలవిచ్చిన మాటలు ఒకదాని కంటె ఒకటి ఆశ్చర్యముగానున్నవి. ఒకదానిలోనున్న సంగతికంటే ఇంకొక దానిలో ఎక్కువ సంగతి ఉన్నది. ఆయనను గురించి నీవు వర్ణిస్తు వచ్చిన ఈ వర్ణన మాటలు నేను తలంచుకొనుచున్న కొలది నాకు ఎక్కువ నోరూరుచున్నది. తప్పకుండ ఆయన బాప్తిస్మము నాకు ప్రసాదిస్తావని ధృఢముగా నమ్ముచున్నాను. ఓ పూర్ణ రక్షకా! ఎంతో ఎక్కువగా నిన్ను వందించుచున్నాను. నీవు చెప్పిన ఆ ఆదరణకర్త! ఆ సత్యస్వరూపి! ఆ నా నివాసి! ఆ నాలోని నివాసి! ఆ పరిశుద్ధాత్మ ఎంత వర్ణనగలవాడో ఏలాగు ఊహించగలను? నేను వెళ్ళినయెడల ఆయనను మీ మీదకు పంపుదును అని అన్నావు. సర్వజనరక్షకా! నీవు వెళ్ళనూ వెళ్ళినావు; ఆయనను మొదటి శిష్యులలోనికి పంపనూ పంపినావు. నీకు ఆగని వందనములు. ఆయనను నాయొద్దకు పంపుదువని ఎంతో నమ్ముచున్నాను. ఎంతో వందించుచున్నాను. ఆయన వచ్చి లోకము తన పాపము ఒప్పుకొనేటట్లు, చేయును అని తెలియపరచినావు. ఓహో పాపపరిహార రక్షకా! అది ఎప్పుడు జరుగును? నీ సంఘము తన పాపమును ఒప్పుకొన్నట్లు లోకముకూడా తన పాపమును ఎప్పుడు ఒప్పుకొనునో ఆ దినము ఎంత శాంతిగల దినముగా నుండునో! ఎంత ప్రభావముగల దినముగా నుండునో! ఎంత

మార్పుగల దినముగా నుండునో! ఎంత అనుమతిగల దినముగా నుండునో! ఆ దినము కోసరము నేను కనిపెట్టుచున్నాను. లోకములో లెక్కకు ఒక్కరు మాత్రమే తన పాపములు ఒప్పుకొన్నప్పుడు పరలోకములో ఎంతో సంతోషము కలుగును కదా! ఆ దినమున లోకమంతయు తన పాపమును ఒప్పుకొంటే అది ఎంత అద్భుతముగా నుండును! అట్టి మార్పును కలిగించే పరిశుద్ధాత్మను నాలో కుమ్మరించి తీరుదువని పూర్తిగా నమ్ముచున్నాను, నిన్ను వందించుచున్నాను. నిన్ను ఒప్పుకొనక పోవడమే లోకము చేయుచున్న మహా గొప్ప పాతకము అని నాకు తోచుచున్నది. తక్కిన పాపములతోపాటు లోకము ఈ పాపమును కూడ ఒప్పుకొనునని నేను గ్రహించుచున్నాను.

ఓ యేసు తండ్రీ! అట్టి పనిచేసే పరిశుద్ధాత్మను నాయొద్దకు ప్రత్యేకమైన రీతిగా పంపిస్తావని నమ్ముచు నిన్ను వందించుచున్నాను. ఆయన నీతినిగూర్చి లోకమును ఒప్పుకొనేటట్లు చేయుననికూడ సెలవిచ్చినావు. ఓహో! యేసురాజా! ఇదెంత గొప్పమార్పు! ఇప్పుడైతే లోకము చేస్తున్న క్రియలు స్వనీతిమీద ఆనుకొనియున్నవి. నీవు సంపాదించి పెట్టిన నీతిని లోకము అంగీకరించడములేదు. అప్పుడైతే నీ నీతి ఎంత ప్రశస్తమైనదో లోకము తెలిసికొనును. ఈ సంగతి మాకు తెల్పిన నీకు వందనములు. స్వంత క్రియలవల్ల, ఆచారములవల్ల, స్వంత ప్రయత్నములవల్ల, ఏ మాత్రము రక్షణలేదు గాని నీవు చేసిన క్రియల వల్లనే రక్షణ అని ఆ దినమందు లోకము తెలిసికొనును గదా! ప్రభువా! అట్టి వింత మార్పు కలిగించే పరిశుద్ధాత్మను నాలోనికి పంపిస్తావని తెలిసి నీకు వందనములు పలుకుచున్నాను.

ఆయన తీర్పునుగూర్చియు లోకమును ఒప్పుకొనజేయునని సెలవిచ్చినావు ఓ క్రీస్తురాజా! ఈ మార్పు నిమిత్తమైకూడ నేనానందించుచున్నాను. దేవుడు అన్యాయస్థుడనియు; తప్పుచేసిన వారిని శిక్షించక తప్పు చేయనివారినే శిక్షించుననియు; ఆయన తీర్పు న్యాయము కాదనియు లోకమిప్పుడు తలంచుచున్నది. అయితే, ఆ దినమున లోకము దేవునితీర్పు న్యాయమైనదని గ్రహించగలదు. ఇట్టి గ్రహింపు కలుగుటకు పరిశుద్ధాత్మ పనియే కారణమని కనబడు చున్నది. అట్టి పరిశుద్ధాత్మను నాలో కుమ్మరిస్తావని నిరీక్షించుచూ, నీకు వందనములని అనుచున్నాను. ఇట్లనుట నీకెంతో ఇష్టము. ఓ ప్రభువా! ఓ దేవా! లోకము నిన్ను నమ్మడములేదు. ఎందుకంటే వారిలో పాపమున్నది. పరిశుద్ధాత్మ తండ్రి వచ్చినప్పుడు పాపమనగా ఏమిటో లోకమునకు తెలుస్తుంది. గనుక ఎంతో సంతోషము. నీవు విశ్వాసులకు కనబడకపోయినను, నీవు సంపాదించిన నీతి వారికున్నది. గనుక వారు ధైర్యముగానుందురు. అందుచేత వందనములు. ఇట్టి ధైర్యము పరిశుద్ధాత్మవల్ల కలుగును. *నీతి గడించిన యేసు పరలోకమునకు వెళ్ళిపోయినాడని విశ్వాసులు అనుకొని అధైర్యపడకుండ నీ పరిశుద్ధాత్మ వారిని, మమ్ములను ధైర్యపరచునని గ్రహించు* చున్నాను. కనబడని నీవును, నా కొరకు నీవు గడించిన నీతియును నాకు కలిగియున్న సంగతి; పరిశుద్ధాత్మవల్ల నాకు తెలియగలదని తలంచుచున్నాను. అట్టి పరిశుద్ధాత్మను కుమ్మరింతువని వందనములు ఆచరించుచున్నాను. లోకమును పాపములోనికి నడిపించిన అపవాదికి ఇదివరకే తీర్పు అయిపోయినదని నీవు సెలవిచ్చినావు. తీర్పు పొందిన వాడు నాకు హాని చేయడని,

తెలిసికొనుచున్నాను నీకు వందనములు. నా నిమిత్తమై తీర్పు అనుభవించిన తండ్రీ! క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదని నీవాక్య గ్రంథమందు నీవు చెప్పుచున్న మాట నేను నమ్ముచున్నాను. **నాకు నిత్యమైన తీర్పు, శాశ్వతశిక్ష లేదని నేను ఆనందించుచు నమ్ముచున్నాను!** ఇట్టి మార్పు కలిగించే పరిశుద్ధాత్మను నాలో కుమ్మరిస్తావని వందించుచున్నాను. ఓ రక్షణాధికారివైన యేసుప్రభువా! పరిశుద్ధాత్మ తండ్రి పనినిగూర్చి చెప్పిన మరికొన్ని మాటలు నాహృదయ బలము నిమిత్తమై తలంచు కొనుచున్నాను. నేను మీతో చెప్పవలసినవి ఇంక అనేక సంగతులును కలవుగాని ఇప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు, మీరు సత్యమంతయు గ్రహించునట్లు ఆయన మిమ్మును నడిపించును. "ఆయన తనంతట తానే ఏమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి, సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును గనుక నన్ను మహిమపరచును. తండ్రికి కలిగినవన్ని నావి అందుచేత ఆయన నావాటిలోనివి తీసికొని మీకు తెలియజేయునని" తెలియపరచినావు గనుక నీకు వందనములు.

ఈ గొప్ప పని నా విషయములో జరిగేటట్లు పరిశుద్ధాత్మను కుమ్మరిస్తావని ఎదురుచూస్తూ నీకు వందనములు చేయుచున్నాను. నేను సత్యమంతయు గ్రహించేటట్లు ఆయన నడిపించుననే సంగతి వినుటయు, సంభవింపబోవు సంగతులను తెలియజేయునని వినుటయు, ఆయన నిన్ను మహిమపరచును అనే సంగతి వినుటయు నాకెంతో ముచ్చటగా నున్నది! ఎంతో కుతూహలముగా

నున్నది, ఎప్పుడు! ఎప్పుడు! ఇవన్ని జరుగునని యున్నది! నీకే వందనములు. నా జీవిత దినములన్నిట నీకే వందనములు. నీవు ఆత్మను కుమ్మరిస్తావనే నిరీక్షణ ఆనంద విశ్వాసము నాకు కలిగియున్నది. గనుక నీకు వందనములు. ఆమేన్.

## పరిశుద్ధాత్మ తండ్రికి స్తుతి

పరిశుద్ధాత్మవైన దేవా! నీవు దేవుడవు గనుక నీకు వందనములు. పరిశుద్ధాత్మవైన తండ్రీ! నీకనేక స్తుతులు. ఓ తండ్రీ! సృష్టికాలమందు నీవు సృష్టిని కాపాడుటకై సృష్టిమీద ఉన్నట్లు నేను చదువుకొనుచున్నాను, నీకనేక స్తుతులు. కాపాడే తండ్రీ! నీ సృష్టిలో నేనును ఉన్నాను గనుక నన్ను కాపాడే తండ్రీ! నీకు స్తుతులు ఆచరిస్తున్నాను. కోడి తన రెక్కలక్రింద పిల్లలను దాచి కాపాడు రీతిగా నీవు నన్ను సమస్త విధములైన కీడులనుండి కాపాడుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాను. నీవెంత దేవుడవైనను నాలో నివసించుటకు పూనుకొనియున్నావు గనుక నీకు స్తుతులు చెల్లించుచున్నాను.

ఓ దయగల తండ్రీ! పైనుండి మనమీద ఆత్మ కుమ్మరింపబడువరకు నగరి విడువబడును, జనసమూహముగల పట్టణము విడువబడును. కొండయు, కాపరుల గోపరమును ఎల్లప్పుడు గుహలుగా నుండును. అవి అడవి గాడిదలకు ఇష్టమైనచోట్లుగాను మందలు మేయు భూమిగాను ఉండునని యెషయా గ్రంథములో నేను చదువుకొనుచున్నాను. ప్రభువా! నీ కుమ్మరింపు లేనియెడల నేను పాడైపోయిన భూమివలె ఉందునని ఈవాక్యములో తెలిసికొనుచున్నాను. ఓ తండ్రీ! నీ కుమ్మరింపు

నాకు కలుగునని నేను నిన్ను స్తుతించుచున్నాను. పరిశుద్ధాత్మ తండ్రివైన తండ్రీ! పెంతెకొస్తు పండుగనాడు అందరు నీతో నిండినవారైనారని చదువుకొన్నాను. నీకనేక స్తుతులు. నేనుకూడ నీతో నిండినవాడనై యుండగోరుచున్నాను. కృప దయచేయుదువని నమ్మి స్తుతించుచున్నాను. ఓ ఆత్మ తండ్రీ! గాలివంటి ధ్వని ఇల్లంతయు వ్యాపించిన రీతిగానే, నీవు నా జీవితమంతయు వ్యాపించుమని ప్రార్థించుచు, అట్లు చేయుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాను. హృదయములో వ్యాపించే తండ్రీ! నాలో వ్యాపించే తండ్రీ! పూర్వము ప్రవక్తలలోను, అపోస్తలులలోను ఉండి వారిచేత పని చేయించిన ప్రకారముగా నాలోను, నాతోను వ్యాపించి నాచేత కూడ పని చేయించుమని ప్రార్థించుచు నిన్ను స్తుతించుచున్నాను.

నా తలంపులలోను, మాటలలోను, చూపులలోను, వినికిలోను, ప్రయత్నములలోను, క్రియలలోను, ఆచారములలోను, సేవలోను, కష్టకాలములోను, ఆనందకాలములోను, నా బ్రతుకు కాలమంతటిలోను నీవు వ్యాపించియుంటే నా ధన్యత ఏమని చెప్పను! నీకనేక స్తుతులు. నా ప్రియమైన తండ్రీ! నీవు నాలో లేకపోతే, ప్రభువు యేసు సంపాదించిన రక్షణభాగ్యము అందుకొనలేను. అందుకొన్నను నిలుపుకొనలేను. నిలుపుకొన్ననూ పొందినది వాడుకొనలేను గనుక అందుకొని, నిలుపుకొని, వాడుకొనేటట్లు నీవు సర్వములో వ్యాపించియుండుము. ఇది నా కోరిక, ఇది నా హక్కు. ఈ నా విశ్వాసమును నెరవేరును తండ్రీ! నేను ఎంత మంచితనము కలిగియున్నను దానిలో నీవు లేకపోతే దానికి జీవమేలేదు గనుక నాలో ఎప్పుడును చురుకుదనము

కలిగి పనిచేసే జీవముండునట్లు నీవు నాలో వ్యాపించియుండుము. ఈ నీ పని నిమిత్తమై నా అంతరంగమంతటితోను నీకు స్తోత్రములు, స్తోత్రములు, స్తోత్రములు. ఆమేన్.

## ప్రశ్నలు - జవాబులు

**1. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనుమాట బైబిలులోని ఏ వాక్యములలోనుండి తీసినమాట?

**జవాబు :** మత్త. 3:11; మార్కు. 1:8; లూకా. 3:16 అను వాక్యములలోనుండి తీసినమాట.

1. "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మ మిచ్చుచున్నాను. అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటె శక్తిమంతుడు. ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడనుకాను. ఆయన పరిశుద్ధాత్మలోను, అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును." (మత్తయి. 3:11). "నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చితిని గాని ఆయన పరిశుద్ధాత్మలో మీకు బాప్తిస్మమిచును" (మార్కు. 1:8). 3. "నేను నీళ్ళలో మీకు బాప్తిస్మ మిచ్చుచున్నాను అయితే నాకంటె శక్తిమంతుడు ఒకడు వచ్చుచున్నాడు. ఆయన చెప్పులవారును విప్పుటకు నేను పాత్రుడను కాను. ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మ మిచ్చును" (లూకా. 3:16). ఇవి యోహాను మాటలు.

**2 ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనుమాటకు బైబిలులో ఇతర నామములు గలవా?

**జవాబు :** కలవు. 1) పరిశుద్ధాత్మాభిషేకము "దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను, శక్తితోను అభిషేకించెనను నదియే (కార్య. 10:38).

2) పరిశుద్ధాత్మ కుమ్మరింపు "మొదటి వచనము: ఆలకించుడి నా ఆత్మను మీమీద కుమ్మరింతును" (సామెతలు. 1:23) రెండవ వచనము: "నీ సంతతిమీద నా ఆత్మను కుమ్మరించెదను" (యెషయా. 44:3). మూడవ వచనము: "పైనుండి ఆత్మ మనమీద కుమ్మరింపబడగా... ఫలభరితమైన భూమి వృక్షవనముగా ఉండును. (యెషయా. 32:13-15). నాల్గవ వచనము : "అప్పుడు ఇశ్రాయేలీయులమీద నేను నా ఆత్మను కుమ్మరించెదను గనుక నేనికను పరాఙ్ముఖుడనై యుండను." (యెహెజ్కేలు 39:29). ఐదవ వచనము: "నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరించెదను. మీ కుమారులును, మీ కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు. మీ ముసలివారు కలలుకందురు. మీ యౌవనస్థులు దర్శనములు చూతురు. ఆ దినములలో నేను పనివారిమీదను, పనికత్తెలమీదను నా ఆత్మను కుమ్మరింతును." (యోవేలు. 2:28,29) ఆరవ వచనము: "దావీదు సంతతి వారిమీదను, యెరూషలేము నివాసుల మీదను, కరుణనొందించు ఆత్మను, విజ్ఞాపన చేయు ఆత్మను నేను కుమ్మరింపగా, వారు తాము పొడిచిన నామీద దృష్టియుంచి, యొకడు తన ఏక కుమారుని విషయమై దుఃఖించునట్లు, తన జ్యేష్టపుత్రుని విషయమై యొకడు ప్రలాపించునట్లు, అతని విషయమై దుఃఖించుచు ప్రలాపింతురు." (జెకర్యా. 12:10) ఏడవ వచనము: "అంత్య దినములయందు నేను మనుష్యులందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను. మీ కుమారులును, మీ కుమార్తెలును ప్రవచించెదరు. మీ యౌవనులకు దర్శనములు కలుగును. మీ వృద్ధులు కలలు కందురు. ఆ దినములలో నా దాసులమీదను,

నా దాసురాండ్లమీదను నా ఆత్మను కుమ్మరించెదను గనుక వారు ప్రవచించెదరు." (అపో.కార్య. 2:17-18).

ఎనిమిదవ వచనము: "మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను, మనలను రక్షించెను. మనమాయన కృపవలన నీతిమంతులమని తీర్చబడి, నిత్యజీవమునుగూర్చిన నిరీక్షణనుబట్టి, దానికి వారసులమగుటకై ఆ పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తుద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను." (తీతు. 3:5-7).

**3. ఆత్మబాప్తిస్మము:-** "యూదులమైనను, హెల్లేనీయులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను మనమందరము ఒక్క శరీరములోనికి, ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి." (1కొరింథి. 12:13).

పరిశుద్ధాత్మాభిషేకము, పరిశుద్ధాత్మ కుమ్మరింపు, ఆత్మబాప్తిస్మము ఇవి పరిశుద్ధాత్మ బాప్తిస్మముయొక్కపేర్లు (మత్తయి. 3:16).

**3వ ప్రశ్న:-** ఏడవ వచనములో నుదహరించిన అంత్య దినములలో అను మాటకర్థమేమి?

జవాబు:- 1.యూదుల మతసంఘముయొక్క ముగింపు కాలములోని దినములు ఒక 'అంత్యదినములు' (హెబ్రీ. 1:2). 2. క్రైస్తవ సంఘముయొక్క ముగింపు కాలములోని దినములు ఇంకొక 'అంత్యదినములు' (IIతిమోతి 3:1). 3. ఈ అంత్యదినములు

అనగా ప్రభువుయొక్క రాకడకు ముందు వచ్చియున్న దినములు. ఇప్పుడనేకులు ఆత్మబాప్తిస్మము పొందుచున్నారు. ఆయన రాకడ సమీపించుచున్న దనుట కిదియొక ఆనవాలు. 4. వెయ్యేండ్ల పరిపాలన దినములు మరొక 'అంత్య దినములు' దీనికంటె మరొక వివరము దీనికి సరిపోదు.

**4. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము మొదటిసారి ఎప్పుడు కలిగినది?

**జవాబు:-** ఈ భూమిమీద క్రీస్తుప్రభువుయొక్క రక్షణకార్యము సంపూర్తియైన పిమ్మట ఆయన పరలోకమునకు వెళ్ళిన తరువాత, ఈ బాప్తిస్మము మొదటిసారి పాతనిబంధన ప్రజలైన యూదులు పెంతెకొస్తు పండుగ చేసికొన్నప్పుడు కలిగినది. గనుక ఈ పరిశుద్ధాత్మ బాప్తిస్మము క్రైస్తవ సంఘముయొక్క బాప్తిస్మమనియు, యూదుల మతసంబంధమైన బాప్తిస్మము కాదనియు ఇందువల్ల తీర్మానమగుచున్నది.

**5. ప్రశ్న:-** అయితే పరిశుద్ధాత్మ బాప్తిస్మమునుగూర్చి పాతనిబంధనలో లేదా ఏమి?

జవాబు:- అది ప్రవచన రూపముగా ఉన్నది. అనగా ఇకముందునకు జరుగునని ఉన్నది. పాత నిబంధన కాలపువారు పొందినట్లు లేదు.

సామె. 1:23; యెష. 32:13-15; యెష. 44:3; యెహెజ్కే. 39:29; యోవేలు. 2:28-29; జెకర్యా. 12:10. పూర్తి వాక్యముల కొరకు రెండవ ప్రశ్న జవాబులోని రెండవ భాగము చూడండి.

**6. ప్రశ్న:-** పాతనిబంధన విశ్వాసులలో పరిశుద్ధాత్మ లేదా?

జవాబు:- ఉన్నాడు. పరిశుద్ధాత్మావేశమువల్లనే వారు అద్భుతములు చేయగలిగిరిగాని వారికి పరిశుద్ధాత్మ బాప్తిస్మము లేదు. భాషలతో మాట్లాడు వరము వారికియ్యబడినట్లు వాక్యములో లేదు. భాషలతో మాటలాడు వరమును ఆదిక్రైస్తవ మత సంఘములోని వరములును; పరిశుద్ధాత్మను పొందిన ఒక ఫలితముగా కలిగినట్లు వాక్యమువల్ల కనబడుచున్నది.

**7. ప్రశ్న:-** అయితే క్రొత్త నిబంధనలో పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించిన వాక్యము లెచ్చట యున్నవి?

జవాబు : క్రొత్తనిబంధనలో కూడ ఈ బాప్తిస్మమును గురించిన ప్రవచన వాక్యములున్నవి.

1. "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను. అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటె శక్తిమంతుడు. ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను. ఆయన పరిశుద్ధాత్మతోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును". (మత్త. 3:11). 2. (మార్కు. 1:8) 3. (లూకా. 3:16).షరా:- ఇవి యోహాను పలికిన ప్రవచనములు. 4. "నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద యెల్లప్పుడు ఉండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను ఎరుగుదురు, ఆయన మీతోకూడ నివసించును, మీలో ఉండును"

(యోహాను. 14:16-17) ఇది ప్రభువు పలికిన ప్రవచన వాక్యము. 5. "ఆదరణ కర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి, నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును." (యోహాను. 14:26). ఇదియు క్రీస్తు ప్రవచనమే. 6. "అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను. నేను వెళ్ళిపోవుట వలన మీకు ప్రయోజనకరము. నేను వెళ్ళనియెడల ఆదరణకర్త మీయొద్దకురాడు. నేను వెళ్ళినయెడల ఆయనను మీయొద్దకు పంపుదును. ఆయన వచ్చి పాపమునుగూర్చియు, నీతినిగూర్చియు, తీర్పునుగూర్చియు లోకమును ఒప్పుకొనజేయును. లోకులు నాయందు విశ్వాసముంచలేదు గనుక పాపమునుగూర్చియు; నేను తండ్రియొద్దకు వెళ్ళుటవలన మీరిక నన్ను చూడరు గనుక నీతినిగూర్చియు, ఈలోకాధికారి తీర్పు పొందియున్నాడు గనుక తీర్పునుగూర్చియు ఒప్పుకొనజేయును. నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవుగాని ఇప్పుడు మీరు వాటిని సహింపలేరు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు, మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతటతానే ఏమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనికి తీసికొని మీకు తెలియజేయును. గనుక నన్ను మహిమపరచును. తండ్రికి కలిగినవన్నియు నావి. అందుచేత ఆయన నావాటిలోనివి తీసికొని మీకు తెలియజేయునని నేను జెప్పితిని." (యోహాను. 16:7-15). ఇవికూడ రక్షకుని ప్రవచన వాక్యములే.

**8. ప్రశ్న:-** ఈ అన్ని ప్రచనముల నెరవేర్పు ఎక్కడ  ఉన్నది?

జవాబు : అపోస్తులుల కార్యములు 2వ అధ్యాయములోఉన్నది.

**9. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎవరు ఇచ్చిరి?

జవాబు:- పరలోకమునకు వెళ్ళిన ఆ క్రీస్తు ప్రభువే. ఆ బాప్తిస్మము ఇచ్చెను. యోహాను. 15:26; 16:7; అపో॥కార్య॥ 2:23 చూడండి.

**10. ప్రశ్న :** ఆ మొదటిసారి పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన వారెవరు?

జవాబు : 1) పేతురు 2) యోహాను 3) యాకోబు 4) అంద్రెయ 5) ఫిలిప్పు 6) తోమా 7) బర్తలోమయి 8) మత్తయి 9) యాకోబు (అల్ఫయి కుమారుడు), 10) సీమోను (మతాభిమాని), 11) యూదా (యాకోబు కుమారుడు), 12) మత్తీయ, 13) కొందరు స్త్రీలు, 14) మరియ (ప్రభువు తల్లి), 15) ప్రభువుయొక్క సహోదరులు. మొత్తము ఇంచుమించు నూట ఇరువదిమంది సహోదరులు.

**11. ప్రశ్న:-** ఇది ఎచ్చట జరిగినది?

జవాబు: యెరూషలేములో జరిగినది.

**12. ప్రశ్న:-** ఈ నూట ఇరువదిమంది కూటము యెరూషలేములో ఎక్కడ జరిగినది?

జవాబు : ఒక మేడ గదిలో జరిగినది (అ॥కార్య. 1:13).

**13. ప్రశ్న:-** ఏమి చేసినందువల్ల పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి?

జవాబు:- 1) వారు తండ్రియొక్క వాగ్ధానముకొరకు కనిపెట్టుటవల్లనే. "మీరు యెరూషలేమునుండి వెళ్ళక, నావలన వినిన తండ్రియొక్క వాగ్ధానముకొరకు కనిపెట్టుడి" అని ప్రభువు చెప్పలేదా! (అపో॥కార్య. 1:4). వారు పరిశుద్ధాత్మను పొందువరకు యెరూషలేము విడువలేదు. పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు. గనుక మీరు యెరూషలేములోను యూదయ, సమరయ దేశములయందంతటను, భూదిగంతముల వరకును, నాకు సాక్షులైయుందురు" అని కూడ ప్రభువు చెప్పెను గదా!(అపో॥కార్య॥ 1:8). 2) వారు ఎడతెగక ప్రార్ధనలో నున్నందువలన పరిశుద్ధాత్మను పొందిరి. "యెడతెగక ప్రార్ధన చేయుచుండిరి" అని అపో॥కార్య॥ 1:14లో ఉన్నది. 3) వారు ఏకభావముగలవారై నందువల్ల. "ఏక మనస్సుతో, ఎడతెగక ప్రార్ధన చేయుచుండిరి." అని అపో॥కార్య. 1:14లో ఉన్నది. 4) వారు అందరు ఒకచోట కూడియుండుటవల్ల. "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి" అని అపో॥కార్య. 2:1లో ఉన్నది. కనిపెట్టుచు, యెడతెగక ప్రార్ధనచేయుచు, ఏకభావము కలిగియున్నప్పుడు వారికి బాప్తిస్మము లభించెను. మనమును ఆ పద్ధతులే అవలంభించుదుము.

**14. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మకాలమప్పుడు కనబడిన గురుతులేవి?

జవాబు : 1) ధ్వని ఒక గురుతు. ఆ ధ్వని వేగముగా వీచు బలమైన గాలి ధ్వనివలె ఉండెను. అది ఆకాశమునుండి అకస్మాత్తుగా కలిగెను. అది ఇల్లంతయు వ్యాపించెను. 2)

అగ్నిజ్వాలలవంటి నాలుకలు రెండవగుర్తు. అవి ఒక్కొక్కరిమీద వ్రాలెను.

**15. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము కలుగగా వారికేమి సంభవించెను?

జవాబు: 1) వారందరు పరిశుద్ధాత్మతో నిండినవారైరి. 2) వారు అన్యభాషలతో మాటలాడిరి.

**16. ప్రశ్న:-** ఇది జరిగినప్పుడు అక్కడ ఇతరులెవరైనా ఉన్నారా?

జవాబు:- 1) అనేకమందియున్నారు. "ఆ కాలమున ఆకాశము క్రిందనుండు ప్రతి జనములోనుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో కాపురముండిరి (అపో॥కార్య. 2:5). 2) ఈ శబ్దము కలుగగా జనులు గుంపులుగా కూడివచ్చిరి.

**17. ప్రశ్న:-** ఈ ప్రజలెవరు?

జవాబు:- లోకములో ఉన్న ప్రతి జనమునుండి ఈ పండుగకు వచ్చిన భక్తిగల యూదులు (అపో॥కార్య॥2:5).

**18. ప్రశ్న:-** ఈ ప్రజలు ఈ బాప్తిస్మమును చూచి ఏమనుకొన్నారు?

జవాబు:- పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు సర్వభాషలతో మాటలాడుటచూచి 1) కలవరపడిరి, 2) విభ్రాంతి నొందిరి, 3) ఆశ్చర్యపడిరి. "ఈ శబ్దము కలుగగా జనులు గుంపులుగా కూడివచ్చి ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో వారు మాటలాడుట విని కలవరపడిరి. అంతట అందరు విభ్రాంతి నొంది ఆశ్చర్యపడిరి" (అపో॥కార్య॥ 2:6,7).

**19. ప్రశ్న:-** చూడవచ్చిన ఆ ప్రజలు ఏమని మాటలాడుకొనిరి?

జవాబు:- “ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులుకారా? మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపు భాషతో వీరు మాటలాడుట మనము వినుచున్నామే; ఇదేమి?” అని మాటలాడుకొన్నారు (అపో॥కార్య॥2:7,8). 2) ఇది వనవాస కాలమందు ఇశ్రాయేలీయులు క్రొత్తగా ఆకాశమునుండి పడిన మన్నాను చూచి ‘ఇదేమి’ అని పల్కినట్లున్నది (నిర్గమ. 16:15).

**20. ప్రశ్న:-** ఆ పండుగలో ఈ వింత చూచినటువంటి ప్రజలెవరు?

జవాబు:- 1) పార్తీయులు, 2) మాదీయులు, 3) ఎలామీయులు, 4) మెసపొతమియవారు, 5) యూదయవారు, 6) కప్పదొకియవారు, 7) పొంతువారు, 8) ఆసియవారు, 9) ఫ్రుగియవారు, 10) పంపులియవారు, 11) ఐగుప్తువారు, 12) లిబియా ప్రాంతములవారు, 13) రోమానుండి వచ్చినవారు, 14) యూదమత ప్రవిష్టులు, 15) క్రేతీయులు, 16) అరబ్బీయులు, (అపో॥కార్య॥ 2:9-11).

**21. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ నొందినవారు ఈ భూలోక భాషలలో ఏమని బోధించిరి?

జవాబు:- “దేవుని గొప్ప కార్యములను వివరించిరి” (అపో॥కార్య॥ 2:11).

**22. ప్రశ్న:-** అయితే ఈ సంగతి చూచి అందరు హర్షించిరా?

జవాబు:- లేదు, కొందరు అపహాస్యము చేసిరి (అపో॥కార్య॥ 2:13).

**23. ప్రశ్న:-** ఏమని అపహసించిరి?

జవాబు:- క్రొత్త మద్యముతో నిండియున్నారని అపహాస్యము చేసిరి (అపో॥కార్య॥ 2:13).

**24. ప్రశ్న:-** దీనికి ఆ నూట ఇరువదిమంది సమాధానము చెప్పలేదా?

జవాబు:- సమాధానము చెప్పిరి. వారిలో ముఖ్యుడగు పేతురు చెప్పిన సమాధానము బైబిలులో ఒక గొప్ప ప్రసంగముగా అమరియున్నది (అపో॥కార్య॥ 2:14-40).

**25. ప్రశ్న:-** ఆ ప్రసంగములో కొన్ని ముఖ్యమైన సంగతులేవి?

జవాబు:- 1) శిష్యులు మత్తులు కారని చెప్పిన సంగతి:

"అయితే పేతురు ఆ పదునొకరితో కూడ లేచి నిలిచి బిగ్గరగా వారితో ఇట్లనెను. యూదయ మనుష్యులారా! యెరూషలేములో కాపురమున్న సమస్తజనులారా! ఇది మీకు తెలియుగాక. చెవియొగ్గి నా మాట వినుడి. మీరు ఊహించినట్లు వీరు మత్తులుకారు (అపో॥కార్య॥ 2:14-15).

2) వారు ఆత్మ కుమ్మరింపు పొందిరని చెప్పిన సంగతి: "యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి ఇదే. ఏమనగా అంత్య దినములయందు నేను మనుష్యులందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను. మీ కుమారులును మీ కుమార్తెలును ప్రవచించెదరు. మీ యౌవనులకు దర్శనములు కలుగును. మీ

వృద్ధులు కలలు కందురు. ఆ దినములలో నా దాసులమీదను, నా దాసురాండ్రమీదను నా ఆత్మను కుమ్మరించెదను గనుక వారు ప్రవచించెదరు." (అపో॥కార్య॥ 2:16-18). 3) క్రీస్తుప్రభువు అద్భుతములు చేసెననియు, ఆయనను యూదులు చంపిరనియు, ఆయన బ్రతికి లేచెననియు చెప్పిన సంగతి : "ఇశ్రాయేలీయులారా! ఈ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములను, మహత్కార్యములను, సూచనక్రియలను మీమధ్యను చేయించి, ఆయనను తనవలన మెప్పు పొందినవానిగా కనుపరచెను. ఇది మీరే ఎరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును, ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగించబడిన ఈయనను, మీరు దుష్టులచేత సిలువవేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించియుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు నివారణచేసి ఆయనను లేపెను. ఆయననుగూర్చి దావీదు ఇట్లనెను-***నేనెల్లప్పుడు నా ఎదుట ప్రభువును చూచుచుంటిని.*** ఆయన నా కుడిపార్శ్వమున నున్నాడు గనుక నేను కదల్చబడను. కావున నా హృదయము ఉల్లసించెను. నా నాలుక ఆనందించెను. మరియు నా శరీరముకూడ నిరీక్షణ కలిగి నిలకడగా ఉండును. నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు. నీవు నీ పరిశుద్ధుని కుళ్ళుపట్టనియ్యవు. నాకు జీవమార్గములు తెలిపితివి. నీ దర్శనమనుగ్రహించి నన్ను ఉల్లాసముతో నింపెదవు." (అపో॥కార్య॥ 2:22-28). 4) క్రీస్తు ప్రభువు పరలోకమునకు వెళ్ళెనని చెప్పిన సంగతి : ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడెను (అపో॥కార్య॥ 2:33).

"నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద పీఠముగా ఉంచు పర్యంతము నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని ప్రభువు నా ప్రభువుతో చెప్పెను (అపో॥కార్య॥ 2:35). 5) క్రీస్తు ప్రభువు పరిశుద్ధాత్మను కుమ్మరించెదనని చెప్పిన సంగతి :

ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్ధానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు (కార్య. 2:33), 6) యేసుప్రభువును దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించిన సంగతి :

"మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను (అపో॥కార్య॥ 2:37).

**26. ప్రశ్న:–** పేతురు సమాధాన ప్రసంగము ప్రజలలో ఏమి పని చేసినది?

జవాబు:– వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొనిరి (అపో॥కార్య॥ 2:37).

**27. ప్రశ్న:–** పేతురు మాటలు మనసున గుచ్చుకొన్నప్పుడు ప్రజలేమన్నారు?

జవాబు:– సహోదరులారా! మేము ఏమి చేతుము? అని అడిగిరి (అపో॥కార్య॥ 2:37).

**28. ప్రశ్న:–** ఎవరిని ఇట్లడిగిరి?

జవాబు:– పేతురును తక్కిన అపోస్తలులను (అపో॥కార్య॥ 2:37).

**29. ప్రశ్న:-** తక్కిన అపోస్తలులును ప్రసంగము చేసిరా?

జవాబు:- అపో॥కార్య॥ 2:14 చూడండి.

**30. ప్రశ్న:-** ప్రజలడిగిన ప్రశ్నకు పేతురేమి ఉత్తరము చెప్పెను?

జవాబు:-నీళ్ళ బాప్తిస్మము పొందవలెననియు, పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలెననియు, మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణపొందుడనియు ఉత్తరము చెప్పెను. (అపో॥కార్య॥ 2:38-40).

**31. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ స్నానము పొందిన అపోస్తలులు, మొదలగువారు భూలోకభాషలు మాటలాడిరి. అయితే పౌలు 1కొరింథి. 14 అధ్యాయములో భాషలను గురించి వ్రాయుచున్నాడు అవి యే భాషలు?

జవాబు:- 1) దేవదూతలకు కూడ భాష ఉన్నదని 1కొరింథి. 13:1 వలన తెలియుచున్నది. ఇది పరలోకభాష. 2) భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాదు, దేవునితో మాటలాడుచున్నాడు. మనుష్యుడెవడును గ్రహింపడుగాని వాడు ఆత్మవలన మర్మములు పలకుచున్నాడు అని 1కొరింథి. 14:2లో నున్న వ్రాతనుబట్టి చూడగా, పరలోకభాష ఉన్నట్టు తెలియుచున్నది. 3) పౌలు ఆత్మవశుడై పరదైసులోనికి వెళ్ళి, మనుష్యుడు పలుకగూడని మాటలు వినెను. ఇవి పరలోకభాషయొక్క మాటలు అని గ్రహించుకొనవచ్చును.

ఇది 2కొరింథి. 12:2-5లో నున్నది. అది ఏదనిన:

"క్రీస్తునందున్న యొక మనుష్యుని నేనెరుగుదును. అతడు పదునాలుగు సంవత్సరముల క్రిందట మూడవ ఆకాశమునకు

కొనిపోబడెను. అతడు శరీరముతో కొనిపోబడెనో నేనెరుగను శరీరము లేక కొనిపోబడెనో నేనెరుగను. అతడు పరదైసులోనికి కొనిపోబడి వచింపశక్యముగాని మాటలు వినెను. ఆ మాటలు మనుష్యుడు పలుకకూడదు. అతడు శరీరముతో కొనిపోబడెనో శరీరము లేక కొనిపోబడెనో నేనెరుగను. అది దేవునికే తెలియును. అట్టివానినిగూర్చి అతిశయింతును.

**32. ప్రశ్న:-** "కాబట్టి భాషలు విశ్వాసులకుకాదు, అవిశ్వాసులకే సూచకమైయున్నవి" అని 1కొరింథి. 14:22లో ఉన్నది. గనుక అవిశ్వాసులకే భాషలు. ఈ భాషలు వచ్చిన వారందరు అవిశ్వాసులనియెగదా అర్ధము?

జవాబు:- కాదు, అవిశ్వాసులకు భాషలు వచ్చునా? అదేమి వ్యాఖ్యానము! విశ్వాసులైనవారు తమ విశ్వాసమునుబట్టి భాషావరము సంపాదించుట అవిశ్వాసులు చూచి, తాముకూడ భాషను గడించుకొనగల విశ్వాసమును కలిగించుకొన యత్నింతురు. అట్లు విశ్వాసుల భాష స్థితి, అవిశ్వాసులకు పాఠము నేర్పించు నొక సాధనమగును. ఈ యర్ధము యుక్తముగ దోచుటలేదా?

**33. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మమును, భాషలతో మాటలాడుటయును, ఇన్నాళ్ళనుండి ఎక్కడ ఉన్నవి?

జవాబు:- ఇన్నాళ్ళనుండి ఇవి మీ చేతిలో నున్న బైబిలులోనే ఉన్నవి.

**34. ప్రశ్న:-** ఉంటే ఎవరు ఎందుకు బోధింపలేదు?

జవాబు:- బోధించినారు, జరిగినకథ మాత్రమే బోధించినారు. మనకు కాదని అనుకొన్నందున పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంద

యత్నించుడని బోధింపలేదు. నీళ్ళబాప్తిస్మమప్పుడె ఆత్మ బాప్తిస్మమును పొందినామని బోధించలేదు.

**35. ప్రశ్న:-** వారు ఊరుకొన్నట్టు మీరెందుకు ఊరుకొనరు?

జవాబు:- దేవుడిస్తానన్నది వద్దనడమెందుకు? ఇష్టముగా ఉన్నది గనుక అడిగి పొందుచున్నాము. మీరును పొందవలెనని కోరుచున్నాము గనుక బోధించుచున్నాము.

**36. ప్రశ్న:-** ఈ పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపోస్తులులకే గాని మనకు కాదని ఒకరు అనుచున్నారు. దీనికేమి సమాధానము చెప్పుదురు?

జవాబు:- మీరు ఊహించుచున్నట్టు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపోస్తలులకే అనుకొనండి. అయితే నాకు కూడ దయచేయుమని నేను దేవునిని అడిగినాను. ఆయన ఇచ్చినాడు, నేను పొందినాను. గనుక మీకెందుకీ సంగతి కష్టముగా నుండవలయును.

**37. ప్రశ్న:-** నేను పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటకు ఎంతో ప్రయత్నము చేస్తూవుంటే నాకు కలుగడములేదు గనుక అది ఈ కాలమునకు కాదని తోస్తుంది. దీనికేమందురు?

జవాబు:- మీకు రాకపోతే ఎవరికి రానట్లేనా? మీకు రాకపోతే మనుష్యులందరిమీద నా ఆత్మను కుమ్మరిస్తానన్న దేవుని వాక్యము అసత్యమేనా? మీకు రాకపోతే దూరస్తులందరికీ అనే మాట రద్దయిపోయినట్లేనా? మీకు రాకపోతే మీలో ఏదో ఒక లోపమున్నదని గ్రహించవలెను లేదా అందునిమిత్తము చేయవలసిన ప్రయత్నములలో ఏదో విడిచిపెట్టియుందురు.

**38. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలెనంటే ఏమి చేయవలెను?

జవాబు:- 1) మారుమనస్సు పొందవలెను (అపో॥ కార్య॥ 2:38), 2) నీళ్ళ బాప్తిస్మము పొందవలెను (అపో॥కార్య॥ 2:38), 3) ప్రార్థింపవలెను (అపో॥కార్య॥ 1:14), 4) కనిపెట్టవలెను (అపో॥కార్య॥ 1:4), 5) **విశ్వసింపవలెను** (గలతీ. 3:13-14; మార్కు. 12:24).

**39. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఎవరెవరికి?

జవాబు:- 1) పేతురు ప్రసంగము విన్నవారికి (అపో॥ 2:39), 2) వారి పిల్లలకు, 3) దూరస్థులందరికి (అపో॥ 2:39), 4) సర్వ జనులకు (యోవేలు 2:28), 5) పనివారికి, 6) పనికత్తెలకు (యోవేలు 2:29) అని పేతురు చెప్పిన మాటవల్లనే తెలియుచున్నది. మీరు ఏ జాబితాలో లేకపోయినను, సర్వజనుల జాబితాలో ఉన్నారుకదా! మీకింకా సందేహమెందుకు?

**40. ప్రశ్న:-** ఓ దేవా! నీ పరిశుద్ధాత్మను దయచేయుము అనియు, ఓ పరిశుద్ధాత్మా! మాలోనికి దిగిరమ్మనియు కొందరు ప్రార్థించుట విన్నాను. ఇదివరకే పరిశుద్ధాత్మ మనలోనికి వచ్చియుండలేదా? ఈ ప్రార్థన సరిగా ఉన్నదా?

జవాబు:- పరిశుద్ధాత్మను గోరుము (243) పరిశుద్ధాత్ముడ దేవా ప్రభువా! నీ కరుణ మాపైన వర్షింపుమయ్య; (244); దేవుండవైన యాత్మ రా (624) రమ్ము, రమ్ము పరిశు ద్ధాత్మా! రమ్ము రమ్ము (245) ఈ మొదలైన మన కీర్తన

పుస్తకములోనికి కీర్తనలలో ఉన్న భావము పరిశుద్ధాత్మను పిలుచుటయే. ఇవెందుకు పాడుచున్నాము?

**41. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ కూటములు చేయువారిని తిరస్కరిస్తే హానియని చెప్పుచున్నారు. పరిశుద్ధాత్మ హాని చేయువాడా?

జవాబు:- నీవు మనుష్యులతో కాదు. దేవునితోనే అబద్ధమాడితివి అని పేతురు అననీయతో చెప్పెను. అతడు ఈ మాటలు వినుచు నేలపడి ప్రాణము విడిచెను. పరిశుద్ధాత్మ చంపెనా? పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన పేతురు చంపెనా? అతని దుర్గుణమె అతని చంపెను (అపో॥ 5అధ్యా॥) మునికోలను తన్నువానిని మునికోల గుచ్చినదని అందువా?

**42. ప్రశ్న:-** అపోస్తలుల కాలపువారు పొందిన పరిశుద్ధాత్మ బాప్తిస్మమును ఇప్పటివారు పొందుచున్న పరిశుద్ధాత్మ బాప్తిస్మమును ఒకటేనా ఏమి?

జవాబు:- మనము పొందుచున్న నీటిబాప్తిస్మమును ఆది సంఘస్తులు పొందిన నీటిబాప్తిస్మము ఒకటేనా ఏమి? అని అడిగినట్టున్నది మీ ప్రశ్న.

**43. ప్రశ్న:-** మనమందరము భాషలతో మాటలాడవలెనా?

జవాబు:- అవును 'మీరందరు భాషలతో మాటలాడవలెనని కోరుచున్నాను' అని పౌలు వ్రాయుచున్నాడు (1కొరింథి. 14:5).

**44. ప్రశ్న:-** భాషావరము అంత ముఖ్యమైన వరము కాదు గనుకనే ఆత్మవరముల జాబితాలో దానిని కృతజ్ఞతా స్తుతుల చివర చేర్చినాడని కొందరనుచున్నారు. దీనికేమి ఉత్తరము కలదు?

జవాబు:- వచ్చిన వరములలో భాషావరము చివర వచ్చిన వరము గనుక చివర ఉదహరింపబడినది (1కొరింథి. 12:4-12) 1తిమోతి. 2:2లో ఒక జాబితా ఉన్నది. (ఎ) విజ్ఞాపనలు, (బి) ప్రార్థనలు (సి) యాచనలు, (డి) కృతజ్ఞతా స్తుతులు; కృతజ్ఞతాస్తుతులు అని చివర ఉన్నందున అవి అముఖ్యములా?

1కొరింథి. 13:13లో కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ ఈ మూడును నిలుచును. వీటిలో శ్రేష్టమైనది ప్రేమే అని ఉన్నది. ప్రేమ అనుమాట జాబితాలో చివర ఉన్నందున ప్రేమ అముఖ్యమైనదని మీరనగలరా? లేక జాబితాలో చివర ఉన్న 'ప్రేమ అనునది శ్రేష్టమైనది' అని పౌలు చెప్పినమాట సరికాదు అని మీరందురా?

**45. ప్రశ్న:-** భాషలతో మాటలాడుటను గురించి మరెక్కడనైన ఉన్నదా?

జవాబు:- ఉన్నది. నమ్మినవానివలన ఈ సూచక క్రియలు కనబడును. ఏవనగా నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు. క్రొత్త భాషలు మాట్లాడుదురని ప్రభువు చెప్పెను (మార్కు. 16:17).

**46. ప్రశ్న:-** ఆ భాషల అర్థము ఏమి?

జవాబు:- 1) అర్థము చెప్పవలెనని వాక్యములోనే ఉన్నది. "భాషలు మాటలాడువాడు అర్థము చెప్పు శక్తి కలుగుటకై ప్రార్థన చేయవలెను" (1కొరింథి. 14:13). 2) సహోదరులారా! ఇప్పుడు మీలో ఏమి జరుగుచున్నది? మీరుకూడి వచ్చినప్పుడు

ఒకడు ఒక కీర్తన పాడవలెనని యున్నాడు. మరియొకడు బోధింపవలెనని యున్నాడు. మరియొకడు తనకు బయలు పరచబడినది ప్రకటన చేయవలెనని యున్నాడు. మరియొకడు అర్ధము చెప్పవలెననియున్నాడు. మరియొకడు భాషతో మాటలాడవలెనని యున్నాడు సరే; సమస్తమును క్షేమాభివృద్ధి కలుగుటకై జరుగనియ్యుడి. భాషతో ఎవడైనను మాటలాడితే ఇద్దరు అవసరమైనయెడల ముగ్గురికి మించకుండ వంతుల చొప్పున మాటలాడవలెను. ఒకడు అర్ధము చెప్పవలెను. అర్ధము చెప్పువాడు లేనియెడల అతడు సంఘములో మౌనముగా నుండవలెనుగాని తనతోను, దేవునితోను మాటలాడుకొనవచ్చును (1కొరింథి. 14:26-28).

**47. ప్రశ్న:-** భాషలవల్ల ప్రయోజనమేమి?

జవాబు:- “నేను భాషతో ప్రార్ధన చేసినయెడల నా ఆత్మ ప్రార్ధన చేయునుగాని మనస్సు ఫలవంతముగా నుండదు. కాబట్టి ఆత్మతో ప్రార్ధన చేతును, మనస్సుతోను ప్రార్ధన చేతును. ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును. లేనియెడల నీవు ఆత్మతో స్తోత్రము చేసినప్పుడు ఉపదేశము పొందనివాడు నీవు చెప్పుదానిని గ్రహింపలేడు గనుక నీవు కృతజ్ఞతాస్తుతులు చెల్లించునప్పుడు ఆమేన్ అని వాడేలాగు పలుకును? నీవైతే బాగుగానే కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నావు గాని ఎదుటివాడు క్షేమాభివృద్ధి పొందడు. నేను మీయందరికంటె ఎక్కువగా భాషలతో మాటలాడు చున్నాను (1కొరింథి. 14:14-18).

**48. ప్రశ్న:-** ఈ వాక్యమువల్ల ఏమి తేలుచున్నది? భాషవల్ల ఏమి ప్రయోజనము?

జవాబు:- 1) భాషతో ప్రార్థన జరుగును. ఇది ఆత్మ చేయు ప్రార్థన ఇదియొక ప్రయోజనము. 2) ఆత్మస్తోత్రము చేయును. ఇదొక ప్రయోజనము. 3) భాషతో మాటలాడువాడు దేవునితో మాటలాడుచున్నాడు. ఇదొక ప్రయోజనము (1కొరింథీ. 14:2).

**49. ప్రశ్న:-** అందరు ఒక్కసారి భాషలతో మాటలాడితే సంఘములో అల్లరిగా ఉండదా?

జవాబు:- అల్లరిలేకుండ మాటలాడగల ఏర్పాటు చేసికొనవలెను. 1) "సంఘమంతయు ఏకముగా కూడి అందరు భాషలతో మాటలాడుచుండగా ఉపదేశము పొందనివారైనను, అవిశ్వాసులైనను లోపలికి వచ్చినయెడల మీరు వెర్రిమాటలాడు చున్నారని అనుకొందురుగదా." (1కొరింథీ. 14:23). 2) "ఆలాగే పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్తగాని అల్లరికి కర్తకాడు" (1కొరింథీ. 14:33). 3) సమస్తమును మర్యాదగాను, క్రమముగాను జరుగనియ్యుడి" (1కొరింథీ. 14:40).

**50. ప్రశ్న:-** భాష అర్థము తెలియనిదే ఏల మాటలాడవలెను?

జవాబు:- 1) దేవుడిచ్చినది మాటలాడవలెనా? వద్దా? అని దేవునిని అడుగవలెనుగాని పొందినవారి నెందుకడుగవలెను. 2) "మనుష్యు డెవడును గ్రహింపడుగాని వాడు ఆత్మవలన మర్మములను పలుకుచున్నాడు" అని 1కొరింథీ. 14:2లో ఉన్నదిగదా? గ్రహింపడు, మర్మములు అను రెండు మాటలు

గుర్తించండి. 3) శరీరము, మనస్సు, ఆత్మ ఈ మూడు కలిసి మనుష్యుడైనాడు. ఈ భాష ఆత్మ భాష గనుక మనస్సు శరీరము ఎట్లు గ్రహింపగలవు? (1కొరింథి. 14:14). 4) 'మీ ఆత్మయు, జీవమును, శరీరమును మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక' (1థెస్స. 5:23).

**51. ప్రశ్న:–** భాషలవల్ల చాలా అల్లర్లున్నందున మాన్పిస్తే బాగుండును గదా?

జవాబు:– "కాబట్టి సహోదరులారా! ప్రవచించుట ఆసక్తితో అపేక్షించుడి. భాషలతో మాటలాడుట ఆటంకపరచకుడి గాని సమస్తమును మర్యాదగాను, క్రమముగాను జరుగనియ్యుడి" (1కొరింథి. 14:39,40) అని పౌలు వ్రాయుచున్నాడు గనుక ఆపుచేయ వీలులేదు. మీకొక ఉపాయము చెప్పుచున్నాను. **మీరు మొదట పరలోక భాషావరము సంపాదించుకొనండి.** అప్పుడితరులు మాటలాడే భాషలలోని లోపములు మీకు తెలియును గనుక ఆపుచేయవచ్చును.

**52. ప్రశ్న:–** పౌలు 1కొరింథి. 14వ అధ్యాయయములో ప్రవచించుటను గురించి వ్రాయుచున్నాడు. ఇది ఏమిటి?

జవాబు:– 1) ప్రవచించుటవల్ల ఇతరులకు మేలు గనుక పౌలు భాషలతో మాటలాడువానికంటె ప్రవచించువానినే ఎక్కువ మెచ్చుకొనుచున్నాడు. ఇందువలన భాషలతో మాటాలాడుటను కొట్టివేయుటలేదు. 2) ప్రవచించుట అనగా దేవుని చిత్తమును ప్రజలకు తెలియజేయుట. భాషార్థములోను, దైవవాక్యములోను,

దాని వివరములోను ప్రవచనముండును. పూర్వకాలపు ప్రవక్తలు రాబోవు సంగతులను చెప్పువారు. అందుచేతనే వారికి ప్రవక్తలని పేరు వచ్చినది.

**53. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ ఇచ్చువరములేవి?

జవాబు:- 1) ప్రవచన వరము 2) స్వప్న వరము 3) దర్శన వరము (యోవేలు. 3:28), 4) పరిచర్యవరము, 5) బోధించు వరము, 6) హెచ్చరించు వరము, 7) పంచిపెట్టు వరము 8) పైవిచారణచేయు వరము, 9) కరుణించు వరము (రోమా. 12:8), 10) జ్ఞాన వాక్యముచెప్పు వరము, 11) బుద్ధివాక్యము చెప్పు వరము, 12) విశ్వాస వరము, 13) స్వస్థపరచు వరము, 14) అద్భుతములు చేయు వరము, 15) ఆత్మవివేచన వరము, 16) నానా భాషల వరము, 17) భాషార్ధము చెప్పు వరము, 18) పరలోక భాషలు మాట్లాడు వరము (1కొరింథి. 12:8-10).

**54. ప్రశ్న:-** పరిశుద్ధాత్మవల్ల ఏ మంచి గుణములు అబ్బును?

జవాబు:- 1) ప్రేమ, 2) సంతోషము, 3) సమాధానము, 4) దీర్ఘశాంతము, 5) దయాళుత్వము, 6) మంచితనము, 7) విశ్వాసము, 8) సాత్వికము, 9) ఆశానిగ్రహము (గలతీ. 5:22) ఆత్మస్నానము పొందినాము అని చెప్పుకొనువారిలో ఈ గుణములు ఉండవలెను.

**55. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారిలో మార్పులేమియు కనబడడము లేదేమి?

జవాబు:- 1) పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి శ్రద్ధగా నేర్చుకోవడము మార్పుకాదా? 2) నేర్చుకొని నమ్మడము మార్పు కాదా? 3) నమ్మి పొంద ప్రయత్నించుట, కన్నీళ్ళతో ప్రార్థించుట నిద్రమాని మోకాళ్ళమీద ఉండుట. ఇవి మార్పులుకావా? 4) పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందటము మార్పు కాదా? 5) ఎరుగని భాషలతో మాటలాడుట మార్పుకాదా? 6) అర్థము చెప్పుట మార్పు కాదా? 7) క్రైస్తవమతమంటే చెప్పవద్దు చెప్పవద్దు అనేవారు, పరిశుద్ధాత్మ కూటములకు వచ్చిన వెనుక నీళ్ళబాప్తిస్మము కోరుకోవడము మార్పుకాదా? 8) సంఘకూటాలకురాని క్రైస్తవులు ఈ కూటములకు, సంఘ కూటములకు రావడము మార్పుకాదా? 9) బైబిలు మునుపటికంటె శ్రద్ధగా చదవడము మార్పుకాదా? 10) గంటలు గంటలె ప్రార్థనలో, స్తుతిలో, కనిపెట్టుటలో ఉండడము మార్పుకాదా? 11) ఎవరికిబడితే వారికే దేవుని మాటలు చెప్పడము మార్పుకాదా? 12) దర్శనాలు చూడడము మార్పుకాదా? 13) దేవుని స్వరమును వినడము, ఆ విన్నది వ్రాసుకోవడము మార్పుకాదా?

**56. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు ఏల పాపములో మరల పడిపోవుచున్నారు?

జవాబు:- 1) పడకూడదు, ఎక్కడైనా, ఎవరైనా పడినట్టుంటే దానికి ఏమి చెప్పగలము? అంతమాత్రమున అతడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుట అనేది నిజము కాదా ఏమి? (హెబ్రీ. 6:4-6) (లూకా. 12:10) చదివి చూడుము. 2) నాలుగు రకముల నేలలలో పడిన వడ్లగింజ ఒక్కటేకదా? నాలుగవ స్థలములో మంచి ఫలితము కలిగినదికాని మూడు స్థలములలో కలిగిన స్వల్ప ఫలితము నశించిపోయినది. అట్లు

నశించిపోయినంత మాత్రమున ఆ మూడు స్థలములలో విత్తనము పడడమనేదియును, కొద్దిగా మొలవడమనేదియును నిజము కాకపోవునా? విత్తనము పడడమును, అది కొద్దిగా మొలవడమును పిశాచిపని క్రింద లెక్కపెట్టుదురా? ఆగిపోవడము నశించిపోవడము పిశాచి పనిక్రింద లెక్కపెట్టండి. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందడము, భాషలతో మాటలాడడము పిశాచి పనులా? పొందినవారిని నిరుత్సాహ పరచడము, హేళన చేయడము : ఇవి పిశాచి పనులా? దేవుని వాక్యములో స్పష్టముగా వ్రాసియున్న సంగతి ఒప్పుకొనక పోవడము, దాని ఫలితములు గ్రహించక పోవడము, దుర్వార్తలు కల్పనచేయడము ఇవి ఎవరి పనులు? 3) నీళ్ళబాప్తిస్మము పొందినవారిలో పరిశుద్ధాత్మ ఉన్నాడు కదా? వారేల పడిపోవుచున్నారు? తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొన వలయును (1కొరింథి. 10:12).

**57. ప్రశ్న:-** ప్రవర్తన ముఖ్యము కాదా?

జవాబు:- ఎందుకు ముఖ్యము కాదు? అన్యులు బైబిలు చదువరు. క్రైస్తవుల ప్రవర్తనను చూతురు. ఇది బాగా ఉంటే బైబిలు మంచి గ్రంథమని వారు తెలుసుకొందురు. అయినను మనము ఇతరుల ప్రవర్తనమీద ఆనుకొనక, వాక్యములో ఉన్న సంగతిమీద ఆనుకొనవలెను. ప్రర్తన సరిగా లేదని చెప్పి బైబిలును కొట్టివేయ వలెనా? బి) భక్తుల అనుభవములో భేదముండవచ్చును. సి) క్రైస్తవుల వృత్తాంతమును గూర్చిన వదంతిలో నిజము ఉండక పోవచ్చును. డి) ప్రవర్తనను స్వయముగా చూచినవారు అర్థము చేసికొనుటలో తప్పులుండవచ్చును. ఇ) కొందరు భక్తిగా

నడుచుకొన్నప్పటికిని, అనేక కష్టముల పాలు కావచ్చును. ఎఫ్) ప్రవర్తనను చూడక వాక్యమునుచూచి, ఆ వాక్యము యెడలగల తమ స్వాభిప్రాయము కొందరు వెల్లడింతురు. ఆ అభిప్రాయములో భేదములుండవచ్చును. కాబట్టి ప్రవర్తన, అనుభవము, వదంతి, అపార్థము, కష్టకాలము, స్వాభిప్రాయము; ఈ మొదలగు వానిలో కొరత ఉండవచ్చును. అందుచేత వీటిని గురించి వినవచ్చును గాని దైవవాక్యము మీదనే ఆనుకొనవలెను.

**58. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందనివారికి అద్భుత కార్యములు చేయుశక్తిలేదా?

జవాబు:- ఉన్నది. 1) పాతనిబంధనలో దైవజనులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందకపోయినను, పరిశుద్ధాత్మను కలిగియుండినందున అనేక అద్భుతములు చేసిరి. 2) అలాగే డెబ్బదిమంది శిష్యులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందక మునుపే అద్భుతములు చేసిరి (మత్తయి. 10:1,2). 3) **అలాగే ప్రభువు యొక్క శిష్యులు పరిశుద్ధాత్మ బాప్తిస్మమునకు పూర్వమే అద్భుతములు చేసిరి** (లూకా. 10:1-12).

ఒక సంగతి బాగుగా జ్ఞాపకముంచుకొనండి. పరిశుద్ధాత్మను కలిగియున్న పాతనిబంధన భక్తులును, వారివలె క్రీస్తు శిష్యులును అనగా పరిశుద్దాత్మ బాప్తిస్మము పొందని స్థితియందున్న క్రీస్తు శిష్యులును దైవసంబంధమైన కార్యములు చేయగలిగిరి. అయితే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన తర్వాత, ఆయనను పొందినవారు ఆ కార్యములతోపాటు పైగా క్రీస్తు సిలువ పునరుత్థానములను గురించి ప్రత్యక్షముగా సాక్ష్యమియ్యగలిగిరి.

మరియు సాక్ష్యమియ్యగల ప్రత్యేకమైన శక్తిపొందిరి. అది మాత్రమే కాకుండ పై రెండు జట్టులవలె ఒక స్థలమందే ఉండక భూదిగంతముల వరకు సాక్షులుగా బైలుదేరిరి.

1) ఏలాగననగా, తాము నేర్చుకొనని భూలోక భాషలతో సువార్త ప్రకటించుట, 2) నేర్చుకొనని పరలోక భాషలతో ప్రార్థనా స్తుతులు చేయుట, 3) పరలోక భాషలకు అర్ధము చెప్పుటఈ మొదలైన నూతన అనుభవములతో వారు పరిశుద్ధాత్మ తండ్రి ఇచ్చు అద్భుత శక్తిని భూదిగంతములవరకు వెల్లడి చేసిరి.

**59. ప్రశ్న:-** అనేకమంది పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుట లేదు కదా? కారణమేమైయుండును?

జవాబు:- 1) పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి పూర్తిగా తెలిసికొనలేదు. అందువలననే నమ్ముటలేదు. 2) నమ్మనందుననే ప్రయత్నించుటలేదు. 3) ప్రయత్నించనందుననే పొందుటలేదు. "అపోల్లో, కొరింథులో నున్నప్పుడు జరిగినదేమనగా, పౌలు పై ప్రదేశములలో సంచరించి, ఎఫెసుకు వచ్చి కొందరు శిష్యులను చూచి మీరు విశ్వసించినప్పుడు పరిశుద్ధాత్మను పొందితిరా? అని వారినడుగగా, వారు పరిశుద్ధాత్ముడు న్నాడన్న సంగతియే మేము వినలేదని చెప్పిరి. అప్పుడతడు అలాగైతే మీరు దేనినిబట్టి బాప్తిస్మము పొందితిరని అడుగగా వారు యోహాను బాప్తిస్మముబట్టియే అని చెప్పిరి. అందుకు పౌలు యోహాను తన వెనుక వచ్చు వానియందు, అనగా యేసునందు విశ్వాసముంచవలెనని ప్రజలతో చెప్పుచు, మారుమనస్సు విషయమైన బాప్తిస్మమిచ్చెనని చెప్పెను. వారు ఆ మాటలు విని

ప్రభువైన యేసునామమున బాప్తిస్మము పొందిరి. తరువాత పౌలు వారి మీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలతో మాటలాడుటకును, ప్రవచించుటకును మొదలుపెట్టిరి. వారందరు ఇంచుమించు పన్నెండుగురు పురుషులు (అపో॥కార్య॥ 19:1-7).

**60. ప్రశ్న:-** మీ కూటములలోనికి ఇతరులను రానియ్యరట. ఎందుచేత?

జవాబు:- 1) రానియ్యక పోవడముకాదుగానీ కూటములోని వారిదివరకు నేర్చుకొనిన సంగతులు, క్రొత్తవారునూ నేర్చుకొన్న తర్వాత రానిత్తుము. 2) నేర్చుకొనడము ఇష్టము లేనివారు ఊరకనే చూడవలెనని వస్తే రానిస్తాము. గాని ఆలాగు వచ్చినవారికి అంత ప్రయోజనము కలుగదు. మధ్యను రావడము గనుక అన్ని సంగతులు నచ్చవు. అందుమీదట ఆక్షేపణలు మాత్రమేగాక తప్పుడు అర్ధములు, కల్పనలు, లేనిపోని యూహలు బైలుదేరును. "క్షేమాభివృద్ధియు, హెచ్చరికయు, ఆదరణయు కలుగునట్లు, ప్రవచించువాడు మనుష్యులతో మాటలాడుచున్నాడు" అని పౌలు చెప్పిన మాటలు సమయమునకు వచ్చి ఆత్మ తండ్రిని గూర్చిన సంగతులన్నియు సంపూర్తిగా నేర్చుకొను వారికి సరిగా సరిపోవును. క్రొత్తగా వచ్చేవారికి వెనుకటి సంగతులు నేర్పే ఏర్పాటున్నది.

**61. ప్రశ్న:-** ఆత్మ కుమ్మరింపు అంటే పరిశుద్ధాత్మ మోక్ష లోకములోనుండి దిగివచ్చి మనమీద వాలునని ఎందుకు అనుకొనవలెను? ఆత్మ పని మనలో జరుగును అని అర్ధముగాని, పైనుండి వచ్చుననే అర్ధమా?

జవాబు:- 1) ఆత్మ కుమ్మరింపువలన ఆత్మ పని జరుగును అనే అర్థమున్నది. అది ముఖ్యమైన అర్థమే. నీవు చెప్పినది సరేగాని; పైనుండి వచ్చెను అనుటలో తప్పేమున్నది? 2) పైనుండి మనమీద ఆత్మ కుమ్మరింపబడువరకు అని యెషయా వ్రాసెను. కుమ్మరింపు అనుమాటలో గూడ పైనుండి అను భావమున్నది గదా? దేవుని ఆత్మ పావురమువలె దిగెను అని మత్తయి వ్రాసెను (మత్తయి. 3:16) దిగుట అను మాటలో పైనుండి అనే అర్థము లేదా? (మార్కు. 1:10; అపో॥కార్య॥ 8:16) ఆకాశమునుండి అను మాటయు, ఆకాశము తెరువబడెను అనుమాటయును, దిగి వచ్చుట అనుమాటయును, పైనుండి అని అర్థమిచ్చుటలేదా? (లూకా. 3:21-22; అపో॥కార్య॥ 2:2).

**62. ప్రశ్న:-** చదువులేనివారికిని, పిల్లలకును ఆత్మ కుమ్మరింపు త్వరలో కలుగుచున్నది ఎందుచేత?

జవాబు:- వారు వెంటనే నమ్ముచున్నారు గనుకనే. వాక్యము వినగానే వారు నమ్ముదురేగాని ప్రశ్నలు వేయరు, తర్కము లోనికి దిగరు.

**63. ప్రశ్న:-** ఇప్పుడాత్మ బాప్తిస్మము పొందుచున్న వారిలో స్త్రీలు ఎక్కువగా ఉన్నారు ఎందుచేత?

జవాబు:- 1) వారు వాక్యములోని సంగతి త్వరగా అంగీకరించుచున్నారు. 2) పొందవలెనని పట్టుదలగలిగి ప్రార్థించుచున్నారు. సృష్టికాలమందు దురాత్మ ప్రేరేపణను అందుకొన్నది స్త్రీయేగదా! ఈ కాలమందు సంగతి తిరుగబడినది. పరిశుద్ధాత్మ కుమ్మరింపును స్త్రీయే త్వరగా అందుకొనుచున్నది.

ముందంజ వేయుచున్నది. మరియొక సంగతి లోకములో ఏమి చూస్తున్నాము! కుమార్తెలే గదా తండ్రిని ఎక్కువ ప్రేమించుట పరలోకపు తండ్రినికూడ ఎక్కువగా ప్రేమించుటలో స్త్రీలే మొదట వస్తున్నారు.

**64. ప్రశ్న:-** 'పరిశుద్ధాత్మ స్నానము పొందుడి' అని దేవుడు తన విశ్వాసులకెందుకు ఇప్పుడు చెప్పకూడదు? భిన్నబోధలు వినబడుచున్న మన కాలములో చెప్పకపోతే ఇంకెప్పుడు చెప్పడము?

జవాబు:- 1) వాక్యములోనే చెప్పినాడు గదా! ఇంకెందుకు? 2) ఎవరైనా పనిగట్టుకొని పట్టుదలతో అడిగిన తెలియజేయడా? ఏదోయొక రీతిగ తెలియజేయక మానడు. సందేహమెందుకు?

**65. ప్రశ్న:-** ఆత్మస్నానమొందినవారిలో లోపములున్నవి, ఇతరులు వారిని ఎట్లు అనుసరించగలరు?

జవాబు:- వారి లోపములను చూచి దేవునివాక్యమును నిరాకరించడము బాగా ఉన్నదా? మన మతభక్తి మనుష్యులమీద ఆధారపడియుండవలెనా? దేవుని వాక్యముమీద ఆధారపడి యుండవలెనా? "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అని పౌలు 1కొరింథీ 11:1లో వ్రాసెను. నిజమే! పౌలువలె ఇంత ధైర్యముగా చెప్పగల వారి మాదిరిని అనుసరించవలసినదెగాని క్రైస్తవునిలో లోపము కనబడినప్పుడు అనుసరింప వీలులేదు. అప్పుడు ఎఫెసీ. 5:1లో నున్నట్లు దేవుని పోలి నడుచుకొనవలెను. కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవుని పోలి నడుచుకొనుడి".

**66. ప్రశ్న:-** కూటములో లోటు కనబడుచున్నది. కొన్ని నాకు సరిపడలేదు.

జవాబు:- ఈ ప్రశ్నయే మీకు మాటిమాటికి వచ్చుచున్నది. మీకొక మంచి సలహా ఇస్తున్నాను. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి బైబిలులో నున్న వాక్యములన్ని నెమ్మదిగా చదువుకొని ఒకరి సహాయము లేకుండ మీరే స్వయముగా ప్రార్థన చేసికొని, ఆత్మస్నానము పొంది, మీరొక కూటముపెట్టి, మీ కూటములు ఇప్పుడున్న కూటములకంటె శ్రేష్ఠమైనదనియు; కేవలము బైబిలు ననుసరించి యున్నదనియు, మీ కూటము మూలముగా ఋజువు పరుపండి. అప్పుడెంత బాగా ఉండును! 'ఆ కూటము బాగాలేదు, ఈ కూటము బాగా లేదు, కూటమునకు వెళ్ళేవారు బాగాలేరు, వారు బాగాలేరు, వీరు బాగాలేరు' అని అనడముకంటె ఎవరైనా ఒకరు లేచి మహాదివ్యమైన కూటములు పెట్టిన ఎంతో ఉపకారము చేసిన వారగుదురు. ***ఏడ్చుట, మూల్గుట, దొర్లుట అర్థములేని మాటలాడుట ఈ మొదలైనవి లేకుండ కూటము జరిపేవారు. ఇవి రాకుండ ఆత్మ నొందేవారు లేవడము కూటమునకెంతో మేలు కదా!***

**67.** ప్రశ్న:- ఎంతో చెడ్డగా తిరిగేవారికి ఆత్మ వచ్చినదంటే ఏలాగు నమ్మగలము?

జవాబు:- 1) వారు మారిన యెడల ఆత్మ రాకూడదా? సుంకరులును, వేశ్యలును మీకంటే ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని ప్రభువు చెప్పలేదా! (మత్తయి. 21:31). 2) ప్రభువు పాపులను

చేర్చుకొన్నాడని పరిసయ్యుల మాటలవల్ల తెలియుచున్నది (లూకా. 15:1-2). వారు బోధ వినుటకు రాగా ఆయన చేర్చుకొనెను, వారితో భోజనపంక్తిని కూర్చుండెను. ప్రతి పాపియు బోధ వినుటకు వచ్చి బాగుపడితే సంతోషమేగదా?

**68. ప్రశ్న:-** మొదటనుండి కొందరెంతో భక్తిగా నడుచుకొనుచున్నారు. ఎంతోగొప్ప దైవసేవ చేయుచున్నారు. ఎంతో గొప్ప వాక్యానుభవము గలిగియున్నారు. అట్టివారిలో కొందరు ఆత్మకుమ్మరింపు పొందినవారి సంగతులు విని ఎన్నో రోజులనుండి ప్రార్థించుచున్నారు గాని వారికి ఆత్మకుమ్మరింపు రాలేదు. అది నిజమైతే రాదా! వట్టివట్టి వారికి చిటుక్కున రావడమును, తక్కిన వారికి ఎన్ని తంటాలుపడినను రాకపోవడమునా?

జవాబు:- ఇదివరకె దీనికి జవాబియ్యడమైనది. ఎంతకును పొందకపోతే పొందుటకు ప్రయత్నించే ఒక క్రమముకూడ ఉన్నదికదా! ఒకసారి ప్రయత్నించేవారు నిజమని నమ్మబట్టేగదా ప్రయత్నించడము! **అట్టివారు పొందకపోతే మరల మొదటనుండి యత్నించవలెను.** అనగా బైబిలు వాక్యములు మరలచదువవలెను. అందరికి అనేది నచ్చకపోతే ప్రయత్నములో లోపమే. **'అందరికి' అనేది నచ్చేవరకు ప్రార్థించవలెను.** అయినను రాలేదందువేమో! ఆలాగైతే స్తుతియు, కనిపెట్టుటయు ఉండవలెను. ఈ రెండే చిట్టచివర వరకు నుండవలెను.

**69. ప్రశ్న:-** నా ప్రశ్నకు సరిగా జవాబు చెప్పండి. 1) కొందరు ప్రార్థనలో ఉండి ఉండి తల విరియబోసుకొంటున్నారు.

2) మరికొందరు వికారముఖముస మాడిపోయిన ముఖము గలవారగుచున్నారు. 3) ఇంకను కొందరు టట్ టట్ మొదలగు మాటలు ఉచ్చరించుచున్నారు. 4) వేరే కొందరు క్రిందపడి దొర్లుచున్నారు. 5) ఇంకా మరికొందరు కెవ్వున కేకలు వేయుచున్నారు. 6) తక్కినవారు స్తోత్రం స్తోత్రం అని అనేక పర్యాయములనుచున్నారు. ఇంకా చాలా ఉన్నవి, ఇవన్నియు దయ్యపు చేష్టలు కావా?

జవాబు:- పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుట మహిమగల కార్యము. అట్టి కార్యము జరిగే ప్రారంభదశయందు శరీర ప్రాణములు ఆ కార్యమును భరింపలేక అట్టి చర్యలు జరిగించును. తర్వాత అవి పూర్తిగా పోవును. దయ్యపు చేష్టలవలె కనిపించే ***అట్టి చర్యలాగిపోయి శాంతి కలిగేవరకు భాష ధారాళముగాను, మృధువుగాను వచ్చేవరకు; భాషార్థము నేర్చుకొనే వరకును నాయకులు కూటస్థులను బహిరంగములోనికి రానీయగూడదు.*** బలహీనులగు క్రైస్తవులును, పిల్లలును ముఖ్యముగా అన్యులును ఈ చర్యలను చూచి దయ్యము పట్టుకొన్నది అని తలంతురు. ***అట్లు వారు తలంచుటకు సందివ్వకూడదు.*** ఇట్టి చర్యలు వెల్లడియైనప్పుడు దైవవాక్యము నెడలను, ప్రార్థనాచారము నెడలను, క్రైస్తవమతము నెడలను, క్రైస్తవుల యెడలను ఇతరులకు దురభిప్రాయము కలుగును. అన్యులు సంఘములోనికి రాకుండుట కిదియొక గొప్ప ఆటంకపు అడ్డు బండగ నుండును. క్రీస్తు నామమునకు అవమానము కలుగును గనుక నాయకులు జాగ్రత్తగా నుండవలెను.

**70. ప్రశ్న:-** ఆత్మస్నానము పొందినవారు దయ్యములు పూనినవారివలె వణకుట, కేకలు వేయుట, పడిపోవుట, ఏడ్చుట బిగ్గరగా పాడుట ఇవెందుకు చేయుదురు?

జవాబు:- 1) దానియేలు కొొక దర్శనము కలిగినప్పుడు వణకలేదా? (దానియేలు 10:11), 2) భక్తులు బిగ్గరగా ఆనంద గానము చేసెదరు" అని కీర్తన. 132:16లో లేదా? 3) ఆరంభములో వణకుండును. దైవసహవాసము అలవాటుపడగా అదియుండదు. భాషారంభమందునట్టులుండగా, తర్వాత క్రమేణ భాషలో పాటపాడుట కూడ వచ్చును. 4) యోహాను లంకలో దర్శనమందు ప్రభువునుచూచి చచ్చినవానివలె పడిపోయెను గదా! (ప్రకటన 1:17) చచ్చినవానివలె పడుట ఎందుకు? అని యడుగుదురా!

**71. ప్రశ్న:-** స్తుతిచేస్తే ఆత్మ వచ్చునని ఎక్కడ ఉన్నది?

జవాబు:- ఎక్కడను లేదు గాని రెండు కథలలో దాని జాడలున్నవి. **1. మొదటి కథ:** "యేసు ఆ రొట్టెలు పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, కూర్చున్నవారికి వడ్డించెను" అని యోహాను 6:11లో ఉన్నది. ముందు స్తుతి జరిగినది తర్వాత రావలసిన రొట్టెల వృద్ధి కనబడినది. స్తుతివల్ల సిద్ధి కలిగినది. రొట్టెలు వృద్ధియైన తర్వాత కాదుగాని అభివృద్ధి పొందకముందే ప్రభువు స్తుతి చేసెను. అంటే ముందు స్తుతి చేసిన యెడల ఆత్మ వచ్చునని దీనినిబట్టి గ్రహించుకొందుము. మనమైతే రొట్టెలు వృద్ధియైన తరువాత స్తుతి జేతుముగదా! చూడండి! ప్రభువెట్లు నెరవేర్పునకు ముందే స్తుతించెనో! **2. రెండవ కథ:** లాజరు

శవమింకను సమాధిలోనేయుండగా అతడు బ్రతికి బైటికి వచ్చినాయన్నట్టు ప్రభువు ముందే స్తుతిచేసెను. అప్పుడుగదా లాజరు బ్రతికెను (యోహాను. 11:41). ముందుస్తుతి, తర్వాత లాజరు బ్రతుకుట! ప్రార్థన సంగతి నెరవేరకముందే, నమ్మి వేసినయెడల నెరవేరునని ప్రభువు (మార్కు. 11:24)లో చెప్పలేదా! దీనినిబట్టి ఆత్మ నిమిత్తమైన ప్రార్థన నెరవేరకముందె నెరవేరెనని నమ్మవలయునుగదా! అట్లు నిజముగా నమ్మినయెడల, నెరవేరినట్లు భావించి స్తుతిచేయుము. ఆలాగు చేయగా ఆత్మ వచ్చును. స్తుతి చేయకపోతే నమ్మికలేదనియే కదా అర్థము.

**72. ప్రశ్న:-** గొప్ప శబ్దముతో ఎందుకు స్తుతి చేయవలయును?

జవాబు:- 1) ఒక కుష్ఠరోగి స్వస్థత నొందగానే గొప్ప శబ్దముతో దేవుని మహిమపరిచెను గదా! (లూకా. 17:16) గొప్ప శబ్దమెందుకని అడుగుదువా? 2) ప్రభువు గార్ధభాసీనుడై యెరూషలేము వెళ్లుచుండగా, ప్రజలు దావీదు కుమారునికి జయము అని కేకలు వేసిరిగదా! (మత్తయి. 21:9). కేకలెందుకని అడుగుదువా? మరియు 3) దావీదు కీర్తన. 9:1 చదువుకొనుము. దావీదు తన కంఠమెత్తి స్తుతిగానము చేసినట్లు తాను వ్రాసిన పుస్తకములో చూస్తున్నాము. ఆయనే అట్లు చేసిన యెడల మనము మరెంతగా స్తుతి చేయవలెనో ఆలోచించుకొందాము.

**73. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ కూటస్థులలో కొందరి ప్రవర్తన సరిలేదనియు, కొన్ని అనాచారములున్నవనియు, మూఢభక్తి గలదనియు; స్త్రీలు పురుషులు కలిసి కూటములు పెట్టుట మంచిది

కాదనియు; అందుచేత అట్టి కూటము నెత్తివేయుట ఉత్తమమనియు కొందరు పెద్ద మనుష్యుల అభిప్రాయము. మీరేమందురు?

జవాబు:- కొందరిలో లోపములున్నవనుట అసత్యము గాదు. సంఘములో ఒకరు తప్పుచేస్తే ఆ సంఘ మెత్తివేయుదురా? ఒక బడిలో ఒక విద్యార్థి తప్పుచేస్తే ఆ బడిని ఎత్తివేయుదురా? పొరబాటులున్నయెడల దిద్దుబాటు చేస్తే గొప్ప ఉపకారముగాని ఎత్తివేస్తే ఏమి ఉపకారము! 2) సమాజముగా కూడుకొనుట మానవద్దని పౌలు వ్రాయలేదా? (హెబ్రీ. 10:24). 3) ఆదివారము దేవాలయములో స్త్రీ పురుషులు కలిసి ప్రార్థించుటలేదా? అది ఆక్షేపించనప్పుడు ఇదెందుకు ఆక్షేపించవలయును. 4) "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందును" అని ప్రభువు చెప్పలేదా? (మత్తయి. 18:20). 5) మోషేలో లోపమున్నది గనుక ఆది, నిర్గమ, లేవీయ, సంఖ్యా, ద్వితియోపదేశకాండములు కొట్టివేయవలెనా? 6) దావీదులోను, సొలోమోనులోను లోపములున్నవని వారి వ్రాతలు కొట్టివేయవలెనా? 7) ప్రవక్తలలో లోపములున్నవని ప్రవచన గ్రంథములు కొట్టివేయవలెనా? 8) సువార్తికులలో లోపములున్నవని సువార్తలు, అపోస్తలుల కార్యగ్రంథము కొట్టివేయవలెనా? ఈ విధముగా బైబిలులోని పుస్తకములన్నియు కొట్టివేసికొనుచు వెళ్ళవలెనా? ఆత్మ స్నానమందరికి అని బైబిలులో ఉన్న ఆ మాటను కొట్టివేయుట ఎవరితరము? లోపములనుబట్టి ఒకరి ప్రవర్తనను కొట్టివేయగలము గాని వాక్యమును కొట్టివేయగలమా? *ఒకరి ప్రవర్తన బాగాలేదనే వంకమీద వాక్యభాగ్యము అక్కరలేదనవచ్చునా? పాదిరిగారిలో లోపమున్నదని*

తలంచునట్టి మీరు ఆయన ఇచ్చే స్నానము, ప్రభువు భోజన సంస్కారము పుచ్చుకొనకుందురా? నరుల లోపముల వలన వాక్యసంస్కారములు నమ్మకూడనవియు గైకొనదగినివియు అగునా? అధికారుల ఆజ్ఞాపత్రమును తీసికొని వచ్చినమనిషి మంచివాడు కానంత మాత్రమున ఆ ఆజ్ఞను గైకొనకుందురా? ప్రవర్తన సరిలేదను వంకమీద పరిశుద్ధాత్మ స్నానమందరికి కాదని మానివేయువారు; ప్రవర్తన సరిలేదను ఆ వంకమీదనే బైబిలంతటిని విశ్వసింపక మానివేయుదురా ఏమి? **బైబిలులో సర్వజనుల నిమిత్తమైయున్న ఆత్మస్నానమును మానివేయుటకు వంకలు వెదకుట ఎందుకో!**

**74. ప్రశ్న:-** కూటస్థలలో లోపములుంటే లోపములున్నవని చెప్పుట తప్పేనా?

జవాబు:- తప్పుకాదుగాని వారి నడత తప్పు అని చెప్పి, ఆ వంకమీద బైబిలులోని సంగతికూడ తప్పేనని ఇతరులు అనుకొనే మాటలు పలుకుట తప్పుగాదా మరీ! ఒక వేటగాడు పక్షిని గొట్టవలెనని గురిపెట్టి పక్షిని కొట్టినాడు గాని ఆ పక్షితోపాటు కొమ్మనున్న మనిషిని గూడ గొట్టినాడు. మనిషిని కొట్టవలెనని కొట్టలేదు. గాని కొట్టినాడా లేదా? అలాగే మనిషిది తప్పని మనిషిని ఖండించేటప్పుడు, దైవవాక్యమును కూడ ఖంచించేరు సుమీ, జాగ్రత్త! దేవుడు వెక్కిరింపబడడు, మనుష్యుడేమి విత్తునో ఆ పంటనే కోయును (గలతీ. 6:7).

**75. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ కూటములకు వెళ్ళితేనేకాని, ఇంటిలో నుండి ఏకాంతముగా ప్రార్థనచేసికొంటే పరిశుద్ధాత్మ బాప్తిస్మము రాదా?

జవాబు:- ఆదికాలపు క్రైస్తవులు నూట ఇరువదిమంది ఒక మేడ గదిలో కూడుకొని ప్రార్థింపగా బాప్తిస్మము కలిగెను. ఈ వృత్తాంతమును ఎట్లు గ్రహించుచున్నావు? ఒంటరిగా ప్రార్థిస్తే రావచ్చునుగాని పదిమందితోకలిసి ఏకమనస్సుతో కూడుకొన్న యెడల త్వరగా, సరిగా ఆత్మాభిషేకము కలుగును గనుక ఉపదేశము పొందుము, ప్రార్థించుము, అను వాడుకను నిర్లక్ష్య పెట్టినయెడల అదియొక లోపమగును. లోపముంటే బాప్తిస్మమెట్లు కలుగును?

**76. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ కూటములకు వెళ్ళకూడదు. వెళ్ళితే మాకుకూడ దయ్యములు పట్టుకొంటాయి. దీనికేమి చెప్పుదురు?

జవాబు:- డాక్టర్. మార్టిన్ లూథరును వర్మ్స పట్టణమునకు వెళ్ళకూడదని స్నేహితులు చెప్పినప్పుడు ఆ పట్టణములోని ఇండ్లమీద ఎన్ని పెంకులున్నవో, అన్ని దయ్యములు నా మార్గమునకు అడ్డుగా ఉన్నను వెళ్ళక మానననని చెప్పెను గదా! మీకేల భయము! సాతాను విశ్వాసులకు జడువవలయును, గాని విశ్వాసులు సాతానుకును జడువనేల! లూథరుయొక్క మంచిమాదిరి మనమవలంభించ కూడదా?

**77. ప్రశ్న:-** గత సంవత్సరాంతమందు జరిగిన కన్వెన్షన్‌లో మీ ప్రార్థన కూటములకు షారోను సంస్తుతి సమాజమని ఎందుకు పేరు పెట్టినారు?

జవాబు:- ప్రభువుయొక్క రాకడకు పూర్వము జరుగవలసిన గుర్తులు జరిగిపోవుచున్నవి గనుక ఆయన రాకడ

కాలము అతి సామీప్యముగా యున్నదని మేము నమ్ముచున్నాము. యూదులు యెరూషలేమునకు తిరిగివచ్చుట ఒక చివరి గుర్తు. ఇప్పటికి నాలుగు లక్షలమంది వచ్చిరి. అది అతి సామీప్యముగా నున్నదని నమ్మేవారందరును, ఆయన వచ్చినప్పుడు మహిమ శరీరముతో ఎత్తబడుదురని నిరీక్షించుచున్నారు. మేమును వారిలోని వారమే. ఎత్తబడేవారే పెండ్లి కుమార్తె వరుసలోనివారు అయి ఉన్నారు. పరమగీతము అనే పుస్తకములో ఈ పెండ్లికుమార్తె యొక్క ముంగుర్తు ఎంతో పావన వృత్తాంతముగా నున్నది. “నేను షారోను పొలములో పూయు పుష్పమువంటిదానను” అని పరమగీతములోని పెండ్లి కుమార్తె తాను పొందిన పవిత్రస్థితిని గురించి చెప్పుకొనుచున్నది. ఇది విశ్వాసుల సంఘము. ఈ వాక్యము క్రీస్తురక్తమువల్ల పొందిన పరిశుద్ధ స్థితికి ముంగుర్తైన వాక్కయియున్నది. మా కూటములో పాపపు ఒప్పుదల, పూర్ణ సమర్పణ ప్రార్థన ఉన్నప్పటికిని, ఎక్కువ స్తుతి యుండును గనుక సంస్తుతి అనుమాట చేర్చినాము. మేలు కలిగినప్పుడు మాత్రమేకాక కీడు కలిగినప్పుడును అదే విధముగా స్తుతి చేయుచుండుట అలవాటు చేసికొనుచున్నాము.

**78. ప్రశ్న:-** ఆత్మస్నానము పొందనివారు గూడ దీనిని గురించి బోధించుచున్నారు ఇదెందుకు?

జవాబు:- ఆత్మజీవములేని ఎందరు వాక్యమును బోధింపగా ఎందరో క్రైస్తవులగుచున్నారు. ఇది నిజము కాదా? మనుష్యులనుబట్టి కాదు మనుష్యులు మారడము. గాని దేవుని వాక్యములనుబట్టి క్రైస్తవ బోధకులుచేయు ప్రసంగములో ఏదో ఒక మాటవల్ల ఎవరో ఒకరు మారడములేదా? లోపములుగల

బోధకులు బోధ చేయుట లేదా? లోపములుదిద్దుకొని బోధించుట వాక్యానుసారమైన పద్ధతి.

**79.** ప్రశ్న:- పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందే సమయములో పిశాచి ప్రవేశించుట కూడ ఉండునని కొందరి అభిప్రాయము. దీనికేమి యుత్తరముకలదో!

జవాబు:- అవును కొందరిలో పిశాచి ప్రవేశించు చున్నాడని వారి చర్యలవల్ల మనము గ్రహించగలము. గాని అట్టి సమయములో కూటస్థులూరుకొనరు. ప్రార్థనా స్తుతులవల్ల దయ్యమును వెళ్ళగొట్టుదురు. ***(ఆత్మల విమోచనావరము గలవారిది గ్రహించగలరు).***

**80.** ప్రశ్న:- అలాగైతే అట్టి కూటములకు ఎందుకు వెళ్ళవలెను?

జవాబు:- 1) చాలమంది పరిశుద్ధాత్మయొక్క పనివల్ల కలిగే మేలు పొందుచున్నారు గదా! 2) గుడికి వెళ్ళే కొందరు మారడము లేదనియు, కొందరు బొత్తిగా చెడిపోవుచున్నారనియు మన మందరమును గుడికి వెళ్ళడము మానవలెనా? *3) ప్రభువు భోజనము పుచ్చుకొనే కొందరు తమ విరోధములను అలాగే ఉంచుకొనుచున్నారని మన మందరము సంస్కార భోజనము మానవలెనా? 4) వైద్యశాలలకు వెళ్లే కొందరు బాగు కాలేదనియు, కొందరు చనిపోవుచున్నారనియు చెప్పి వైద్యశాలలకు వెళ్ళడము మానివేయవలెనా?*

**81.** ప్రశ్న:- పిశాచికూడ ప్రవేశించును. ఆ మాటేచాలా భయంకరమైనమాట. ఏలాగు మరి?

జవాబు:- 1) ఇతరులకు అభ్యంతరము కలిగించ కూడదు (రోమా. 14:13). 2) "ప్రియులారా! అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలువెళ్లియున్నారు. గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని ఏ ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది. ఏ ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనదికాదు. దీనినిబట్టియే దేవుని ఆత్మను మీరెరుగుదురు. క్రీస్తువిరోధి ఆత్మ వచ్చునని మీరు వినిన సంగతి ఇదే. ఇదివరకే అది లోకములో ఉన్నది. చిన్నపిల్లలారా! మీరు దేవుని సంబంధులు. మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవానికంటే గొప్పవాడు గనుక మీరు వారిని జయించియున్నారు. వారు లోకసంబంధులు గనుక లోక సంబంధులైనట్లు మాటలాడుదురు. **లోకము వారి మాట వినును.** మనము దేవుని సంబంధులము. **దేవుని ఎరిగినవాడు మన మాట వినును.** దేవుని సంబంధికానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్యస్వరూపమైన ఆత్మ ఏదో, భ్రమపరచు ఆత్మ ఏదో తెలిసికొనుచున్నాము (1యోహాను. 4:1-6). "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1తిమోతి. 4:1). ప్రభువు విశ్వాసులకు దయ్యములను వెళ్ళగొట్టే వరము ఇచ్చినాడు గనుక వారిచేత ప్రార్థన చేయిస్తే దయ్యము వదలిపోవును. కూటములోనికి వచ్చినవారికే కాదు, ఇతరులకు కూడ దయ్యములు పట్టుట మీరెరుగరా? మార్కు. 5వ

అధ్యాయములోని పిచ్చివాడు ఏ కూటములకు వెళ్ళితే దయ్యము పట్టినది?

**82. ప్రశ్న:-** కూటములలో దయ్యము చేష్టలు కనిపించిన వెళ్ళడమెందుకు?

జవాబు:- నీకు అట్టి అనుమానమున్న యెడల వెళ్ళకుము. నీ గదిలోనే ఉండి ఆత్మకొరకు ప్రార్థించుము. ఇదీచేయక, అదిచేయక మధ్య, మార్గమున ఉన్న ఏలాగు?

**83. ప్రశ్న:-** స్త్రీలును, పురుషులును కూటము చేసికొందురు. ఇది ఆక్షేపణకాదా?

జవాబు:- ఎ) పెంతెకొస్తు రోజున, కూడుకొనిన మొదటి క్రైస్తవులు స్త్రీలును, పురుషులును కారా? బి) మన సంఘములో జరిగే ఆదివార ఆరాధనలకును, ఆదివారపు బడులకును, పండుగరోజున జరిగే ఆరాధనలకును, పండుగలకు సంబంధించిన ఆటపాటలకును, మత విషయములు ధ్యానించుటకై ఊరిబైట చేసే కూటములకును స్త్రీలును, పురుషులును వెళ్ళుటలేదా? పగలు మాత్రమే కాదు, రాత్రులుకూడ వెళ్ళుటలేదా? సువార్త పనిమీద స్త్రీలు, పురుషులు పొరుగు ఊరులకు వెళ్ళి కొన్ని రోజులు రేయింబగళ్లు బోధ పని చేయుటలేదా? వాటికి లేని ఆక్షేపణ వీటికేనా వచ్చినది! ఆక్షేపించిన అన్నీ ఆక్షేపణలే అగును.

**84. ప్రశ్న:-** పూర్వము గాలి, ధ్వనియు, అగ్నియు కలిగెను. ఇప్పుడెందుకు కలుగుటలేదు?

జవాబు:- ఇప్పుడును కొందరికి కలుగుచున్నది. **తెలియకపోతే కలుగుటలేదనకూడదు.**

**85. ప్రశ్న:-** అమెరికా, ఇంగ్లాండు, జర్మనీ మొదలైన పశ్చిమ ఖండ దేశములలోకూడ భాషల కూటములున్నవనియు, ఆ కూటములు పిశాచి ప్రేరేపణచేతనే జరిగినవనియు, భక్తుల ప్రార్థనలవల్ల ఆ కూటస్థులు బాగుపడిరనియు చెప్పుచున్నారు ఇదేమి?

జవాబు:- దైవభక్తులు వ్రాసినారు గనుక నిజమని నమ్మవలసినదే. చెడిపోవువారు భాషల కూటములోనే చెడిపోవు చున్నారా ఏమి? ఇతర కూటములలో చెడిపోవుట లేదా? చెడిపోవుటనేది ప్రతి స్థలమందు ఉన్నది. క్రీస్తు ప్రభువు ఏర్పరచిన వారిలో ఒకడు చెడలేదా? అంత మాత్రమున ఆయన దేవుడు కాకపోవునా?

**86. ప్రశ్న:-** భాషల సంగతి రోమా. 12:6-8లోను, ఎఫెసీ. 4:8-13లోను ఉన్న వరముల జాబితాలో ఏమాత్రమును ఉదహరింపబడలేదు గనుక ముఖ్యము కాదుగదా!

జవాబు:- ఒకచోటనుండి, ఇంకొకచోట నుండని సంగతి అంగీకరింపకకూడదని ఎక్కడున్నది? అలాగైతే నాలుగు సువార్తలలోను ఉన్న ఆహారాద్భుతమును అంగీకరించి, మహాముఖ్యమైనదిగా ఎంచి, మూడు సువార్తలలో లేని యోహాను 3:16ను అంగీకరింపకూడదనియు, ముఖ్యమైనది కాదనియు అందురా?

**87. ప్రశ్న:-** "అయినను సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుటకంటె ఇతరులకు బోధ కలుగునట్లు నా మనస్సుతో అయిదు మాటలు పలుకుట మేలు" అని 1కొరింథి. 14:19లో ఉన్నది గనుక భాష అవసరము లేదుగదా!

జవాబు:- ఎ) "సంఘములో" అనే మాట గుర్తించ వలెను. పౌలు సంఘములో మాట్లాడక, తాను ఒంటరిగా ఉన్నప్పుడు భాషలో మాటలాడేవాడని ఇందువల్ల గ్రహించుకొనుము. నేటి క్రైస్తవులును అట్లే చేయవలెను. **ఆయన దేవునితో పరలోక భాషలోను సంఘముతో స్వభాషలోను మాట్లాడువాడు.** మీరును ఈ రెండు పనులు చేయండి. బి) 18వ వచనములో పైనున్న వాక్యము చదువరా ఏమి? నేను మీయందరికంటె ఎక్కువగ భాషలతో మాటలాడు చున్నాను. అందుకు దేవుని స్తుతించెదను (1కొరింథి. 14:18).

**88. ప్రశ్న:-** "మరియు దేవుడు సంఘములో మొదట కొందరిని అపోస్తలులుగాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, పిమ్మట కొందరిని బోధకులుగాను, అటుపిమ్మట కొందరిని అద్భుతములు చేయువారినిగాను, తరువాత కొందరిని స్వస్థపరచు కృపావరములుగల వారినిగాను, కొందరిని ఉపకారములు చేయువారినిగాను, కొందరిని ప్రభుత్వములు చేయువారినిగాను, కొందరిని నానాభాషలు మాటలాడువారినిగాను నియమించెను. అందరు అపోస్తలులా? అందరు ప్రవక్తలా? అందరు బోధకులా? అందరు అద్భుతములు చేయువారా? అందరు స్వస్థపరచు కృపావరములుగలవారా? అందరు భాషలతో మాటలాడు చున్నారా? అందరు ఆ భాషల అర్థము చెప్పుచున్నారా? (1కొరింథి. 12:28-30). ఈ వాక్యములనుబట్టి చూస్తే దేవుడందరికిని భాషలియ్యడని కనబడుచున్నది. భాషలు వచ్చితీరవలెవలెనని ఏల చెప్పుచున్నారు?

జవాబు:- దేవుడు తన సర్వజ్ఞాన దృష్టినిబట్టి, ఉద్యోగ నియమమునుబట్టి, వరములను ఇచ్చును. భాష అడిగినవారి కెందుకివ్వరు. మత్తయి. 7:7లో అడుగుడి మీకివ్వబడును అని ఉన్నది గనుక భాషను గురించి కూడ అడుగవచ్చును. ఇష్టమున్న వారడిగి పొందుటలో ఏమి ఆక్షేపణ?

**89. ప్రశ్న:-** "అయినను వీటినన్నిటిని ఆ ఆత్మ యొక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి ఇచ్చుచు, కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (1కొరింథీ. 12:11). ఆత్మ తన ఇష్టము చొప్పున వరములు పంచి ఇచ్చునని ఈ వచనములో ఉన్నది గనుక మనము భాష కోరుకొనరాదుగదా?

జవాబు:- భాష కావలెనని 120 మంది ప్రార్థింపలేదు, ఆత్మ కుమ్మరింపు మాత్రము అడిగిరి. దానితో భాష వచ్చినది. అపోస్తలులవలె మీరును చేయుడి.

**90. ప్రశ్న:-** క్రీస్తు పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చునని ప్రవచించిన యోహాను భాషను గురించి ఏమియు చెప్పలేదే! అది అంత ముఖ్యమైనదైతే చెప్పియుండడా?

జవాబు:- ఆలాగైతే, యోహాను చెప్పనిది కార్యములు 2:4లో ఉన్నది. గనుక బైబిలులోనుండి తుడుపు పెట్టవలెనా?

**91. ప్రశ్న:-** భాషలు మాటలాడిన కొరింథీయులను పౌలు గద్దించెను గదా! (1కొరింథీ. 14వ అధ్యాయము).

జవాబు:- అందుకు గద్దించలేదు. భాష సరిగా వాడనందున గద్దించెను. నేను మాటలాడుచున్నానని చెప్పుటవల్ల బాగా వాడండని సలహా ఇస్తున్నాడు. తన్ను పోలి నడుచుకొనవలెనని పౌలు వ్రాయలేదా? (1కొరింథీ. 11:1).

**92. ప్రశ్న:-** భాష దయచేయుమని ప్రార్థించుచు, ప్రార్థనలో వృధాగా సమయము గడుపుచు, భాషకంటె ముఖ్యమైన పనులు నిర్లక్ష్యపెట్టుట న్యాయమా?

జవాబు:- బైబిలులో నున్న భాషలను స్వల్పముగా ఎంచుట ఎట్లు లోపమో, దిన కృత్యములు స్వల్పముగా నెంచుట కూడ అంతే లోపమే.

**93. ప్రశ్న:-** ప్రవచించువాడు శ్రేష్టుడనియున్నది గనుక భాష మాటలాడువాడు శ్రేష్టుడు కాడనియె గదా అర్ధము!

జవాబు:- కాదు. భాషలు మాటలాడువాడు శ్రేష్టుడని యర్ధము. సంఘము క్షేమాభివృద్ధిపొందు నిమిత్తము భాషలతో మాటలాడువాడు అర్ధము చెప్పితేనేగాని వానికంటె ప్రవచించువాడే శ్రేష్టుడు (1కొరింథి. 14:15). ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని ప్రభువు (యోహాను 3:5)లో చెప్పినది ఎట్లు అర్ధము చేసికొందురు? ప్రవేశింపలేడని ఆ చివరి మాట పట్టుకొని అర్ధము చెప్పగలరా? జన్మించితే ప్రవేశించునని గదా అర్ధము చెప్పుదురు. అలాగే భాష వచ్చి దాని అర్ధము చెప్పువాడు, ప్రవచించువానికంటె శ్రేష్టుడే అని అర్ధము. వేరొకర్ధమెట్లు చెప్పగలము?

**94. ప్రశ్న:-** "భాషలైనను నిలిచిపోవును" అని 1కొరింథి. 13:8లో ఉన్నది. అపోస్తలుల కాలములో ఇవి మాట్లాడిరి. అప్పటినుండి ఇప్పటివరకు ఎవరును మాట్లాడుట లేదు. గనుక ఇది ప్రయత్నము చేసిననురాదు. ఆగిపోయినది ఎట్లు వచ్చును? ఆగిపోవును అనే ప్రవచనము నెరవేరవద్దా?

జవాబు:- సంఘ చరిత్రలో అప్పుడప్పుడు, అక్కడక్కడ కొందరు మాట్లాడిరిగాని సంఘమంతయు మాట్లాడలేదు. ఎందుకంటే భాషావరము అందరు అంగీకరింపలేదు, గనుక ఆగిపోయినది. దేవుడు ఇవ్వనందువల్ల ఆగిపోలేదు. మనిషి నమ్మనందువల్ల ఆగిపోయినది. ఇది అంతా ఎందుకు? ఈ ప్రశ్నవేసే మీకు రాలేదు గనుక మీ విషయములోనే "ఆగింది. ఆగిపోవునని ఉన్నందున" నేను ప్రయత్నము చేసినను రాదు, గనుక నేను ప్రయత్నము చేయనని ఊరుకొనుటవల్ల ఆగిపోతుంది. గనుక పౌలుయొక్క ప్రవచనము మీలో నెరవేరినది నమ్మినవారిలో నెరవేరనిదైయున్నది. భాషావరము కలిగియుండవలెననేది సంఘముయొక్క సిద్ధాంతములలో లేదుగాని సంఘములోని కొంతమంది అనుభవములలోను, సిద్ధాంతములలో ఉన్నది. సంఘములో మాత్రము ఆగిపోయినది. భాష వచ్చిన నేనుకూడ వాడకపోతే నాలోకూడ ఆగిపోవును.

**95. ప్రశ్న:-** (మార్కు. 16:17,18) ఈ భాగములను మార్కు వ్రాయలేదనియు, ఎవరో చేర్చినారనియు, అది సందర్భము లేకుండ చేరినదనియు, కొందరు వ్యాఖ్యానకర్తలు వ్రాయుచున్నారు. ఈ వ్రాతలోనేగదా భాష మాటలాడుదురని యున్నది. మార్కు వ్రాయనిది ఎట్లు నమ్మగలము అని అనుచున్నారు. దీనికేమందురు?

జవాబు:- ఎ) మోషే వ్రాసిన ద్వితియోపదేశకాండములో చివరి అధ్యాయములో మోషే మరణమును గురించి యున్నది గదా! చనిపోయిన మోషే ఏలాగు వ్రాసినాడు? యెహోషువా ఆ అధ్యాయము చేర్చియుండునని సామాన్యభిప్రాయము బి) యోహాను 20 అధ్యాయములోని చివరి మాటలు చూడగా

గ్రంథము ముగించినట్లు కనబడుచున్నది. అయితే 21వ అధ్యాయము తర్వాత చేర్చినది. ద్వితీ. 34ను, ఈ యోహాను 21ని బైబిలులోనుండి తీసివేయవలెనా? ఇవి మోషేయును, యోహాను వ్రాయకపోతే మరెవరైనా వ్రాసి ఉండరా? వారు మాత్రము ఆత్మవేశముగలవారు కారా? (సువార్తికులే వ్రాసిరని నా నమ్మిక).

**96. ప్రశ్న:–** భాష లాటంకపెట్టకూడదని అంటున్నారు గదా! లేనిపోని భాషలు మాటలాడితే ఆటంకపెట్టవద్దా?

జవాబు:– నీకు నిశ్చయము తెలిస్తే, లేనిపోని భాషలైతే ఆటంకపెట్టవచ్చును.

**97. ప్రశ్న:–** మాట్లాడే భాష తెలియకపోవుట తప్పుగదా?

జవాబు:– ఇదివరకు చెప్పితినిగదా! అర్ధము కొరకు ప్రార్థించవలెనని. మాటలాడే భాష తెలియకపోవడము తప్పను చున్నారు గదా! భాష మాటలాడవలెనని బైబిలులోనున్న సంగతి ఇన్నాళ్ళనుండి మీకు తెలియకపోవడము తప్పని తోచదా ఏమి?

**98. ప్రశ్న:–** అబద్ధ ప్రవక్తలను గురించి జాగ్రత్తపడుమని ప్రభువు చెప్పెనుగదా! పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి బోధించు వారే అబద్ధ ప్రవక్తలని కొందరనుచున్నారు. దీనికేమి జవాబు?

జవాబు:– 'మనుష్యులందరికి' అనియు, అందరు భాషలతో మాటలాడవలెననియు బైబిలులో మిక్కిలి స్పష్టముగా నున్న సంగతి బోధించువారా, అవి బోధింపనివారా, అబద్ధ బోధకులు? కొన్ని సంగతులు బైబిలులో స్పష్టముగా లేవు. వాటిని మన ఇష్టము వచ్చినట్టు అనుకొన్నను అంత నేరముకాదు. అయితే,

తేటగా ఉన్నది కూడ ఆ విధముగా ఇష్టము వచ్చినట్లు అనుకోవడము సరియా!

**99. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందితేనేగాని రెండవ రాకడలో ఎత్తబడమా?

జవాబు:- 'ఎత్తబడము' అను స్పష్టమైన ఒక వాక్యము లేదు. గాని దేవుడు మనకిచ్చిన జ్ఞానమునుబట్టి ఆలోచించుకొంటే ఎత్తబడుట అసాధ్యమని గ్రహింపగలము. క్రీస్తుప్రభువు చేసే ఒక గొప్పపని పరిశుద్ధాత్మ బాప్తిస్మమిచ్చుటే (మత్తయి 3:11; అపో॥ కార్య. 2:23). ప్రభువు విషయమై చేసే అన్ని పనులకు సమ్మతించి, పరిశుద్ధాత్మ బాప్తిస్మమనే ఆ ఒక్క పనికి నీవు సమ్మతించకపోతే, క్రీస్తును అంగీకరించనట్టే గదా! మరియు ఇంకొక సంగతి. ఈ బాప్తిస్మము తండ్రియొక్క వాగ్దానమునుబట్టి జరిగేపనియై యున్నది గనుక ఈ పనికి నీవు అంగీకరించనియెడల (అపో॥ కార్య॥ 1:4), తండ్రిని కూడ అంగీకరించనట్టేకదా! మరొక సంగతి, ఈ బాప్తిస్మములో పరిశుద్ధాత్మ నీలోనికి కుమ్మరింపుగా వచ్చును. ఇది పరిశుద్ధాత్మయొక్క పనికూడ అయి ఉన్నది. అలాగైతే నీవు పరిశుద్ధాత్మనుకూడ అంగీకరించనట్టేగదా! పరిశుద్ధాత్మను అంగీకరిస్తున్నానని చెప్పి, ఆయనయొక్క అన్ని పనులు అంగీకరిస్తున్నానని చెప్పి, కుమ్మరింపు అనే పనిని అంగీకరించకపోతే, పరిశుద్ధాత్మను అంగీకరించడమౌతుందా? ఇన్ని సంగతులు అంగీకరించకపోతే ఎత్తబడడమనేది ఎట్లు జరుగునో ఆలోచించుకొనుము!

**100. ప్రశ్న:-** ఇట్టి మాటలవలన మీరు మనుష్యులను చాలా భయపెట్టుచున్నారు?

జవాబు:- భయపెట్టడం మీకు తప్పుగా కనిపిస్తే, మీరు భయపడడమనేది మాకు తప్పుగా కనిపిస్తున్నది. మంచి వార్తవింటే భయమెందుకు? ఇది నరస్వభావము కాదా! ప్రభువుయొక్క మహిమను చూచి, గొల్లలు భయపడ్డారుగదా (లూకా. 2:9) మహిమ, మేలు చేయునుగాని హాని చేయునా? నేను చెప్పుచున్న ఈ మాటలు నమ్మితే మేలు చేయునుగాని హాని చేయునా? 'భయపడకుడి' అని దూత వారితో అనెను. నేనును ఆ మాట అనుచున్నాను. 'నమ్మని వానికి శిక్ష విధింపబడును' అని ప్రభువు చెప్పెను (మార్కు. 16:16). ఈ మాటలు ఎవరికి భయము? నమ్మనివారికే గదా! నమ్మితే భయమెందుకు? మనస్సు క్రీస్తును నమ్మగలుగును. అపుడు కీడు తొలగును మేలు కలుగును.

**101. ప్రశ్న:-** అంత్యదినమందుగదా ఆత్మకుమ్మరింపు?

జవాబు:- అపో॥కార్య॥ 2:17లో ఉన్నది. అంత్యదినము గాదుగాని **అంత్యదినములు.**

**102. ప్రశ్న:-** అంత్యదినములంటే ఏమిటి? ఇప్పుడే అంత్యదినములలోనికి వచ్చివేసినామా ఏమి?

జవాబు:- ఒక కాలం అయిపోయేటప్పుడుండే రోజులు అంత్యదినములు. పాతనిబంధనకాలము అయిపోయి సంఘకాలం ఆరంభించేటప్పుడు ఉన్న పెంతెకొస్తు కాలము, ఆ కాలముయొక్క అంత్యదినములలోనిదే. అందుకే పరిశుద్ధాత్మ కుమ్మరింపబడుట జరిగినది. (అపో॥కార్య॥ 2:17).

**103. ప్రశ్న:-** అలాగైతే పరిశుద్ధాత్మ బాప్తిస్మము అయిపోయినదిగదా! ఇప్పుడు మరల ఎందుకు?

జవాబు:- అంత్యదినము అని ఉంటే అయిపోయినట్టు. అయితే అక్కడి ప్రవచనములో 'అంత్యదినములు' అని ఉన్నది గనుక ఇంకా మరికొన్ని అంత్య దినములు ఉన్నవని అర్థము. సంఘకాలము అయిపోయి రెండవ రాకడ వచ్చేటప్పుడు ఉండే దినములు మరొక అంత్యదినములు. గనుకనే దేవుడు మన కాలములో కోరేవారికి కుమ్మరింపు అనుగ్రహించుచున్నాడు.

**104. ప్రశ్న:-** ఇప్పుడు అంత్యదినములు వచ్చివేసినవా?

జవాబు:- ఇది ఇందాక వేసిన ప్రశ్నే. అవును. వచ్చివేసినట్టు కుమ్మరింపు వార్తలనుబట్టి తెలుసుకొనగలము.

**105. ప్రశ్న:-** అబ్బో! ఇది మరీ భయంకరమైన మాట. క్రీస్తు రాకడ వచ్చివేస్తే లోకము ఉన్న పరిస్తితులనుబట్టి సిద్ధపడడం ఏలాగు?

జవాబు:- నమ్ముటవల్లనే, ఆత్మ పనిని అంగీకరించుట వల్లనే. ఈ పుస్తకములో ఉన్న ప్రార్థన మెట్లు అనే పాఠము బాగా చదువుకొని, ఆ వరుసను ప్రార్థన పెట్టుకొని, దేవుని అడిగిన యెడల ఆ కుమ్మరింపు కలుగును. రాకడకు సిద్ధపడుటయు గలుగును. పరిశుద్ధాత్మయే మనలను సిద్ధపరచువాడు. ప్రభువు పరలోకమునకు వెళ్ళేటప్పుడు, 'పరిశుద్ధాత్మను పంపిస్తానని' చెప్పెను గదా! ఆ తరువాత ప్రభువు- 'మరలవచ్చి మిమ్ములను తీసికొని వెళ్ళుదును' అనికూడ చెప్పెను (యోహాను. 14:3). ఈలోగా విశ్వాసులను పరలోకమునకు, రెండవ రాకడకు సిద్ధముచేసే పని పరిశుద్ధాత్మ పనియేగదా! ఆయన చేసే పనులు (యోహాను 14:16-26; 16:8-16) లో ఉన్నవని చూపించితిని

గదా! ఇంకా అనేకములున్నవని కూడ చెప్పితిని. పరిశుద్ధాత్మ మన హృదయములో సంచకరువుగ ఉండి మన పక్షముగా పనిచేయుచున్నాడు (2కొరింథి. 1:22) క్రీస్తు ప్రభువు దేవుని సింహాసనము నొద్ద ఉత్తరవాదిగా ఉండి మన పక్షముగా పనిచేయుచున్నాడు (1యోహాను 2:1).

**106. ప్రశ్న:-** నేను స్నానం పొందినప్పుడే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందలేదా?

జవాబు:- లేదు. బాప్తిస్మము ఇవ్వవలసినది అని ప్రభువు చెప్పిన మాటలలో పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి ఏమియు లేదు. నీవు పొందినది త్రియేక దేవునినామమున నీళ్ళతో ఇవ్వబడిన పరిశుద్ధ బాప్తిస్మము. దానికి పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనేపేరు లేదు. అది పాదిరిగారు ఇచ్చే బాప్తిస్మము. ఇది క్రీస్తు ప్రభువిచ్చే బాప్తిస్మము. ఈ రెండును బాప్తిస్మములే గనుక ఈ బేధము తెలుసుకొనేటందుకు దానిని నీళ్ళ బాప్తిస్మమంటూ యున్నాము. దీనిని పరిశుద్ధాత్మ బాప్తిస్మమంటున్నాము. రెండును పొందవలసినదే. నీళ్ళ బాప్తిస్మము, విశ్వాసమూలముగా రక్షణ పొందుచున్నామనుటకు ఇయ్యబడును. పరిశుద్ధాత్మ బాప్తిస్మము, రక్షణ పొందినవారు ఆత్మ జీవనములో వృద్ధి పొందుటకు ఇయ్యబడును. నీటి బాప్తిస్మము ద్వారా సంఘములో ప్రవేశించే సంగతి గలదు. ఆత్మ బాప్తిస్మము ద్వారా సేవచేసి క్రీస్తునుగూర్చి సాక్ష్యమిచ్చే సంగతి గలదు.

**107. ప్రశ్న:-** ఆత్మస్నానము పొందనివారు సాక్ష్యమిచ్చుట లేదా?

జవాబు:- ఇచ్చుచున్నారు. అయితే, ఈ స్నానము పొందినవారు ఇచ్చే సాక్ష్యము మరింత బలముగా ఉంటుంది. అపోస్తలులు ఇచ్చిన సాక్ష్యమువంటి సాక్ష్యము ఇతరులు ఇవ్వలేరుగదా? పెంతెకొస్తుకు ముందు తమ బోధవల్ల వారిచ్చిన సాక్ష్యము గొప్పదే. అయితే, పెంతెకొస్తు తరువాత వారిచ్చిన సాక్ష్యము అంతకంటే గొప్పది.

**108. ప్రశ్న:-** మన సాక్ష్యమునకు వారి సాక్ష్యమునకు భేదమేమి?

జవాబు:- వారు ప్రభువును చూచినట్లు సాక్ష్యమిచ్చిరి (1యోహాను 1:2). మనము అట్టి సాక్ష్యమివ్వలేము.

**109. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారు అట్టి సాక్ష్యమివ్వగలరా?

జవాబు:- సందేహములేకుండా ఇవ్వగలరు.

**110. ప్రశ్న:-** ఎట్లు?

జవాబు:- ఆత్మస్నానము పొందుదురనే ప్రవచనములోనే దర్శనములు కలుగుననే మాటకూడ ఉన్నట్లు చదివినారుగదా! అట్టి దర్శనములో వారు క్రీస్తు ప్రభువును చూస్తున్నారు. గనుక అన్యులు ప్రశ్నించేటప్పుడు చూచినామని చెప్పగలరు. చెప్పు క్రీస్తు చెప్పు మాటలు వింటున్నారు గనుక ఆయన స్వరము విన్నామని సాక్ష్యమియ్యగలరు.సాక్ష్యమిచ్చే శక్తి పరిశుద్ధాత్మ వల్ల కలుగును. అపోస్తలులు అదివరకు సాక్ష్యమిచ్చిరి. గాని పరిశుద్ధాత్మ స్నానము పొందినప్పుడు, వారిచ్చిన సాక్ష్యము మరింత బలముగా ఉండేటందుకు “శక్తి” కలిగినది. (అపో॥కార్య॥ 1:8; 2:4).

**111. ప్రశ్న:-** ఈ రోజులలో పరిశుద్ధాత్మ బాప్తిస్మము వల్ల ఉపయోగమేమి?

జవాబు:- ఆ రోజులలో మొదటి రాకడను గురించి వారు సాక్ష్యమిచ్చిరి. ఈ రోజులలో రెండవ రాకడ సమీపమని మనము సాక్ష్యమిస్తాము. ఆత్మస్నానము పొందనివారు అంత ధైర్యముగా రాకడ సమీపమును గురించి సాక్ష్యమియ్యలేరు. రాకడ దగ్గర బడినదని నమ్మవచ్చును, బోధింపవచ్చును. గాని శక్తితో బోధించలేరు, నిశ్చయము చెప్పలేరు.

**112. ప్రశ్న:-** అలాగైతే మీరనేమాట ఏమిటంటే రెండవ రాకడ సాక్ష్యమివ్వడానికి పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలెను అదేనా?

జవాబు:- అవును అంతా మరల చెప్పుదును వినుము. పరిశుద్ధాత్మ బాప్తిస్మము రెండవరాకడ సంబంధములో ఎందుకుపయోగమో వినుము. 1) రాకడలో ఎత్తబడేటందుకై సిద్ధపడుటకు, 2) ఆత్మస్నానంవల్ల వచ్చిన దర్శనములు మొదలగు ప్రత్యక్షతలవల్ల ప్రభువును చూచిన సంగతిని గురించి సాక్ష్యమిచ్చుటకు, తిన్నగా మధ్యాకాశమునకు 3) తిన్నగా మధ్యాకాశమునకు ఎత్తబడుటకు.

షరా:- తక్కినపనులు అనగా నీళ్ళబాప్తిస్మమును పొందినవారు చేసే పనులు వట్టిపనులే గనుక స్నేహితుడా! పరిశుద్ధాత్మ బాప్తిస్మమునకును రెండవ రాకడకును; గురుతులై పోవుచున్న ఈ కాలములో సర్వవిధముల సంబంధమున్నది. పై రెండును విడదీయ వీలులేదు. మనవారు పరిశుద్ధాత్మ స్నానమును, రెండవరాకడను విరోధించడము మాత్రమేకాక దర్శనములనుకూడ

విరోధించు చున్నారు. ఒక సంగతిని విరోధించడం ఆరంభిస్తే, ఇంకొక సంగతిని విరోధించడంకూడ కలిగి ఉంటున్నారు.

**113. ప్రశ్న:-** 'నీళ్ళ బాప్తిస్మము, నీళ్ళ బాప్తిస్మని' అనుటవల్ల బాప్తిస్మమును తుంచనాడినట్టుగ ఉన్నదిగదా?

జవాబు:- నీళ్ళ బాప్తిస్మము అనక మరి ఏ బాప్తిస్మమని పిలువగలము. అంత మాత్రముననే వట్టి నీళ్ళబాప్తిస్మమని అర్థమియ్యదని అందరకు తెలుసును. అనుదినస్నానము వట్టి నీళ్ళ స్నానమైనట్లు, క్రైస్తవ పరిశుద్ధ బాప్తిస్మము వట్టి నీళ్ళ బాప్తిస్మమని ఎవరు అనుకొంటారు? అక్కరలేదు అంటే తుంచనాడినట్లు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అక్కరలేదని అంటే దానిని తుంచనాడినట్టే. క్రైస్తవ సంఘాధ్యక్షుల స్వాధీనములో ఉండి దొరకే నీళ్ళ బాప్తిస్మమును తుంచనాడితే, అది మా దోషము. క్రీస్తు స్వాధీనములో ఉండి దొరకే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును తుంచనాడుట మీది దోషము. ఏదైనా, మేము తుంచనాడలేదుకదా! నీళ్ళతో ఇచ్చే బాప్తిస్మము గనుక నీళ్ళ బాప్తిస్మమన్నాము. పరిశుద్ధాత్మతో ఇచ్చే బాప్తిస్మము గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మమన్నాము.

**114. ప్రశ్న:-** తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల పేరిట బాప్తిస్మము పొందితిని గదా! అయితే ఇప్పుడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అవసరమా?

జవాబు:- అపో॥కార్య॥ 8:14-16లో క్రీస్తు నామమున బాప్తిస్మము పొందినవారుకూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి.

**115. ప్రశ్న:-** "ఆయన ఈ మాటలు చెప్పి వారిమీద ఊది, పరిశుద్ధాత్మను పొందుడి. మీరు ఎవరి పాపములు

క్షమింతురో, అవి వారికి క్షమింపబడును. ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో అవి నిలిచి యుండునని వారితో చెప్పెను" (యోహాను. 20:22-23). ఈ వాక్యము చూడగా శిష్యులు పరిశుద్ధాత్మను పొందినట్లున్నది. వారికి కూడ పరిశుద్ధాత్మ అవసరమా?

జవాబు:- 1) అవును. వారుకూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. 2) పరిశుద్ధాత్మచేత గర్భము ధరించిన మరియమ్మ కూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందెను. (అపో॥కార్య॥ 2:4)లో అందరను మాట చూడుము. 3) దేవుడు జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మయాయెను (ఆది. 2:7). తండ్రి సృష్టికర్తయని దీనివల్ల కనబడుచున్నది. క్రీస్తు ప్రభువుకూడ శిష్యులకు అట్లే చేసెను. గనుక ఈయన కూడ సృష్టికార్యము చేయు సృష్టికర్తయైయున్నారు. ఊదుట సృష్టిపని; కుమ్మరించుట వేరేపని. ఇవి రెండును రెండు వేరైన పనులుగదా! గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మము ప్రత్యేకముగా అవసరమైయున్నది.

**116. ప్రశ్న:-** ప్రభువు పరలోకమునకు వెళ్ళిన తరువాత శిష్యులు సువార్త పనిమీద ఎక్కడకును వెళ్ళలేదా?

జవాబు:- వెళ్ళలేదు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందువరకు వారు యెరూషలేములోనే యుండవలెనని ప్రభువు చెప్పెను. అటు తరువాత సువార్తపని (అపో॥కార్య॥ 1:8) నిమిత్తము వారు బయలుదేరిరి.

**117. ప్రశ్న:-** నీళ్ళ బాప్తిస్మము పొందకమునుపు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందగలరా?

జవాబు:- పొందగలరని తెలుసుకొనుటకు బైబిలులో ఒక కథ కలదు. కొర్నేలి ఇంటిలో అన్యులు కలరు. పేతురు

వారికి వాక్యము బోధించెను. అప్పుడు వారిలో విశ్వాసము కలిగెను. వెంటనే వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి (అపో॥కార్య॥ 10:44). తర్వాత వారు నీళ్ళ బాప్తిస్మముకూడ పొందిరి (అపో॥కార్య॥ 10:47-48).

**118. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందని బోధకులిచ్చిన బాప్తిస్మములు, బాప్తిస్మములు కావనియు, సంస్కార భోజనాలు సంస్కార భోజనాలు కావనియు కొందరనుచున్నారు. దీనికేమి జవాబు?

జవాబు:- మేమనుట లేదు. ఒక శాఖవారంటున్నారు. ఆత్మస్నానము మాకు కాదని పొందనివారును; ఆత్మస్నాన స్థాపన లేక, పొందియుండని పాతనిబంధన జనమును ఒకే తరగతిలోనికి వస్తారు. పొందని మనవారు ప్రభువు పని బాగా చేయడము లేదా? గొప్ప గొప్ప పనులు చేస్తున్నారుకదా! ఆత్మీయ జీవనాభివృద్ధి పొందుటలో క్రైస్తవులకు ఆదివార ఆరాధనా సమయములందు ఎంతోమేలైన ప్రసంగాలు చేస్తున్నారు. ప్రార్థనలుచేసి తమ కార్యములందు సఫలమగుచున్నారు. ఇంకా అనేకమైన ఉపకార కార్యములు చేస్తున్నారు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందకనే ఇట్టికార్యములు చేయగలుగుచుంటే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందితే మరింత ఎక్కువ చేయగలరు గదా?

**119. ప్రశ్న:-** ఈ పుస్తకము ప్రచురించుటలో మీ ఉద్దేశమేమి?

జవాబు:- మిషనెరీలు, పాదుర్లు, వారి తరుపున యున్నవారు; పత్రికలు ద్వారాను, ప్రసంగ పీఠములమీద చేయు ప్రసంగముల ద్వారాను, మా కూటములను బహిరంగముగా

సబబు లేకుండ దూషించుచున్నారు. అపవిత్రమైన మాటలతో ప్రసంగ పీఠములలో అవమానపరచుచున్నారు. వెలివేస్తామనియు, పనులలో నుండి తీసివేస్తామనియు బెదిరించుచున్నారు. ఈ ప్రకారముగా వారివల్ల మాకు హింసలు కలుగుచున్నవి. పూర్వము రోమను కథోలిక్కులవల్ల లూథరన్‌లకు హతసాక్ష్యము కలిగినది. నేడు లూథరనులవల్ల మాకు హింసలు కలుగుచున్నవి. వీటికైన ఒప్పుకొందముగాని ఈ సత్యమును ప్రచురింపకమానము. ఇది మా వ్రతము. మేము పాపులము, ఉన్నతవిద్య లేనివారము, వృద్ధులకున్న అనుభవము లేనివారము; ధనమైనను, ఆస్తి యైనను లేనివారమనిచెప్పి ఈ పనిచేయుట మానక, చేసేటందుకు తెగించుచున్నాము. ఎందుకంటే ఈ పని జరగడము మమ్మును బట్టి కాదుగాని మమ్మును పిలిచిన ప్రభువునుబట్టి, ఆయన బలము చూచుకొని పని సాగిస్తున్నాము. మమ్మును ఎదిరించుచు, మామీద మోటు ప్రశ్నలు వేసేవారికి సమాధానము చెప్పుటకై ఈ పుస్తకమును వ్రాయుచున్నాము. మేము ప్రార్థనా పూర్వకముగా ప్రభువును అడుగకుండ, ఏ చిన్న పనియు చేయుటలేదు. “ నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి, మీమీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి.” (మత్తయి. 5:11-12). ఇట్టి వాక్యములు జ్ఞాపకము తెచ్చుకొని బలము తెచ్చుకొనుచున్నాము.

మేము చేసే పనికి ఫలితము కలిగినను, కలుగక పోయినను; అనేకమంది ఎదిరించినను, అనేక అడ్డములు

వచ్చినను, హాని కలిగినను, నిందల పాలైనను, ఈ బోధనుగూర్చి మాలో కలిగిన మా అభిప్రాయమును మేము కొట్టివేసికొనము. బోధించకుండ ఉండము. ఎందుకంటే ఇది బైబిలులో ఉన్నది, ఉపయోగకరమైనది, సరియైనది.

**120.** ప్రశ్న:- సంఘ చరిత్రలో అప్పుడప్పుడు కొందరులేచి, కొన్ని బోధలు ప్రవేశపెట్టి, అనేకమందిని శిష్యులుగా చేసికొని, ఒక సంఘముగా ఏర్పడినారుగాని కొన్నాళ్ళకు అవి అంతరించిపోయినవి. మీ కూటములుకూడా అట్టివేగదా!

జవాబు:- బైబిలులో ఉన్న బోధకు మేము వ్యతిరేకముగా ఏమియు బోధించుటలేదు. గనుక 'ఇది అంతరించిపోవునను భయము మాకులేదు'. మేము దురుద్దేశముతోగాని, ఎదిరించే మనస్సుతోగాని, కీర్తికోరే మనస్సుతోగాని, స్వాతిశయముతోగాని, ఎక్కువ తెలిసినవారమనిగాని, **ఒకమిషను స్థాపించవలయునని గాని,** ఈ బోధలు ప్రవేశపెట్టలేదు. నాలుగువందల ఏండ్ల క్రిందట డాక్టర్ మార్టిన్ లూథరు ప్రవేశపెట్టిన బోధలు అంతరించి పోయినవా? మేము బోధించే ఈ బోధలు పరీక్షింపవలయునని ఏ.ఇ.యల్.సి. ప్రతినిధులైన మాలోకొందరు ఏ.ఇ.యల్.సి. ప్రసిడెంటుగారైన డా॥ ఇ. న్యూధార్ఫర్ గారికి గత సంవత్సరము అక్టోబర్‌లో రాజమండ్రిలో జరిగిన సభకు ఒక అర్జీ పెట్టుకొన్నప్పటికిని, 1937 మే నెల వరకు ఏ విధమైన ఎండార్స్‌మెంటు ఇచ్చియుండలేదు. ఈ కారణముచేత ఈ పుస్తకమును ప్రచురించుచున్నాము. మరియు ఇన్విస్టిగేషను కమిటి వారికి అనగా పరిశీలన చేయువారికిది సహాయముగా నుండును.

## న్యూఢార్ఫర్ దొరగారికి వ్రాసిన అర్జీ ఇదే

## *( A copy of the Letter Submitted)*

To
The President of the A.E.L.C. Convention,
RAJAHMUNDRY.

Sir,

We hear that in many places in our Lutheran Field, on the Rajahmundry as well as Guntur syrods, the Baptism with the Holy Spirit and speaking in tongues is being preached about. In the booklet called Sadhvishayamulu (సద్విషయములు) published by Mr. K. Vijayaratnam, Lutheran Mission, Lakshmi varampet, Rajahmundry, it is said that some hundreds of people have received the Baptism with the Holy Spirit.

In our opinion, it is high time that the position taken by these people should be frankly dis-

cussed in as-much as Mr. K. Vijayaratnam is prepared to answer, on the basis of the Scriptures, any question concerning his teaching, this problem may be soon brought before the Ministerium. We are sorry to hear that the proposed ministerium of this evening which had the gift of tongues as one of its topics,, has been postponed to Thursday.

We advice that this whole question be taken up by the Ministerium as early as possible and brought to the generalbody for an open discussion before it disperses.

*Yours obediently,*

1**. N.E. Manoharam**

Rajahmundry **2. N.D. Philipson**

19-10-36. **3. P. John Simon**

**121. ప్రశ్న:-** మీరు పెంతెకొస్తు మిషనులో చేరి పెంతెకొస్తు మిషను స్థాపిస్తారని వింటున్నాము. ఇది నిజమా?

జవాబు:- ఇది ఏ మాత్రమును నిజముకాదుగాని ఒక సంగతి నిజము. పరిశుద్ధాత్మ బాప్తిస్మము అందరు పొందవలెననియు, భాషావరము ఈ కాలములో అనేకమందికి దేవుడు ఇస్తున్నాడనియు, ఔషధములు లేకుండా దేవుడు ఈ కాలములో కూడ రోగులను బాగుచేయుచున్నాడనియు, గురుతులనుబట్టి చూడగా ప్రభువు రాకడ కాలము సమీపముగా యున్నదనియు, వారు బోధించుచున్నారు. మేమును ఇది నమ్ముచున్నాము. ఈ బోధలు మన సంఘస్థులు కూడ నేర్చుకొనవలసినదని మేము కోరుచున్నాము. ఇది నేర్చుకొన్నంత మాత్రమున మనము పెంతెకొస్తు మిషను వారమైపోము. రోమను కథోలిక్కువారు ధరించుకొన్నట్లు మనము సిలువను ధరించుకొన్నంత మాత్రముననను, రోమను కథోలిక్కులవలె సమాధుల దగ్గర ఆరాధన చేసినంత మాత్రమును, మనము రోమను కథోలిక్కులవారము అయిపోలేదు కదా!

**122. ప్రశ్న:-** మీరు మీ అనుభవముమీద ఆనుకొను చున్నారు. దేవుని వాక్యముమీద ఆనుకొనుటలేదు. మీ అనుభవము ఎంత మంచిదైనను, దానిలో తప్పులుండక మానవుగదా?

జవాబు:- పాదుర్లు సంఘములో చేసే ప్రసంగములు, బోధలు వారి అనుభవములతో కూడినవి కావా? కూటములలో మనవారు అనుభవసాక్ష్యమిచ్చుటలేదా? వీధులలోను, దేవాలయములలోను, కూటములలోను చేయు బోధలు

అనుభవముతో కూడినవేగదా? వ్యాఖ్యానముల గ్రంథములనిండ అనుభవములు లేవా? అర్థాలులేవా? ఊహలు లేవా? ఇవన్నియు కొట్టివేయవలసినవేనా? క్రైస్తవ బోధలలోనుండి అనుభవమును తీసిపారవేసిన యెడల, మిగిలిపోయినది దేవుని వాక్యమేగదా! అలాగైతే బోధకులు ప్రసంగపీఠము లెక్కి దేవుని వాక్యమే చదువ వలయునుగాని, ప్రసంగములు ఏమియు చేయకూడదు. వీధులలో బైబిలులోని మాటలే చదువవలయును గాని ఏమియు వివరించకూడదు అని అనగలమా?

**123. ప్రశ్న:-** సంఘములోలేని బోధలు మీరు చేయుచున్నారు గనుక సంఘముమీద మీకు అభిమానము లేదు?

జవాబు:- నిజమే, సంఘములోలేని బోధలు మేము చేయుచున్నాము. గాని బైబిలులో ఉన్న బోధలే ప్రకటించు చున్నాము. అట్టివి మీరు ప్రకటించుటలేదు గనుక మీకు బైబిలుమీద అభిమానము లేదని మేము చెప్పవలసియున్నది. మీరు మమ్మును అనినమీదట మేమును మిమ్మును అనడము సుళువేగదా!

**124. ప్రశ్న:-** ఇదివరకు సంఘములోలేని బోధలు ఇప్పుడెందుకు చేర్చుచున్నారు?

జవాబు:- ఇరువదియైదు యేండ్లక్రిందట లేని కోతపండుగ సంఘములో నేడు ప్రవేశపెట్టలేదా? ఇదివరకు సమాధులలోలేని ఆరాధన, ఇప్పుడు సంఘము ఆచరించుటలేదా? ఇదివరకు లేని నాటకములు సంఘములో ప్రవేశపెట్టలేదా? నాటకములు, బైబిలు సంబంధమైన నాటకములు ఉండకూడదని సినడ్‌లో తీర్మానము చేసిన తర్వాత బైబిలు నాటకములు కట్టలేదా?

(స్త్రీ వేషములతో) రాజమండ్రిలోని సెంట్రల్ బాలికల పాఠశాలవారు ఈ సంవత్సరము మన క్రైస్తవ పిల్లలచేత హరిశ్చంద్ర నాటకము కట్టించలేదా? ఇదివరకు సంఘములో లేనివి, అంగీకారము కానివి, చేయకూడదని అనుకొన్నవి చేయుట, మీకు తప్పులేదుగాని; వాక్యములో బోధనలు మేము చేస్తే మీకు తప్పుగా కనిపిస్తున్నదా?

**125.** ప్రశ్న:- ఎప్పుడులేని పరిశుద్ధాత్మ బాప్తిస్మము తీసికొని వచ్చినారు. మన సంఘ చరిత్రలో పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినట్లుగాని, భాషలు మాట్లాడినట్లుగాని, దర్శనములు చూచినట్లు గాని ఇంకా ఇతరమైన ఆత్మవరములు పొందిన వారున్నారా?

జవాబు:- చాలమందియున్నారు. వారిపేర్లు ఇచ్చుట నుదహరించుటకు వీలులేదుగాని ప్రతిశతాబ్ధములోను, అట్టి అనుభవములు కలిగివారు ఉంటున్నారు. మన శతాబ్దములో చాలమందియున్నారు. రెండవ శతాబ్దములో తెర్తుల్లియన్ అనే ఆయన భాషావరము కొందరికివ్వబడినట్లు వ్రాసియున్నాడు. నాల్గవ శతాబ్దములో కొందరు పరిశుద్ధాత్మనుపొంది భాషలతో మాట్లాడినట్లు పరిశుద్ధుడైన అగస్టిను వ్రాసియున్నాడు. పన్నెండవ శతాబ్దమునుండి పదిహేనవ శతాబ్దము వరకు ఐరోపా దక్షిణ భాగమందు అనేకమంది భాషలతో మాట్లాడిరి. 1552 సంవత్సరములో పరలోకగతులైన పరిశుద్ధుడైన ఫ్రాన్సిసు గ్జేవియరు అనే పరమ భక్తుడు (సర్వప్రపంచ మిషనెరీ) నేర్చుకొనని హిందుదేశములోని భాషలలో ప్రసంగించెను. తనకు తెలియని భాషలలో కూడ మాట్లాడెను. రక్షణసేన స్థాపకుడైన విలియంబూత్

దొరగారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది, కఠినాత్ములనేకమంది మారుటకు కారకుడాయెను. లోక ప్రసిద్ధి కెక్కిన ప్రసంగీకుడు ఈ మధ్యనే పరలోకగతుడైన ఎఫ్. మేయర్ దొరగారు ఇట్లు వ్రాయుచున్నారు. రష్యా ప్రాంతములయందు లూథరన్ మిషను పని చేయుచున్న స్థలములలో, క్రైస్తవులు మందస్థితియందుండగా, దేవుడు బేరన్ ఆక్సువాల్ అనే ఆయనను లేపెను. ఆయన బలముతో సువార్త ప్రకటించెను. అప్పుడు అనేకమంది భాషలతో మాట్లాడిరి. ఒకరు మాట్లాడిన భాషయొక్క అర్ధము ఏమనగా "యేసు త్వరగా వచ్చుచున్నాడు, యేసు సమీపములో ఉన్నాడు, సిద్ధముగా యుండండి. సోమరి తనముగా యుండవద్దు". ఈయన ఆ ప్రాంతములను దర్శించెను.

**126. ప్రశ్న:-** ఈయాత్మ బాప్తిస్మము మానివేస్తే అపకారమేమి?

జవాబు:- ఉపకారములు మానివేయుట అపకారము కాదా? గొప్ప ఉపకారములు పొందవలెనంటే, ఎన్నో అడ్డములు వచ్చును. అయినను మానకూడదు. అన్ని మిషనులలో కొందరు, ఈ నూతనాంశము ఆలోచిస్తున్నారు. కొందరు ఆత్మ బాప్తిస్మము పొందుచున్నారు. మనమెందుకు ఊరకుండవలయును. ఇది బైబిలులో నున్న సంగతి గనుక తత్ విచారణ చేయక తప్పదు. విడిచిపెట్టుటకు వీలులేదు. క్రైస్తవ జీవనముయొక్క అభివృద్ధికి అవసరమైన సంగతి గనుక 'మాకు అక్కరలేదు' అని అనడము బాగుగ యుండదు. వారికి వారికి ఇచ్చుచున్న దేవుడు మనకుకూడ ఇస్తాడు. స్వీడన్ దేశము లూథరన్ మిషను దేశమైయున్నది. ఆ దేశములో ఇప్పుడు ఆరువందల స్థలములలో పరిశుద్ధాత్మ

బాప్తిస్మమునుగురించి యోచించుచున్నారు, పొందుచున్నారు గనుక మనమెందుకు పొందకూడదు!

**127. ప్రశ్న:–** ఇంత గొప్ప రక్షణ సువార్త తెచ్చిన పశ్చిమ దేశీయ మిషనెరీలు దీనిని గురించి ఎందుకు బోధించుట లేదు? ఇది వారికేల బయలుపరచబడలేదు? వారేల దీనిని అంగీకరించుటలేదు?

జవాబు:– అవును, వారు చెప్పవలసినదే. వారు చెప్పడము మానివేసినారు గనుక మేము చెప్పుచున్నాము. అయినను మీరు వారిని అడగడం మంచిది. ఈ బోధలు ఇదివరకున్న బోధలతో చేర్చవలసినదని మేమును వారినడుగుచున్నాము. విశ్వాసులైనను, అవిశ్వాసులైనను, పండితులైనను, పామరులైనను, మిషనెరీలైనను., సామాన్యులైనను, క్రైస్తవులైనను, అన్యులైనను, స్త్రీలైనను, పురుషులైనను, ధనికులైనను, బీదలైనను, అనుభవము లేని పిల్లలైనను, అనుభవముగల పెద్దవారైనను; ఈ అంశమును గురించిన సత్యమును తెలుసుకొనవలెనను అపేక్షతో ప్రార్థించిన యెడల దేవుడు తప్పకుండ ఏదో ఒకవిధముగా బయలుపర్చక మానడు అని మా అనుభవమైయున్నది. ఊరకనే ప్రార్థించుట చాలదు, ప్రభువు తెలియజేసేవరకు ప్రార్థనలో ఉండి కనిపెట్టవలయును. అప్పుడు సత్యము తెలియగలదు. ప్రార్థనలో మాట్లాడువారము మనమైతే కనిపెట్టుటలో మాట్లాడువారు ప్రభువైయున్నారు. ఎప్పుడును మనమే మాట్లాడుచుండి, ఆయనను మాటలాడనియ్యకపోతే సత్యమేలాగు బయలుపడును? సాధుసుందరసింగు సత్యము నిమిత్తమై ప్రార్థింపగా ప్రభువు ప్రత్యక్షము కాలేదా?

**128. ప్రశ్న:-** ఈ ఆత్మ బాప్తిస్మము పూర్వులకేగాని మనకుకాదని కొందరనుచున్నారు. దీనికేమి సమాధానము?

జవాబు:- ఇది మనకు కాదని బైబిలులో ఎక్కడ ఉన్నది?

**129. ప్రశ్న:-** ఆత్మస్నానము పొందుచున్నామని చెప్పుకొనుచున్నవారు, తక్కినవారిని చూచి నీవు పొందితేనేగాని వల్లపడదని చెప్పుచున్నారు. ఇది సరియా?

జవాబు:- దేవుడు ఇవ్వబోయే వరములు సంపాదించుకొనండని ప్రయాసపడి చెప్పితే అది భయపెట్టడమగునా? పొందేవారికి చెడ్డపేర్లు పెట్టి తర్కములోనికి దింపి, దోషారోపణచేసి, పరిహసించి, నిరుత్సాహపరచి, ఇదంతా వట్టిదేనని చెప్పడం భయపెట్టుట అయియున్నది గదా! చెదరగొట్టుట అయియున్నది గదా! పొందే వారిని పొందకుండ చేయుటయు, క్రీస్తుప్రభువు చేరదీసిన గొర్రెలను చెదరగొట్టుట సరికాదు గదా! మేము మా పాపములు దేవునిదగ్గర ఒప్పుకొని, విడిచిపెట్టి, సమర్పణచేసి ఆత్మ కుమ్మరింపుకొరకు ప్రార్ధనచేసి స్తుతించుచూ కనిపెట్టగా, దేవుడు తన ఆత్మను మామీద కుమ్మరించియున్నారు. మీరును ఇట్లు మావలె చేసినయెడల మీకును ఆ కుమ్మరింపు లభించును అని సాక్ష్యమిస్తు, బోధచేయుచూ, హెచ్చరించుచున్నామే గాని బలవంత పెట్టుటలేదు, భయపెట్టుటలేదు

**130. ప్రశ్న:-** పెండ్లికుమార్తె! పెండ్లికుమార్తె! అనుచున్నారు. ఇది బైబిలులో యున్నదా?

జవాబు:- ముంగుర్తులుగా నున్న పాత నిబంధనలో పెండ్లికుమార్తెను గురించియున్న పరమగీతము, ఎస్తేరు గ్రంథము చదవండి. పైకి లౌకికముగా కనిపించుచున్నను అవి ఆత్మ సంగతులతో నిండియున్నవి. క్రొత్త నిబంధనలో ప్రకటన గ్రంథములో దీనిని గురించియున్నది. దేవునికిని, విశ్వాసులకును గల సహవాసము ప్రసిద్ధికెక్కిన విషయమైయున్నది. అది 'పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె' అను పోలికలు కలిగియున్నది. (ప్రకటన. 22:17) చదువండి.

**131. ప్రశ్న:-** మీరు మాతో మాటలాడేటప్పుడు మా కూటస్థులు, మాకూటస్థులు అని అంటున్నారు. మీరు మాలోనుండి వేరైనారా ఏమి?

జవాబు:- మీ కూటస్థులు గంటల కొలది ప్రార్థనలో ఉంటున్నారేమి? అని అడిగినప్పుడు, మీరు మమ్మును 'మీ' అనుట లేదా?

**132. ప్రశ్న:-** మీరు రహస్య కూటములు పెట్టుకొన వచ్చునా?

జవాబు:- కూటములు రహస్య కూటములై యుండుటలో తప్పులేదు. దూషణతోను, అపనిందలతోను, దుర్బోధలతో నిండియుండిన కూటములు బహిరంగ కూటములై యుండుటయు, అట్టి కూటములు పరిశుద్ధ దేవాలయములో జరుపుటయు తప్పు అయియున్నది.

**133. ప్రశ్న:-** నా ప్రశ్నకు ఇటువంటి జవాబు చెప్పినారేమి?

జవాబు:- రహస్యముగా ఉండవలసిన సంగతులు రహస్యముగా యుంచుట తప్పులేదే. రహస్య సంగతులు కొద్దికాలము వరకే రహస్యముగా ఉంచబడును. తరువాత అవి బయలుపర్చవలెను. దానియేలునకు ఒక సంగతి బయలుపర్చబడి నప్పుడు, 'ఈ సంగతులు అంత్యకాలమువరకు మరుగుగా ఉండునట్లు ముద్రించబడినవి గనుక దానియేలూ! నీవు ఊరకుండుము' అని దానియేలుకు సలహా ఈయబడెను. అయితే ఈ సంగతులు కాలము వచ్చినప్పుడు బయలుపడెనుగదా! అవి బయలుపడేవరకు రహస్యముగా ఉంచబడెను. మరియు ప్రభువుకూడ కొన్ని సంగతులు రహస్యముగా ఉంచవలెనని చెప్పెను. "మనుష్యకుమారుడు మృతులలోనుండి లేచువరకు ఈ సంగతులు ఎవరికిని చెప్పకుడి" అని రూపాంతరముపొంది కొండ దిగినప్పుడు, ప్రభువు తన శిష్యులకు చెప్పలేదా! (మత్తయి. 17:9). మేము ఈ సంగతులు పరిశీలన చేసి నేర్చుకొనేవరకు ఎవరికిని ధారాళముగా చెప్పలేదు. గనుక మీలాటివారు రహస్య కూటములనుకొను చున్నారు. అయితే అప్పుడు కూడ ఎవరైనను తెలుసుకొనవలెనని వచ్చిన యెడల చెప్పుచుండెడివారము. కొన్ని సంగతులు మేము నేర్చుకొన్న కొంత కాలమునకు ఎవరైన వస్తే, ముందు మొదటి సంగతులు నేర్పించిన తరువాత తక్కినవి నేర్పించువారము. అందుచేతను అట్టివారు మమ్మును రానివ్వడములేదు అని అల్లరిచేసిరి. అయితే 1934వ సంవత్సరములో పెద్దాపురము గుడిలోను, 1935లో రాజమండ్రి గుడిలోను, 1936లో ధవళేశ్వరము, గుంటూరు దేవాలయములలోను తదితర స్థలములలోను ఈ సంగతులు బాహాటముగా

బోధించినాము. మేము రహస్యముగానేమియు నుంచలేదు. 'సద్విషయములు', 'ద్వితియాగమనము' అను పుస్తకములు మేము ప్రచురించి ఉచితముగా పంచిపెట్టలేదా! మమ్ములను పిలిపించి, అన్ని సంగతులు కనుగొనవలయునని మేము ఏ.ఇ.యల్.సి. వారిని 12-10-1936లో అడుగలేదా! ఇది మీరు అంగీకరించరు. మీరు మా కూటములకు రారు గనుక ఇవి మీకు రహస్యకూటములుగా నుండును.

**134. ప్రశ్న:-** మీ కూటములు గుడిలో ఎందుకు పెట్టకూడదు?

జవాబు:- సంఘమంతటికైతే గుడిలో పెట్టవచ్చునుగాని ఇతర స్థలములలో పెట్టితే తప్పేమి? మిషనెరీలు తమ బంగళాలలో ప్రార్థన కూటములు పెట్టుకొనుటలేదా? పెట్టనిస్తే పెట్టకేమి? అలాగైతే మీకును రావలెనని ఉన్నది గనుక మీరును రండి అందరిని పిలువండి.

**135. ప్రశ్న:-** మీరు చెప్పుచున్న ఆత్మస్నానము మొదలైనవి అవలంభించకపోతే అనేక నిందలు కష్టములు వచ్చుచున్నవి. అవలంభించడము చాలా కష్టమైన సంగతిగా కనబడుచున్నది ఏలాగు మరి?

జవాబు:- బైబిలులోనున్న సంగతులు వదలి పెట్టుటకు వీలులేదు. పశ్చిమ దేశములలోని కొంతమంది బైబిలులోని అద్భుతములు తీసివేయమనుచున్నారు. అలాగే మీరుకూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము లోపించవలయునని అనుచున్నారు. ఇది యే మాత్రము సరికాదు. దేవుని వాక్యము కొంత తగ్గించుటకు

ఎవరికి అధికారమున్నది? క్రీస్తు మతములోనికి వచ్చినయెడల అనేకములైన శ్రమలు వచ్చుచున్నవి. గనుక క్రైస్తవ సంఘములో చేరడము మానివేయవలెనా? అది మానని మీరు ఇది ఎందుకు మానవలయును!

**136. ప్రశ్న:-** ఒకరు మీటింగులో ఉపన్యసించుచుండగా, కూర్చున్నవారిలో ఒకరు ఉపన్యాసకుని ప్రశ్నింపవచ్చునా? ఇది బాగాలేదు గనుక మానివేసి ఇంకొకటి మాటలాడండని అందరిలో అనవచ్చునా?

జవాబు:- బోధ తప్పు అయితే, ఆపుచేయుట తప్పుగాదు. గాని కాగితంమీద వ్రాసిచూపిస్తే బాగా ఉంటుంది. **ఇతర మిషను బోధకుడు మన అనుమతిమీదనే మనమీటింగులో బోధిస్తున్నప్పుడు మన సిద్ధాంతములకు భిన్నమైన సిద్ధాంతము ఉంటే ఆపుచేయుట తప్పుకాదు.** తప్పు బోధిస్తే తప్పుగాదు గాని తప్పును ఆపుచేస్తే తప్పా? మేము బోధిస్తున్న పరిశుద్ధాత్మ బాప్తిస్మ బోధ మీ దృష్టిలో తప్పుగా కనిపిస్తున్నందున మీరందరు ఆపుచేయవలెనని యత్నించుటలేదా?

**137. ప్రశ్న:-** పెంతెకొస్తు కాలములో మీరు పదిరోజులు మీటింగులు పెట్టవలెనని ఎందుకు ప్రచురించినారు?

జవాబు:- ఆది క్రైస్తవ సంఘములో శిష్యులు పెట్టిరిగదా! మనము పెట్టితే ఏమి తప్పు? శ్రమ కాలములో 40 రోజులు ఆరాధన పెట్టుకొన్నాము గదా! క్రిస్మసు, ఈస్టరు పండుగలు మహోత్సవములుగా ఆచరిస్తున్నాముగదా! అడ్వెంటుకాలమందొక వారము ప్రభువు రాకడ స్మరణార్థమైన ఆరాధనలు పెట్టుకుంటే మంచిది.

**138. ప్రశ్న:-** పరిశుద్ధాత్మ కుమ్మరింపులు మూడు ముఖ్యకాలములలో జరుగునని చెప్పుచున్నారు. అవి ఏవి?

జవాబు:- 1) పెంతెకొస్తుకాల పరిశుద్ధాత్మ బాప్తిస్మము: క్రీస్తుయొక్క జీవితచరిత్రను గురించి, ముఖ్యముగా సిలువను గురించియు, పునరుత్థానమును గురించియు చూచిన సాక్ష్యము సర్వజనులకు వినిపించుటకై శిష్యులకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనుగ్రహింపబడెను. అప్పుడు వారికి భాషావరమును, ప్రసంగింపగల శక్తియును గలిగెను. 2) నేటికాల పరిశుద్ధాత్మ బాప్తిస్మము : ఇది ప్రభువు రెండవరాకడ సమీపకాలము. క్రీస్తు రెండవ రాకడకు సంఘము ఎత్తబడవలసిన సమయము సమీపించునప్పుడు, విశ్వాసులకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము కలుగును. ఇది మనకాలము. సర్వలోకములోనున్న కొందరికి ఆత్మకుమ్మరింపు కలుగుచున్నదని వార్తాపత్రికలవల్ల తెలియు చున్నది. క్రీస్తుయొక్క మొదటిరాకను గురించి ఆదిశిష్యులు సాక్ష్యమిచ్చుట ఎంత అవసరమో, 'రెండవరాకడ సమీపించుచున్నది గనుక సిద్ధపడండి' అని సువార్తతో కలిపి ప్రకటించుట నేడు అంత అవసరము. అందుచేత ఆ ప్రథమ క్రైస్తవులకు కుమ్మరింపు గలిగినట్లు నవీన క్రైస్తవులకుకూడ కుమ్మరింపు కలుగుచున్నది. అట్టివారికి దర్శనములందు క్రీస్తుప్రభువును, ఆయన రెండవ రాకడయును కనబడుచున్నందున; వీరుకూడ వారివలె చూచిన సాక్ష్యము వినిపించగలరు. రెండవ రాకడ సమీపించుచున్నందున, ఇష్టమున్నవారు సిద్ధపడేటందుకు ఇదే మంచి సమయమని తెలిసికొనుటకై, ఈ నవీన కాల పరిశుద్ధాత్మ బాప్తిస్మ నవీన కాలమొక వీలైన తరుణముగా అమరియున్నది. సువార్త ప్రకటనలో

క్రీస్తుయొక్క జన్మము, బోధ, అద్భుతములు, సిలువ, పునరుత్థానము, ఆరోహణము ఇమిడ్చి రెండవరాకడ వాక్యపాఠములుకూడ చేర్చి; తుదకు రెండవరాకడ సామీప్యతను గుర్తించిన బోధ లోపించినయెడల అది గొప్ప లోపముగా నుండక మానదు. ఎత్తబడగోరేవారు ఈ సమయమును పోగొట్టుకొనకూడదు. 3) వెయ్యేండ్ల పరిపాలన కాల పరిశుద్ధాత్మ బాప్తిస్మము: రెండవ రాకడ సమీపమని నమ్మి, పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది, ఎత్తబడుటకు ఆత్మవల్ల సిద్ధపడి, సంఘము ఎత్తబడిన తర్వాత భూమిమీద మిగిలిపోయినవారికి లోకమది వరకెరుగని శ్రమలు వచ్చును (ప్రకటన. 6-19అధ్యా॥లు). ఆ తర్వాత వెయ్యేండ్ల ఏలుబడి. ఇది క్రీస్తు పరిపాలన (ప్రకటన 20-21, అధ్యా॥లు) ఆ సమయమందు మిక్కిలి కఠిన హృదయులుందురు. అప్పుడు ఆత్మకుమ్మరింపు కలుగును (జెకర్యా. 12 అధ్యా॥).

షరా:- ముమ్మారు జరుగు ఈ కుమ్మరింపులు, ఒక విధముగా సార్వత్రిక సంఘమునకుద్దేశింపబడిన పరిశుద్ధాత్మ బాప్తిస్మములై యున్నవి. అయినను మధ్యమధ్యను ఒక్కరికి ఇద్దరికి, కొద్దిమందికి కూడ కలుగవచ్చును. ఆ మనుష్యులను, ఆ కాలములను, తాత్కాలిక సువార్త పని అవసరమును, దేవుడెరుగును. పెంతెకొస్తునాడు ఒక్క యూదులకే కుమ్మరింపు కలిగెను. వారు మొదటి క్రైస్తవ సంఘస్థులు. మన కాలములో ఎవరికిపడితే వారికే కుమ్మరింపు కలుగును. వాక్యము విని, నమ్మి, ప్రార్థించితే, చాలును. కొందరికి నీళ్ళ బాప్తిస్మము పొందకముందే కలుగును (అనగా అన్యులకే కలుగును) (కార్య. 10:44-46).

ప్రభువుయొక్క వెయ్యేండ్ల ఏలుబడిలో లోకమునకు చివరిసారి సమయము ఇయ్యబడును. పై చరిత్రద్వారా మూడు సంగతులు గుర్తించుచున్నాము. పెంతెకొస్తునాడు 'నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరింతును' అని వాగ్దానము చేసిన తండ్రి జ్ఞాపకము వస్తున్నాడు. 'ప్రభువైన యేసూ రమ్మని' ప్రార్థించుచున్న నేటి విశ్వాసుల సంఘము సిద్ధమగు నిమిత్తము ఆత్మ కుమ్మరింపు గలిగించుచున్న, త్వరగా రానైయున్న క్రీస్తు ప్రభువు జ్ఞాపకము వస్తున్నారు. సహస్ర వర్షకాలమున విజ్ఞాపనచేయు ఆత్మ కుమ్మరింపబడునని జెకర్యా. 12వ అధ్యాయములోని వ్రాతను చూడగా పరిశుద్ధాత్మ తండ్రి జ్ఞాపకము వస్తున్నారు.

**139. ప్రశ్న:-** మన లూథరన్ మిషను కీర్తన పుస్తకములో కూడ పరిశుద్ధాత్మను గురించి ప్రార్థనలు ఉన్నవిగదా?

జవాబు:- అవును, ఉన్నవి పూర్తి ఆరాధన క్రమము గల పెద్ద పుస్తకములో ఐదు ప్రార్థనలు పరిశుద్ధాత్మ తండ్రిని గురించి వ్రాయబడినవి. అందులో **మూడవది : ఓ ప్రభువైన దేవా! పరలోకపు తండ్రీ!** మమ్మును వెలిగించి, సర్వసత్యములోనికి నడిపించి దుర్దశలన్నిటి నుండి కాపాడునట్లు నీ పరిశుద్ధాత్మను మాలో నివసింపజేయుమని నీ కుమారుడును, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము. ఆమేన్ **ఐదవది:** సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! నీ కుమారుడైన యేసుక్రీస్తునుబట్టి మమ్మును కనికరించి, మాకు పాపక్షమాపణయు, జీవమును, దైవభక్తికిని అవసరములైనవన్నియును అనుగ్రహించియున్నావు. మేము తండ్రిభావముగల నీ కృపను ఎల్లప్పుడు మనస్సునందుంచుకొని మా శరీరేచ్ఛలను చంపి, లోకమును

జయించునట్లును, నిర్మలమైన పరిశుద్ధ జీవనముతో నిన్ను సేవించుచు, నీకృప అంతటి నిమిత్తము ఎల్లప్పుడు నీకు స్తుతులను చెల్లించునట్లును, మమ్మును నడిపించుటకై నీ పరిశుద్ధాత్మను పంపుమని ఆ నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొంటున్నాము. ఆమేన్. ఈ విధముగా మన లూథరను వారంతా ప్రార్ధనలు చేయుదురు. దేవుడు మన ప్రార్ధనలు విని తీరా పరిశుద్ధాత్మను కుమ్మరిస్తే, అది దయ్యమని మనవారు త్రోసివేయుచున్నారు. ఉదాహరణ:- యూదులు మెస్సియాను రమ్మని నాలుగువేల సంవత్సరములు ప్రార్ధించిరి. తీరా మెస్సియా క్రీస్తువారుగా వస్తే, నీవు కాదని సిలువవేసిరి. మనవారును ప్రస్తుతము యూదులవలెనె చేస్తున్నారు. ఇదెందుకో తెలియదు!

**140.** ప్రశ్న:- ఆత్మస్నానము నిమిత్తమొక్కరీతిగా ప్రార్ధించుచు, నిద్ర, విశ్రాంతి లేకుండ ఉపవాసములో ఉండి కనిపెట్టుచుండుటవల్ల కొందరికి మతిచాంచల్యము కలుగుచున్నదనియు, అపవిత్రాత్మ పీడితులగుచున్నారనియు, వదంతి యొకటి గలదు. మీరేమందురు?

జవాబు:- నేను అనవలసినదేమున్నది? సంగతిని సంగతిగానే మాటలాడుకొందుముగదా! ***ప్రార్ధించువారు శరీరమునకు, మనస్సునకు హాని కలుగకుండ ప్రార్ధించుట అలవాటు చేసికొనవలెను.*** మరియు కుమ్మరింపు త్వరగా కలుగని యెడల నిరాశపడుచు, దిగులుపడుచు, విసుగుకొనుచు, దేవునితో లేనిపోని వాదములు పెట్టుకొనుచు, ఇట్టి తగని చేష్టలుచేసిన యెడల హాని కలుగదా! దురాత్మ పని జరుగదా! అప్పుడు పరిశుద్ధాత్మ కూటములవల్ల ఈస్థితి లభించినదని దోషారోపణ చేయుట న్యాయముగాదు.

**141. ప్రశ్న:-** మరి ఎట్లు ప్రార్థన చేయమంటారు?

జవాబు:- **పాపము లొప్పుకొన్న తర్వాత, పూర్ణ సమర్పణయైన పిమ్మట, దైవ సన్నిధానమున మిగుల నెమ్మదిగా కూర్చుండి, సంతోషముతో ప్రార్థించుచు, విశ్వాసమును వృద్ధి చేసికొనుచు, ఓపికతో కనిపెట్టినయెడల ఆత్మస్నానము దొరకక మానదు.** దైవాత్మ కొరకు వెళ్ళేవారు, దురాత్మ పుట్టించే తలంపులకు ఎందుకు సందియ్యవలెను? ఎంత సంతోషిస్తే అంత త్వరగా కుమ్మరింపువచ్చును. *'ఇంకారాలేదు' అను తలంపుతో తలనొప్పి తెచ్చుకొనవద్దు. ప్రార్థనలో పడి, గృహ కృత్యముల యెడల అశ్రద్ధ గలిగియుండవద్దు.*

**142. ప్రశ్న:-** ప్రవర్తన బాగా ఉంటే చాలదా? ఈ ప్రార్థనలన్నీ ఎందుకు?

జవాబు:- ఇవి లేకపోతే, సత్ప్రవర్తన ఎట్లు రాగలదు?

**143. ప్రశ్న:-** 'రోగులు బాగుపడుచున్నారు' అనే ఇట్టి మాటలు ప్రచురించడమువల్ల తమనుగురించి గొప్పగా చెప్పుకోవడముగాదా? ఇది సరియా?

జవాబు:- మిషనెరీలు, మిషను పనివారు తాము చేసే పనుల రిపోర్టును పుస్తకములలోను, పత్రికలలోను ప్రచురించడం లేదా? అపోస్తలుల కార్యముల గ్రంథము మిషను రిపోర్టు పుస్తకమని మీకెప్పుడును తోచలేదా?

**144. ప్రశ్న:-** కొందరు గొప్ప ప్రేరేపణ కలిగి కలిగి చప్పున చల్లారి పోవుచున్నారు. ఎందుచేత?

జవాబు:- 1) **కోరుకొనే వరముమీద మాత్రమే దృష్టి నిల్పి, ప్రభువుయొక్క సహవాసముమీద దృష్టి తగ్గించుకొనుచున్నందున,** 2) వరములురాగానే (భాష రాగానే), గర్వించుచున్నందున, 3) రాని వారిని నిర్లక్ష్యముగా చూచుచున్నందున, 4) వచ్చిన మంచిస్థితిని వరములను సరిగా వాడనందున 5) వరములను వాడుట మానివేయుచున్నందున.

**145. ప్రశ్న:-** ఆక్సుఫోర్డ్‌గ్రూప్ (Oxford Group) అనగా బాహాటంగా పాపాలొప్పుకొనే మీటింగులు వాక్యానుసారముగా లేవని వాదించిన మిషనెరీలు వాటిని ఆపుచేయనేలేదు, మరి మీ మీటింగులు వారు ఎందుకు ఆపుచేస్తారు?

జవాబు:- అవి మిషనెరీలే ఆరంభించిరి. ఇవి మనవారు ఆరంభించిరి.

**146. ప్రశ్న:-** మీ కూటములు ఎట్లు ఏర్పడెనో వ్రాసిరి కారణమేమి?

జవాబు:- ఈ సమాజమును చూచి అనేకులు ఇదేమిటని అడుగుచున్నారు. ఇది పెంతెకొస్తునాడు ప్రేక్షకులు అడిగినట్లున్నది. ఈ బోధలు బైబిలులోనివే అని కొందరును; బైబిలులోనివైతే మాత్రం అవి పూర్వకాలమునకేనని మరి కొందరును; బైబిలులో ఉన్నను లేకపోయినను అవి మిషనెరీలు అభ్యసించినవి కావని ఇంకొందరును; ఇవి బాగానే ఉన్నవని కొందరును; ఇవి అబద్ధ ప్రవక్త బోధలు అని కొందరును; ఇవి ఏమిటో కడవరకు చూస్తేనేగాని ఏమియు చెప్పలేమని కొందరును; ఇవి పరీక్షింపవలసినవే అని కొందరును; అవలంభించవలసినవే అని

కొందరును చెప్పుకొను చున్నారు. మొత్తముమీద మిషనంతటిలో కొంత ఆందోళనము కలిగినది. అందుచేత దీని ప్రారంభ చరిత్ర కొద్దిగ వ్రాయవలసి వచ్చింది.

**147. ప్రశ్న:-** ఈ బోధలు బైబిలులో యున్నమాట నిజమేగాని మనవారు ఇదివరకు అవలంభించలేదు. ఇప్పుడు విన్నందువల్లే కలహములు లేచునేమో, భేదాభేదములైన వివాదములు లేచునేమో గనుక మిషనెరీలు ఇవి బోధించడము మానివేసినట్లు, మనము కూడ మానివేస్తే మంచిది కాదా?

జవాబు:- బైబిలులో లేనిది, ఉపకారము కానిది బోధిస్తే మానివేయవలెను. గాని ఇది ఎందుకు మానవలయును? ఉపకారములు మానివేయవలయునని మాకు సలహా ఇవ్వడము ఏమాత్రము సబబుగలేదు. సువార్త ప్రకటించేటప్పుడు ఆటంకములు, వివాదములు, మనస్పర్ధలు, కలహములు రావడము లేదా! వచ్చినంత మాత్రమున సువార్త పని మానవలయునా? ఈ విషయముకూడ అట్టిదే. రక్షణ పొందినవారియొక్క ఆత్మ జీవనాభివృద్ధి నిమిత్తమైయున్న ఈ విషయములు గొప్ప ఉపకార విషయములు కావా! మేము మిషనులో పుట్టి, మిషనువల్లనే పోషణ పొంది, విద్యాభ్యాసము, ఉద్యోగము కలిగినవారమై ఉన్నందులకు కృతజ్ఞతగా ఈ ఉపకార విషయములు బోధించుచుండగా వీటిని బోధించకూడదని సలహా ఇచ్చుట బాగుగాయున్నదా? మేము పొందుచున్న ఈ బోధన మేళ్ళు మన మిషనువారందరును పొందవలెనని మేము కోరుట న్యాయముకాదా? ఒక్కసారి ఈ బోధలు మేము ఎవరికి బోధిస్తామో, వారికి తిరిగి మాటిమాటికి బోధించడము

అవసరములేదని మాకు తోచుచున్నది. ఇవి నమ్మేవారు అవలంభిస్తారు. నమ్మనివారికి మేము నచ్చజెప్పగలమా? వారు ఈ మేళ్ళు పొందకపోతే తప్పువారిదే కాని మాదికాదు. మావంతు మేము నెరవేర్చినాము. వెల్లడి చేయవలసినదని దేవుడు మా యాత్మలకు తెలియపరచిన ఈ సద్విషయములు మేము దాచ తలంచుకొనలేదు.కాగితముమీద ఎక్కువ వివరించలేకపోవు చున్నాము. ఎవరైనను దగ్గరకు వచ్చి, నేర్చుకొనవలెనను ఉద్దేశముతో అడిగితే మరింత వివరముగా చెప్పగలము. ప్రస్తుతము కొంతపని జరుగు నిమిత్తము ఈ పుస్తకములో అన్ని సంగతులు కలిపి వ్రాయడమైనది. ప్రభువు సెలవైనప్పుడు ఒక్కొక్క సిద్ధాంతము ఒక్కొక్క చిన్న పుస్తకముగా వ్రాయుటకు సిద్ధముగాయున్నాము.

**148. ప్రశ్న:-** మీ కూటస్థులు గంటల కొలది ప్రార్ధనలో గడుపుచున్నారు. ఇదేమియు బాగుగలేదు. ఆ సమయమె సువార్త ప్రకటనలో గడిపితే ఎంతోమంది అన్యులు ప్రభువుగూర్చి తెలిసికొందురు కదా?

జవాబు:- ఇదొక నేరమా మామీద! మా కూటస్థులు సంఘస్తులతో కలిసి సువార్త పనికి వెళ్ళడము లేదా? ఒక నెలలో మీరు ఎంతమంది అన్యులకు సువార్త ప్రకటించుచున్నారో పరీక్షించుకొనండి. మీరు ప్రకటిస్తున్న ప్రజలు సంఖ్యయును, కూటములో ఒకరు ప్రకటిస్తున్న ప్రజలు సంఖ్యను సరిపోల్చి చూచిన తర్వాత ఆ ప్రశ్నవేస్తే బాగా ఉంటుంది. మరియు గంటసేపు దైవసన్నిధిలో గడుపుటయందు మీరు కనిపెట్టిన యెడల దోషమేమి? వృధాగా సన్నిధిలో నుండడము కాదది. సన్నిధిలో

ప్రార్థించుట, స్తుతించుట కనిపెట్టుట అనునవి యుండును గనుక మా కూటస్థులు సమయము సరిగానె వాడుకొంటున్నారు. గనుక మీరుకూడ ఆలాగే చేయవలెననునది నా సలహాయైయున్నది. ఎవరైన యొకమంచిపని చెడగొట్టి మరియొక మంచిపని చేయుటబూనుట తగని కార్యమే గాని, రెండు మంచికార్యములు చక్కబెట్టుకొనుట తగని కార్యములు కావు గదా!

**149. ప్రశ్న:–** మీ కూటస్తులలో లోపములున్నప్పుడును, నేర్చుకొన్నవి, పొందినవి సరిగా వాడుకొనుటలేదని తెలిసియు నాయకులు గద్దించుటలేదని, దిద్దుబాటు చేయుటలేదని వింటున్నాము. ఇది నిజమా?

జవాబు:– మా మీదికివచ్చే నిందలలో ఇదొక నింద కూటస్థులలో లోపములున్నపుడు నాయకులూరుకొందురా! బడిపిల్లలలో లోపములున్నప్పుడు, పంతుళ్ళును, సంఘస్థులలో నేరములున్నపుడు పాదుర్లును ఊరుకొందురా?

**150. ప్రశ్న–** మీరడగిన ప్రశ్నలన్నిటికిని మేము జవాబు లిచ్చితిమి. చివరగా మీ అభిప్రాయమేమి?

జవాబు:– మీ జవాబులన్ని వినగా, నాకు చాల గందర గోళముగ నున్నది గనుక ఏమియు చెప్పలేను. నాకు మాత్రము ఇవి నిజమని పూర్తిగా తట్టడములేదు. ఇది అవసరమైనదైతే మిషనెరీలు బోధించియుండరా? అనే ప్రశ్న నాలో నున్నది. అందుచేతనే నేనేమియు తీర్మానము చేయలేను. అయినప్పటికిని ఆలోచిస్తాను.

## ముగింపు

పరిశుద్ధాత్మ బాప్తిస్మము గురించి మాకు జ్ఞాపకము వచ్చినన్ని సంగతులు బాహాటముగా చెప్పనూ చెప్పినాము. ఇదివరకు పుస్తకములలోను, ఇంటిలోను వ్రాయనూ వ్రాసినాము. మా పూచీ అయిపోయింది. తర్వాత మీ ఇష్టము ఇంకను మిగిలియున్నది మీ పూచీయేగదా!

## సత్య ప్రత్యక్షత కొరకైన ప్రార్థన

దేవా! పరిశుద్ధాత్మ బాపిస్మమును గురించి ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా చెప్పుచున్నారు. సత్యమేదో అదే నా మనస్సునకు తెలియపరచి ఆ సత్యమును అవలంభించుటకు నాకు శక్తి దయచేయుమని నీ కుమారుని ద్వారా వేడుకొనుచున్నాను. ఆమేన్.

ఈ బోధ విషయములో అనుమానముగలవారు పై ప్రార్థన చేసిన యెడల ప్రభువు వారికి పరిపూర్ణ సత్యము తప్పక బయలుపరచును.

## మిషనువారికి సలహాలు

1. పరిశుద్ధాత్మ బాప్తిస్మము:- ఇది అందరకు అని అపో॥ కార్య॥ 2:39వ వచనములో నున్నది.

2. నీళ్ళ బాప్తిస్మములో తండ్రి, కుమారులతోపాటు పరిశుద్ధాత్మను కలిగియుండుట వేరు. తదనంతరము పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుటవేరు.

3. పరలోక భాషలు మాట్లాడుట అనువరము: దీనిని గూర్చి విపులముగా 1కొరింథి. 14వ అధ్యాయములో నున్నది.

4. భూలోక భాషావరము (భూలోక భాషావరము దేవుడు ఇయ్యగలడు. అపో॥కార్య॥ 2వ అధ్యాయము).

5. దర్శనవరము:– పరిశుద్ధాత్మ బాప్తిస్మము గూర్చి యోవేలు 2:28లో నున్న వాక్యములలో దర్శనములను గూర్చి యున్నది. దేవుడు పూర్వకాలమునందు భక్తులకు దర్శనమిచ్చి, స్వరముతో మాట్లాడి వ్రాసి చూపించెను. స్వప్నములో కనబడి మాటలాడెను.

6. దయ్యములను వెళ్ళగొట్టుట :

7. రోగులను బాగుచేయుట : ఔషదములులేకుండగనే యేసు నామమున ప్రార్థించి రోగులను బాగుచేయుట.

8. క్రీస్తుయొక్క రాకడ మిక్కిలి సమీపములో ఉన్నదని గురుతులవల్ల తెలియుచున్నదని గుర్తించుట.

9. ప్రకటన గ్రంథము, పరమగీతము, ఎస్తేరుగ్రంథములను ప్రభువు రాకడ సంబంధముగా వివరించుట.

షరా:– **ఏ వరమైనను, మనుష్యులయొక్క అవసరమును బట్టియు, మనుష్యులయొక్క హృదయస్థితినిబట్టియు అనుగ్రహింప బడును.**

## మా కోరిక

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను త్రియేక దేవుడగు ఏ తండ్రి ఈ సంగతులు మాకు బయలుపరచెనో, ఆ త్రియేకుడగు తండ్రియే తక్కినవారికికూడ వీటిని బయలుపరచవలెననే పూర్ణ వాంఛ మేము గలిగినవారమై, ఆయనయొక్క త్రిగుణాశీర్వాదములతో దీనిని సిద్ధపరచి మీమీయొద్దకు సాగనంపుచున్నాము. ప్రత్యక్షకరుడైన ఆ అనాది దేవుడు ఈ పుస్తకమును విశ్వాసులకు

విప్పి చూపించుచు; వారి హృదయములనుకూడ ఈ సంగతులు అందుకొనేటట్లు విప్పుచు; రక్షణను గురించి తెలియనివారికి ఇది రక్షణను, రక్షణపొందిన వారికిది పరిశుద్ధాత్మయొక్క కుమ్మరింపు మూలముగా రావలసిన అభివృద్ధి స్థితిని కనపరచుటలో గొప్ప సాధనముగా ఉపయోగపర్చును గాక! మా మనసులలోని ఉద్దేశము మంచిదైనను, వ్రాతలో పొరబాటులుయున్నయెడల చదువరులు మన్నింతురుగాక! ఈ పుస్తకములోని సంగతులు ఆలోచించుమండని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాము.

## ప్రాధేయత

1. సంఘాధ్యక్షులారా! అధికారులారా! కాపరులారా! పెద్దలారా! సంఘస్తులందరు మీ స్వాధీనములోనున్నారు. వారికి కొత్త సంగతులు చెప్పగల తరుణము వారమునకొకమారైన మీకు దొరుకును. గనుక మీ అధికారస్థితిని సద్వినియోగపరచుకొనుచు ఈ పుస్తక వార్త అందించుడనియు; మన అధికారియగు పరిశుద్ధాత్మకు వశమై, ఆయనవల్ల సత్యమును ప్రత్యేకమైన రీతిగా నేర్చుకొని అధికారముగల వానివలె బోధించి, ప్రజలలో ఆశ్చర్యము గలిగించిన యేసుక్రీస్తు ప్రభువువలె బోధించుడనియు; మత్తయి. 7:29; లూకా. 4:32లోని వాక్యములను బట్టి మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను.

2. స్నేహితులారా! మీరు ఏదోయొక మంచి విషయములో నాకు స్నేహితులైయున్న ప్రకారము ఈ విషయములో కూడ స్నేహితులై, నేను నేర్చుకొన్నట్లు మీరును నేర్చుకొనుడనియు, మీరు నా స్నేహితులని యేసుప్రభువు ఎవరిని

గురించి చెప్పెనో (యోహాను. 15:4-5), ఆ ఆదిశిష్యులు ఆత్మనొందిన పిమ్మట మరింత గొప్ప స్నేహితులుగా మారినట్లు మీరును మరింత గొప్ప స్నేహితులుగా మారునట్లు; నేర్చుకొని అవలంభించుడనియు; మన స్నేహితులందరికి ఈ ఆత్మ వార్తను సంభాషణ రూపముగా స్నేహ భావముతో చెప్పుడనియు మిమ్మును స్నేహమునుబట్టి ప్రార్థించుచున్నాను (యోహాను. 15:14-15).

3. స్వజనులారా! వంశము ననుసరించి మీరు నాకు స్వజనులైయున్న ప్రకారము విశ్వాసవారసత్వము కలిగిన సంఘము ననుసరించి కూడ మీరు నాకు స్వజనులుగా మారునట్లు, ఇది నేర్చుకొని మన వారికి ప్రకటించుడని స్వతంత్రమునుబట్టి మిమ్మును వేడుకొను చున్నాను.

చదువరులారా! మీరీపుస్తకమును పూర్తిగా చదివే చదువరులైయుండి, బైబిలులో మనవారు విడిచిపెట్టిన ఆత్మ స్నానమును గురించికూడ చదివే చదువరులై యుండుడనియు; అన్ని గ్రంథములు చదివి బైబిలు చదువనివారును, ఈ అంశము చదువనివారును పూర్ణచదువరులుకారు గనుక, చదువరులైన మీరు అట్టివారై యుండక, పూర్ణచదువరులై యుండుడనియు; మీరు చదివినవి చదువుకొనేవారందరిచేత చదివించుడనియు; మీరును, వారును చదివినవి అనుభవించుడనియు మీకు వ్రాతమూలముగా విన్నవించుకొనుచున్నాను.

5. ఈ బోధ ఇష్టములేనివారలారా! మిమ్ము అందరికంటె ఎక్కువగా బ్రతిమాలుకొనుచున్నాను.

*"వినదగు నెవ్వరు చెప్పిన*
*వినినంతనె వేగపడక వివరింపదగున్*
*కనికల్ల నిజము తెలిసిన*
*మనుజుడెపోనీతిపరుడు మహిలో సుమతీ!"*

ఇది చదవడం మీకిష్టము లేకపోయినను, అవలంభించడం అసలే ఇష్టము లేకపోయినను, సంగతి తెలుసుకొనేటందుకైనను చదువండి. ఇదివరకే ఈ సంగతి విన్నాము అని అంటారేమో! సరే, అలాగైతే ఈ అంశమును గురించి ఎట్లు వ్రాసితినో అది మీకు క్రొత్తదో, కాదో గుర్తు పట్టుకొంటూ చదువండని నా మనవి. నా మనవి కొట్టివేయకండి. మా పత్రికలిదివరకు నేలను పారవేసినవారు, చింపివేసినవారు లేకపోలేదు. తెలియక వారట్లుచేసిరి. దేవుడు వారిని క్షమించుగాక. కోపతాపములకును, ద్వేషభాషలకును, ఖండన స్వభావములకును చోటియ్యని శాంతి మనస్సును త్రిత్వ తండ్రి మనయందరకును అనుగ్రహించునుగాక! నాకు తప్పులుగా తోడని తప్పులిందులో ఉంటే క్షమించుమని నేను ప్రభువును ప్రార్థించితిని. సమస్తమును ఆయనే దిద్దుబాటు చేయునుగాక! ఆయనకే మహిమ. ఆమేన్.

**ధవళేశ్వరము,**
**తూర్పుగోదావరిజిల్లా.**

**ఇట్లు విధేయ సహోదరుడు**
**N.D. ఫిలిప్‌సన్**

# సమయోచిత వాణి

క. “ పరమాత్మ భావతత్త్వము
లెరిగింపను హృదయశుద్ధి నెరిగింపను సు
స్థిరతర శాంతి నొసంగను
పరిశుద్ధాత్మను నుతించి ప్రార్థనజేతున్”

“నాయొద్దనుండుట–కై యాత్మపంపిన
తండ్రి!–ప్రసిద్ధమౌ – స్తవమునీకు
నాతో వసింపను – దాతనుబంపిన
తండ్రీ! వినోదమౌ – స్తవమునీకు
నాలోన నీయాత్మ – వాలంగ బంపిన
తండ్రీ! విశుద్ధమౌ – స్తవమునీకు
నాయాదరణమున – కై యాత్మనంపిన
తండ్రీ! ప్రకాశమౌ– స్తవమునీకు

సర్వసత్యమునకు నడ్పి – సంగతులను
సృష్టపర్చి వివిధములౌ – వరములిచ్చి
ఆత్మవర్తనకై యాత్మ – పంపినావు
తండ్రీ! సర్వదా సర్వత్ర – స్తవమునీకు”

ప్రస్తుతకాలములో అనేకమంది క్రైస్తవులు త్రిత్వములోని తండ్రియైన దేవుడు సృష్టికర్తయనియు, ఆయన పరభూలోకములను సృజించెననియు; కుమారుడైన యేసుప్రభువు పాపులకొరకు సిలువ మరణ, పునరుత్థానము పొందవలెననియు, ఆయనే సర్వలోక రక్షకుడనియు కొద్దియో, గొప్పయో చెప్పగలరు గాని ఆదరణ

కర్తయైన పరిశుద్ధాత్మ తండ్రిని గురించి అపోస్తలుల కార్యములు 19:2లో చెప్పబడినట్లు, పరిశుద్ధాత్మ యున్నాడన్న సంగతియె తెలియదు అని చెప్పినవారివలె ఉన్నారు గనుక ఆయనను గురించి పూర్తిగా చెప్పలేరు. ఇట్టి అంశమును మన ఆంధ్ర క్రైస్తవులకొరకు సంక్షిప్తముగ వ్రాయుట అగత్యమని మాకు తోచుటవల్ల ఈ గ్రంథము వ్రాయడమైనది.

**రాజమండ్రి వాస్తవ్యులైన యం. దేవదాసు అయ్యగారి ఉపదేశముద్వారా పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి నేర్చుకొని ఇట్టి పుస్తకమును వ్రాయగలిగితిమి.** అందుకు ప్రభువునకు స్తోత్రమును, మహిమయు కలుగునుగాక!

ఆయన బసలోనికి మేము ముప్పదిమందిమి తరచుగా వెళ్ళి కొన్ని సంగతులను నేర్చుకొనేవారము. అయితే 1935వ సంవత్సరములో ఒక ప్రశ్న వేసినాము. 'పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి మాకు ఎన్నడును బోధించలేదు, ఎందుచేత అని ప్రశ్నించగా; అందుకాయన ఇది మన మిషన్ సిద్ధాంతములలో లేదు గనుక నేను బోధించలేదు అని జవాబిచ్చినారు. 'బైబిలులో ఉన్నదా?' అని మేము అడిగినాము, ఆయన ఉన్నదని చెప్పినారు. అలాగైతే అది మాకు పూర్తిగా వివరింపవలసినదని పట్టుపట్టినాము. అప్పుడు ఆయన బోధించినారు. మేము ప్రత్యేకమైన ప్రార్థన కూటములు పెట్టుకొని వాడుకలో పెట్టుకొన్నాము. మాలో చాలమందికి కుమ్మరింపు కలిగినది. భాషలు వచ్చినవి. అర్థములు, దర్శనములు కలిగినవి. అప్పుడు ఈ సిద్ధాంతములు నిజమని దృఢమైనదిగాని పిశాచి తన పనిని

చేయలేదని మాత్రము మేము చెప్పలేము. **ఈ బోధ మేమనుకొనని సమయమందు తెలుసు కొనవలెనని వేసిన ప్రశ్న మూలముగా దానంతట అదే బయటకు వచ్చినది. కాబట్టి ఇది దైవికమని మేము గ్రహించుచున్నాము.** ఈ బోధ స్థలాంతరములందు బోధించుచున్న కె. విజయరత్నంగారు అప్పుడప్పుడు నేను పోగుచేసిన పుస్తకములోని అంశములను వరుసగా పెట్టుటలోను, అచ్చువేయించుటలోను చేసిన సహాయమునకు కృతజ్ఞుడనైయున్నాను.

1. మనకొక బోధ క్రొత్త బోధగా తోచినయెడల, ఇది బైబిలులో ఉన్నదా? అను ప్రశ్నవేసికొనవలెను. బైబిలులో ఉంటే తప్పక అంగీకరించపవలయును (అపో॥కార్య॥ 17:11,12).

2. 'ఇది బైబిలులో లేదుగాని బైబిలు బోధకు సరిపోయినదా!' అనికూడ ప్రశ్నించుకొనవలయును. సరిపోతే సమ్మతింపవలెను.

3. బైబిలులో ఉన్నదిగాని వాడుకలో లేదుకదా! అని అందురేమో. అలాగైతే వాడుకలోనికి తెచ్చుకొనుట మంచిదేకదా? పరిశుద్ధాత్మ బాప్తిస్మమట్టిదే.

4. 1) దేవుడు తన బల్లమీద మన నిమిత్తమై అనేకమైన దానములు పెట్టియుంచినాడు. మన ఇష్టము వచ్చినవి తీసుకొని మనము వాడుకొనవచ్చును. వాటిలో ఒకటి పరిశుద్ధాత్మ బాప్తిస్మము. "పౌలైనను, అపోల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను, జీవమైనను, మరణమైనను, ప్రస్తుతమందున్నవియైనను రాబోవునవైనను సమస్తమును మీవే. మీరు క్రీస్తువారు, క్రీస్తు దేవునివాడు" అని 1కొరింథి. 3:22-23లో లేదా?

2) "అందుకతడు కుమారుడా! నీవెల్లప్పుడు నాతోకూడ ఉన్నావు. నావన్నియు నీవి'' (లూకా. 15:31) అని ఉపమానములోని తండ్రి పెద్దకుమారునితో అనెను. పరలోకపు తండ్రియు ఈలాగు అనే తండ్రియైయున్నాడు.

5. పరిశుద్ధాత్మ బాప్తిస్మమునుగూర్చి వ్రాసిన ఈ చిన్న పుస్తకములోని ప్రశ్నలకు సాధ్యమైనంతవరకు స్వంత వ్యాఖ్యానము లేకుండా బైబిలు వాక్యములతోనే ప్రత్యుత్తరములు వ్రాయబడినవి.

6. ఒక సంగతి సరియైనదో కాదో పని నిశ్చయము తెలియనప్పుడు ఎదిరింపవద్దు అనియు, ఖండింపవద్దనియు, ఊరకుండవలసినదనియు నా సలహాయైయున్నది. తప్పు అని నిశ్చయము తెలిసినప్పుడు గద్దింపవలెను, ఖండింపవలెను. ఆత్మవల్ల నడిపించబడితేనే గాని అదియు చేయకూడదు.

7. (1) స్తెఫనుయొక్క పని పరిశుద్ధాత్మ పూర్ణమైనదై యుండెను గాని ప్రజలు అది గ్రహింపలేకపోయిరి. అందుచేత వారు మాటలాడకుండ ఊరకుండవలసినది, కాని ఎదిరించినారు కాబట్టి ఆయన "ముష్కరులారా! హృదయములను చెవులను దేవుని వాక్యమునకు లోపరచనొల్లనివారలారా! మీ పితరులవలె మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మను ఎదిరించుచున్నారు" అని ఖండింపవలసి వచ్చెను (అపో॥కార్య॥ 7:51).

(2) "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి. విమోచన దినము వరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు" అని ఎఫెసీ. 4:30లో నున్నది.

(3) అలాగే పరిశుద్ధాత్మ బాప్తిస్మకాలమందు పేతురు చేసిన బోధను అంగీకరింపని వారి విషయములో ఆయన ఇట్టి మాటలే చెప్పవలసివచ్చెను. "మీరు మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడి" (అపో॥కార్య॥ 2:41).

8. Sour's History of the Christian Church Vol 3 PP. 406 "Dr. Martin Luther was a prophet, evangelist speaker in tongues and interpreter, in one person, endowed with all the gifts of the spirit."

సవరు దొరగారు వ్రాసిన సంఘచరిత్ర 3వ సంపుటము 406వ పేజీలో ఈ మాటలున్నవి. "డాక్టరు మార్టిన్ లూథరు, ప్రవక్త, బోధకుడు, భాషలతో మాటలాడువాడును, అర్ధము చెప్పువాడునై యుండెను. ఒకనియందే ఆత్మవరములన్నియు కలిగియుండెను. ఈ సంగతి ఎప్పుడైనా విన్నారా?

9. (Spirituals PP, 75-76) 'D.L. Moody stood up in London at a great convention and began to read the Bible but he was not able to do so as he came out in tongues: again he tried, but failed.'

స్పిరిచ్యుయల్స్ అను పుస్తకములో 75-76 పేజీలలో ఈలాగున్నది : 'డి.యల్. మూడీ దొరగారు లండన్‌లో ఒక గొప్ప సభయందు నిలువబడి బైబిలు చదువుట ప్రారంభించెను. అయితే భాషలు వచ్చుటచేత ఆగవలసివచ్చెను. మరల చదువుటకు ప్రయత్నము చేసెను కాని లాభము లేకపోయెను.

10. లూథరన్ కంపేనియన్ అను ఇంగ్లీషు పత్రికలో పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందవలసియున్నదని వ్రాయబడియున్నది.

11. ప్రియమైన చదువరులారా! ఒక మనవి. ఈ చిన్న పుస్తకము నలగజదివి తరువాత మోకాళ్ళూని ఈ పుస్తకములోని సంగతులు సత్యమైనవో కావో పరిశుద్ధాత్మను అడగండి. ఆయనే మీకు బయలుపరచును. యేసుక్రీస్తు ప్రభువునొద్ద మూడు సంవత్సరముల ఆరుమాసములు ఉపదేశముపొంది, ఆయన చరిత్రను స్వయముగా చూచిన శిష్యులు సహితము పదిరోజులు ఎడతెగక ప్రార్థనలో ఉండి కనిపెట్టితేనేగాని పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందలేకపోయిరి.అట్టి అభిషేకము మనకు కావలసిన యెడల మనకెంత కాలము పట్టునో! గనుక పరిశుద్ధాత్మనుగాని, పరిశుద్ధాత్మకు సంబంధించిన పనులుగాని తృణీకరింపకండి.

12. ఈ దినములలో అనేకమంది పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి ప్రశ్నలు వేయుచున్నందువలన వారు, వీరు చెప్పుచున్న మాటలుగాక బైబిలులో ఏమి ఉన్నదో చూపించుటకై ఈ పుస్తకము వ్రాయబడినది.

పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించిన బోధ పెంతెకొస్తు మిషను బోధ గనుక అంగీకరించకూడదని కొందరనుచున్నారు. ఇట్లు అనే సందడిలో పడిపోయి **'ఇది బైబిలు బోధ'** అనే మాట మరచిపోవుచున్నారు. పొందవలసిన మహోపకారము మీరు పొందకుండ మీ అనుమానపు మాటే మీకడ్డు. క్రైస్తవసంఘము పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము మూలముగ జన్మించెను

గనుక పెంతెకొస్తు మిషను కాదుగాని 'పెంతెకొస్తు సంఘము' అని చెప్పుట సత్యమునకు దూరముకాదు. ఆదికాల క్రైస్తవమత సంఘారంభమందున్న పరిశుద్ధాత్మ బాప్తిస్మమును ఈ కాల సంఘము : 1) "ఇది పెంతెకొస్తు మిషను బోధ అనే వంకమీదను; చిన్నతనమందు నీళ్ళ బాప్తిస్మము పొందినప్పుడే పరిశుద్ధాత్మ బాప్తిస్మముకూడ పొందినాము అను వంకమీదను; ఇది అవలంభించిన వారిలో ఇంకను లోపములున్నవిగనుక ఇది సరికాదు అనే వంకమీదను; ఇది మనకుకాదు అనే వంకమీదను; లేకుండ చేసుకొంటే ఏమనగలము? 2) ఆ విధముగనే "గుర్తులు అయిపోవుచున్నవి గనుక క్రీస్తురాకడ సమీపించుచున్నది" అని ఎవ రైన అంటే, 'అదిగో అడ్వెంటిస్టు వారి బోధ తెచ్చిపెట్టుచున్నారు అని ఆ వంకమీద కొందరు ఆయన రెండవ రాకడకు సిద్ధపడకుండ ఉంటున్నారు. సంవత్సరము నిర్ణయముచేయుట, తప్పుడు లెక్కలలోనికే వెళ్లుచున్న మాట వాస్తవమే అయిననూ, తెలివితేటలును విశ్వాసమును గలిగి సంగతులు గమనించవలెను.

షరా:- చదువరులందరు ఈ పన్నెండు సలహాలను గమనించుచు, ఈ పుస్తకము చదువవలెనని నా కోరికయైయున్నది.

జూన్ 1937

**N.D. ఫిలిప్సన్**

ధవళేశ్వరం.

# నా అభిప్రాయము

ప్రియ చదువరులారా! ఈ పుస్తకములోని సంగతుల నన్నిటికిని నేనును పూచీదారుడనైయున్నాను. ఎందుచేతనంటే ఈబోధలనన్నిటిని ఉపదేశించినవారు నా ఆత్మీయ తండ్రియును, గురువును అగు యం. దేవదాసు అయ్యగారే. గాని వీటన్నిటిని వ్యాపింపచేసినవాడను నేను గనుక పూచీ నాకును కలిగియున్నది. ఎవరైనా ఈ అంశములమీద ఏ ప్రశ్నవేసిన జవాబు చెప్పుటకు నేను సిద్ధముగా నున్నాను. ఈ బోధను ఎదిరించేవారు అనేకులు ఉన్నందువలన ఇట్లు వ్రాయవలసివచ్చెను. నన్నడిగేవారికి బైబిలు వాక్యములనుబట్టియు, నా స్వంత అనుభవమునుబట్టియు, నా మనస్సాక్షినిబట్టియు, ఇతరుల అనుభవచరిత్రనుబట్టియు ఋజువు పరచుచు సమాధానము చెప్పగలవాడను. ఇది గర్వపువ్రాతగా భావించకండి. ఈ సంగతులు నేను ప్రార్థన పూర్వకముగా ఆలోచించిన సంగతులే. ఇదివరకు నన్ను అడిగినవారికి నేను సమాధానము చెప్ప యత్నించినపుడు, పరిశుద్ధాత్మ తండ్రి వాక్కు అనుగ్రహించినట్లు ఇకముందునకు కూడ అనుగ్రహిస్తారని విశ్వసించు చున్నాను. నా స్నేహితుడైన ఫిలిప్సన్‌గారు ఈ పుస్తకము వ్రాసిన తరువాత నేను అన్నియు చదివితిని. అన్నియు సరిగానే యున్నవి. మిషనెరీలైనను, పాస్టరులైనను, బైబిలు తెలిసిన మరెవరైనను బైబిలు పాండిత్యము లేనివారైనను, సంగతి తెలిసికొనవలెనని అడిగే సామాన్యులైనను నాతో వాదములకు ఢీగొనక, శాంతముగా సంభాషించినయెడల, అడిగిన ప్రతిదానికి ఉత్తరము చెప్పగల వాడను. ఏ మాత్రము సందేహించను. ఇది నా ఉద్యోగ ధర్మము. ఇది నా ఆనంద సేవ. ఆంధ్ర క్రైస్తవులు

ఆత్మతో నింపబడుటకిదియే అమూల్యమగు అవకాశము. ఆలస్యములేక అవలంభించువారు, ఆశ్చర్యానుభవము నొందగలరు. ఇది నా స్వానుభవ సాక్ష్యమై యున్నది. ఈ పుస్తకము లూథరన్ వారికి మాత్రమే కాదుగాని, ఆంధ్ర క్రైస్తవులకందరకు అత్యవసరమగు గ్రంథము. గనుక మన తెలుగు దేశములో నున్న క్రైస్తవులందరు మిషను భేదములేక దీనిని గైకొని, చదివి ఆలోచించి, అవలంభించి క్రీస్తు ప్రభువు కొరకు బ్రతుకవలెనని నా కోరిక.

**'విమలాత్మ ప్రోక్షణ'** అను ఈ గొప్ప అనుభవ అంతస్థును ఇంత కాలమునకు బైలుపరచిన ప్రభువునకు స్తోత్రములు. ఇంకా మిగిలియున్న మర్మములు దేవుడు సకాలమందు బైలుపరచును గాక! చదువరులకు గ్రహించి నమ్మే హృదయము ప్రభువు అనుగ్రహించునుగాక!

తప్పులుపట్టే ఉద్దేశమునకును, మంచిదైనా ఇదివరకు లేనివి ఇప్పుడెందుకు అనే తలంపునకును, అందరును విరోధించు చుండగా ఈ బోధ మానివేయకూడదా! అను ఆలోచనకును చదువరులు దూరస్థులై **ఇది దైవవాక్యానుసారము గనుక అవలంభించవలసినదే** అను తీర్మానము పక్షముగా నుందురు గాక!

"మాకు కాదు, యెహోవా మాకు కాదు, నీ కృపా సత్యములను బట్టి నీ నామమునకే మహిమ కలుగును గాక! (కీర్తన. 115:1).

స్వతంత్రసువార్త ప్రచారకుడు
**షారోను గృహము**
రాజమండ్రి, 26-6-1937.

ఇట్లు
క్రీసునందలి
**కె. విజయరత్నము**

# విమలాత్మ ప్రోక్షణము

గ్రంథకర్త

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు -2019 చందా : 10.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1973 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1983 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1990 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1994 | ప్రతులు | 2000 |
| ఐదవ | ముద్రణ | 1996 | ప్రతులు | 5000 |
| ఆరవ | ముద్రణ | 2011 | ప్రతులు | 5000 |
| ఏడవ | ముద్రణ | 2018 | ప్రతులు | 2000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |

**ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన**

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

Bible Mission HQ Guntur